తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
వరంగల్
: fb.com/vaartha Digital
Published from Warangal, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
8-3-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 36 పేజీలు: 8+16 వెల: 8.00




SHOWROOM: TELANGANA: RENAULT LB NAGAR Ph: 9311700671.



పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్‌లో శనివారం జరిగిన 9వ అంతర్జాతీయ సంతల్ సదస్సులో అవార్డులను అందజేస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

# ప్రొటోకాల్ వైఫల్యమా?

>>అలాగే రాష్ట్ర పర్యటనకు వచ్చిన తనకు ముఖ్యమంత్రి లేదా మంత్రుల నుంచి అధికారిక స్వాగతం లభించలేదని పేర్కొన్నారు. ఆదివాసీ సదస్సుకు తాను ముఖ్య అతిథిగా హాజరు కావాల్సి ఉందని తెలిపారు. దీనికి ప్రభుత్వం అనుమతించకపోవడం ఏమిటని ఆమె ప్రశ్నించారు. ఇంత చేసినప్పటికీ తనకు ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై ఎలాంటి ద్వేషం లేదని, ఆమె తన సోదరితో సమానమని అన్నారు. కానీ ఆమె కోపంగా ఉండవచ్చని వ్యాఖ్యానించారు. బెంగాల్ గవర్నర్ ట్రాన్స్ ఫర్ అయినందున స్వాగతం పలకలేకపోయారని తనకు తెలుసని అన్నారు. తానుకూడా బెంగాల్ బిడ్డనే అని అన్నారు. 9వ అంతర్జాతీయ సంతాల్ సదస్సులో ప్రసంగించడానికి రాష్ట్రపతి బెంగాల్‌లోని సిలిగురికి వెళ్లారు. ప్రోటోకాల్ ప్రకారం రాష్ట్రానికి వచ్చిన రాష్ట్రపతికి ముఖ్యమంత్రి లేదా ప్రభుత్వంలోని సీనియర్ అధికారులు స్వాగతం పలకాలి. కానీ అధికారికంగా స్వాగతం పలకడానికి ప్రభుత్వం తరఫున ఎవరూ రాలేదు. అంతర్జాతీయ సంతాల్ సదస్సును బిధాన్ నగర్‌లో నిర్వహించాల్సి ఉండగా, అధికారులు సిలిగురిలోని గోసాయిన్ పూర్‌కు మార్చారని ద్రౌపది ముర్ము తెలిపారు. సంతాల్ సదస్సుకు పెద్ద ఎత్తున సంతాల్ ఆదివాసీలు తరలి వస్తుండటం తాను చూశానని, కానీ వారిని కొంతమంది అడ్డుకున్నారని ఆరోపించారు. సంతాల్ జాతీయులు ఏకంకావడం, చదువుకోవడం, బలోపేతం కావడం వారికి ఇష్టం లేనట్లుగా ఉందని అన్నారు.

# స్వచ్ఛదనం.. పచ్చదనమే అజెండా

## పల్లెల్లో ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళికలు

## 99 రోజుల కార్యాచరణలో వివిధ కార్యక్రమాలు

### అన్ని శాఖలకు సిఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి7:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని రాష్ట్రమంతటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్ని శాఖలకు దిశానిర్దేశం చేశారు. అందులో భాగంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఈ కార్యక్రమంలో కీలక పాత్ర పోషించనుంది. ఆరు స్థాయిల్లో వినూత్న కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించింది. మొట్టమొదటగా పల్లెపల్లెనా పారిశుధ్యంపై దృష్టి పెట్టనుంది. తాగు నీరు, చెత్త నిర్వహణ, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, రాబోయే వర్షాకాల ముందస్తు పనులపై దృష్టి పెట్టే ప్రణాళికను తయారు చేసింది. ఏ రోజుకారోజు విభిన్న కార్యక్రమాలతో జనంలోకి వెళ్లేందుకు వీలుగా షెడ్యూలు నిర్ణయించుకుంది. సుపరిపాలనతో గ్రామీణ వ్యవస్థను బలోపేతం చేసేందుకు వీలుగా ఈ ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. 1. గ్రామీణ పరిశుభ్రత కార్యక్రమాలు - మార్చి 6 నుంచి మార్చి 15 వరకు, 2. గ్రామాల ఆదాయం పెంపు చర్యలు - మార్చి 16 నుంచి 31 వరకు,3. తాగునీటి సరఫరా - ఏప్రిల్ 1 నుండి ఏప్రిల్ 15 వరకు,4. చెత్త తొలగింపు, చెత్త నిర్వహణ - ఏప్రిల్ 16 నుండి 30 వరకు,5. మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం - మే 1 నుంచి మే 15 వరకు,6. వానాకాలానికి ముందస్తు పనులు ఏర్పాట్లు - మే 16 నుంచి మే 31 వరకు కొనసాగనున్నాయి. గ్రామీణ పరిశుభ్రత కార్యక్రమం:-రహదారుల శుభ్రత, కాలువల మురుగు తొలగింపు, పాఠశాలలు, అంగన్‌వాడీలు, మార్కెట్లు, హాస్టళ్లు, బస్‌స్టాండ్ల శుభ్రపరచడం, రహదారుల పక్కన, ఖాళీ ప్రదేశాల్లో పొదలను తొలగించడం, ఉపయోగంలో లేని బావులను మూసివేయడం, బ్లీచింగ్ పౌడర్, సున్నం చల్లడం, ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ శుభ్రపరచడం, అవసరమైన సిబ్బంది, సామగ్రి కోసం ప్రణాళిక తయారు చేయడం, ఖర్చులు గ్రామపంచాయతీ సాధారణ నిధులు, రాష్ట్ర, కేంద్ర ఆర్థిక నిధులను వినియోగించడం వంటివి నిర్వహించాల్సి ఉంటుంది. .గ్రామాల ఆదాయం పెంపు, సీసీ రోడ్ల నిర్మాణం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కార్యక్రమాలు, తాగునీటి సరఫరాలో చేపట్టేవి:- తాగునీటి సరఫరా ఇబ్బందులను తెలుసుకోవడం, దాని పూర్తిగా పనిచేసేలా చేయడం, ముందస్తు చర్యలు, గ్రామపంచాయతీ నిధులు,15వ ఫైనాన్స్ కమిషన్ నిధులను వినియోగించడం, మార్చి 27లోపు అవసరమైన సామగ్రిని కొనుగోలు చేయడం, చేయాల్సిన పనులు, హ్యాండ్ పంపుల మరమ్మత్తులు, సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్ మోటార్ పంపుల మరమ్మత్తులు, ఓవర్ హెడ్ ట్యాంకుల మరమ్మత్తులు, కొత్త ఇళ్లకు తాగునీటి కనెక్షన్లు ఇవ్వడం, ఈ పనులు గ్రామపంచాయతీ స్థాయిలో మున్సిపల్ శాఖతో సమన్వయం చేయాలి. చెత్త సేకరణ.. చెత్త నిర్వహణ:- ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్తను వేరుగా సేకరించడం, ప్రతి గ్రామపంచాయతీలో కంపోస్ట్ తయారు చేయడం, చెత్త నిర్వహణపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం, ఈవేస్ట్, బయోమెడికల్ వేస్ట్, శానిటరీ వేస్ట్‌ను సురక్షితంగా సేకరించి తొలగించడం, వ్యక్తిగత మరుగుదొడ్లు, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్సులు పూర్తి చేయడం, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ యూనిట్లు ఏర్పాటు చేయడం, కమ్యూనిటీ సోక్ పిట్స్ నిర్మించడం. ఉపాధి హామీలో చేపట్టేవి:- నీటి సంరక్షణ పనులు, వ్యక్తిగత లబ్ధిదారుల పనులు, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంటుంది. వర్షాకాలానికి ముందస్తు సన్నద్ధత:- వర్షపు నీటి కాలువల మురుగు తొలగించడం, లోతట్టు ప్రాంతాలను మట్టి నింపడం, దోమల నివారణకు మందులు పిచికారీ చేయడం, ఫాగింగ్ డ్రై డే కార్యక్రమాలు నిర్వహించడం, మొక్కల నాటకం, నరేగా పథకం ద్వారా గుంతలు తవ్వడం, మొక్కలు నాటేందుకు ప్రదేశాలు గుర్తించడం, నాటే మొక్కలను ఎంపిక చేయడం, రోడ్లు, భవనాల సంరక్షణ, గ్రామీణ రోడ్ల మరమ్మత్తులు, డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్‌లో ఉన్న రోడ్ల సంరక్షణ, బీటీ రోడ్లను శుభ్రపరచడం, కిలోమీటర్ రాళ్లు, సమాచారం బోర్డులు, సైన్ బోర్డులు పునరుద్ధరించడం, భవనాల సంరక్షణ, పైకప్పుల పగుళ్లను సరిచేయడం, ఆయా భవనాల టెర్రస్ శుభ్రపరచడం, భవనాలకు పెయింటింగ్ చేయడం వంటివి నిర్వహించాల్సి ఉంటుంది.

# చిరంజీవికి ఎన్టీఆర్ అవార్డు

## గద్దర్ ఫిల్మ్ అవార్డులు -2025 ప్రకటించిన జ్యూరీ

**హైదరాబాద్, మార్చి 7, ప్రభాతవార్త:** గద్దర్ ఫిల్మ్ అవార్డులు 2025కు సంబంధించి ఖరారైంది. జ్యూరీ చైర్మన్ మణిశర్మ ఆధ్వర్యంలో విజేతల జాబితాను శనివారం అధికారికంగా వెల్లడించారు. మెగాస్టార్ చిరంజీవికి ఎన్టీఆర్ నేషనల్ అవార్డ్ ప్రకటించారు. అలాగే విలక్షణ నటి జయసుధకు అక్కినేని నాగేశ్వర రావు అవార్డ్ దక్కింది. ఉత్తమచిత్రంగా రాజ్ వెడ్స్ రాంబాయి, ఉత్తమ నటుడిగా తండేల్ చిత్రానికి గానూ నాగచైతన్య, ఉత్తమ నటిగా రష్మిక మందన్న ఎంపికయ్యారు. కాంతారావు అవార్డుఆర్ నారాయణ మూర్తి, బీఎన్ రెడ్డి అవార్డు సింగీతం శ్రీనివాసరావు, పైడి జయరాజ్ అవార్డు కమల్ హాసన్ కు వరించగా, సినారె అవార్డు సుద్దాల అశోక్ తేజ, రఘుపతి వెంకయ్య అవార్డుకు రమేశ్ ప్రసాద్‌ను ఎంపిక చేశారు. అంతకు ముందు జ్యూరీ 2025వ సంవత్సరానికి గానూ తుది జాబితాను జ్యూరీ సభ్యులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు అందజేశారు. ప్రజా భవన్లో తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు, నటుడు తనికెళ్ల భరణి, రోజా రమణి, మణిశర్మ, ప్రగతి తదితరులు భట్టితో భేటీ అయ్యారు. అవార్డుల ఎంపిక ప్రక్రియ, వేడుక నిర్వహణపై వారు చర్చించారు. అనంతరం జ్యూరీ చైర్మన్ మణిశర్మ ఆధ్వర్యంలో

**విజేతల జాబితాను అధికారికంగా వెల్లడించారు.**

ఉత్తమ చిత్రం-రాజు వెడ్స్ రాంబాయి
ఉత్తమ నటుడు-నాగ చైతన్య (తండేల్)
ఉత్తమ నటి-రష్మిక మందన్న (ది గర్ల్ ఫ్రెండ్)
ఉత్తమ ద్వితీయ చిత్రం-దండోరా
ఉత్తమ తృతీయ చిత్రం-ది ఫ్రీ వెడ్డింగ్ షో
నేషనల్ ఇంటిగ్రిటీ సినిమా-తండేల్
స్పెషల్ జ్యూరీ అవార్డులు:
ఎన్టీఆర్ నేషనల్ అవార్డు-చిరంజీవి
పైడి జైరాజ్ అవార్డు-కమల్ హాసన్
సినారే అవార్డు-సుద్దాలఅశోక్ తేజ
రఘుపతి వెంకయ్య అవార్డు-రమేశ్ ప్రసాద్
అక్కినేని నాగేశ్వరరావు అవార్డు-జయసుధ
నాగిరెడ్డి చక్రపాణి అవార్డు-అశ్వినీదత్
బీఎన్‌రెడ్డి అవార్డు-సింగీతం శ్రీనివాసరావు
కాంతారావు అవార్డు-ఆర్.నారాయణమూర్తి
ఉత్తమ సోషల్ మెసేజ్ సినిమా-కోర్ట్
ఉత్తమ డాక్యుమెంటరీ-యూనిటీ
ఉత్తమ ప్రజాదరణ చిత్రం-సంక్రాంతికి వస్తున్నాం
బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ పరిచయ దర్శకుడు-సాయి మార్తాండ్ (లిటిల్ హార్ట్స్)
ఉత్తమ బాలల చిత్రం-అనగనగా
ఉత్తమ సహాయ నటుడు-శివాజీ

## వారం - వర్జ్యం

08-03-2026, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, పూర్వాభాద్ర కార్తె
పంచమి రా.9.13
స్వాతి మ.1.33
వర్జ్యం : రా.7.46-9.33
దు.ఉ.4.38-5.26
శుభసమయం:ఉ.5.30-6.30,సా.6.30-7.00
రాహుకాలం సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం:** సుదూర ప్రాంతాలలో ఉన్న మీ ఆప్తులకు మీ అనునయ వాక్యాల ద్వారా ధైర్యం చెప్పుతారు. ఆరోగ్య విషయంజాగ్రత్త.

**వృషభం:** బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తారు. కొన్ని ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు తొలగి పోతాయి. వాహనసౌఖ్యం.

**మిథునం:** ఋణబాధల నుండి కొంత ఉపశమనం పొందుతారు. కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. వస్త్రలాభం కలదు.

**కర్కాటకం :** విహారయాత్రలు, సంతాన సంక్షేమ కార్యక్రమాలకు అధికంగా ధనవ్యయం చేయవలసి వస్తుంది.

**సింహం:** అపాత్రదానం చేయడం వలన వచ్చే అనర్థాలను ఎదుర్కొనవలసి రావచ్చు. బ్యాంక్ లావాదేవీలు అనుకూలం.

**కన్య :** ఆర్థిక లావాదేవీలు సంతృప్తికరంగా ఉంటాయి. సన్నిహితుల నుండి ముఖ్య సమాచారం అందుకుంటారు. వస్త్రలాభం.

**తుల :** దూరపు బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. జీవితభాగస్వామి సలహాలను సంప్రదింపులను తీసుకుంటారు.

**వృశ్చికం:** మీపైన పిటిషన్లు విచారణలు పెద్దగా ప్రభావం చూపించవు. స్థిరాస్తులు అమ్మేటప్పుడు జాగ్రత్తగా ఉండండి.

**ధనుస్సు:** నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. ఇంటిలో శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది. అపూర్వమైన వస్తువులు కొనుగోలు.

**మకరం:** మీరంటే ఇష్టం లేని వ్యక్తులు మిమ్మల్ని నిందారోపణలకు గురిచేస్తారు. వ్యాపార విషయాలలో నిదానంగా వ్యవహరించండి.

**కుంభం:** మానసిక ప్రశాంతతకు భంగం కలిగించే ఎటువంటి అంశాలను ఏ మాత్రం లెక్కపెట్టరు. ప్రయాణాలు.

**మీనం :** కార్యాలయాలలో మీ పనితీరు మెరుగ్గా ఉంటుంది. వ్యాపారంలో మీ ప్రతిభా పాటవాలను కనబరుస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మావోయిస్టులు మరో 130

>> నక్సలైట్ల విషయంలో తమ ప్రభుత్వం ఎప్పుడూ శాంతియుత కోణంలోనే చూసిందని ఆయన తెలిపారు. ఇదే విషయాన్ని తాను కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు వెల్లడించామని ఆయన తెలిపారు. లొంగిపోయిన నక్సలైట్లకు ఇస్తున్న పునరావాసం ఇప్పుడున్న పరిస్థితుల్లో సరిపోవడం లేదని, దీనిని పెంచే విషయమై కేంద్ర హోం మంత్రితో తాను చర్చించానని, రివార్డుల మొత్తం కూడా పెంచే విషయాన్ని చర్చించానని సిఎం తెలిపారు. అయితే ఆయుధాల విషయంలో రాష్ట్రంతో పాటు కేంద్రం వైఖరి ఒకటేనని ఆయన స్పష్టం చేశారు. ఆయుధాలు కేవలం భద్రతా బలగాల వద్ద మాత్రమే వుండాలని, ఎవరుపడితే వారు ఆయుధాలను ధరించి ఇష్టం వచ్చినట్లు చేస్తానంటే కుదరదని, ఈ విషయంలో కఠినంగా వుండాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారని, తన వైఖరి కూడా ఇదేనని సిఎం వెల్లడించారు. మావోయిస్టులు ఆయుధాలను వీడాల్సిందేనని, లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవాలని, ప్రజల సమస్యల కోసం చట్టపరంగా పోరాడాలని, ఇందుకు తాము కూడా సహకరిస్తామని సిఎం హామీ ఇచ్చారు. ఇటీవల లొంగిపోయిన మావోయిస్టు అగ్ర నేతలు దేవ్‌జీ, రాజిరెడ్డి బడె చొక్కారావు తదితరులతో తాను భేటీ అయ్యానని, ఈ సందర్భంగా వారు తమ డిమాండ్లను తన ముందు వుంచారని సిఎం తెలిపారు. లొంగిపోయిన అగ్ర మావోయిస్టు నేతల డిమాండ్ల విషయంలో తాను చట్ట పరిధిలో చేస్తానని హామీ ఇచ్చానని, ఇందులో రాష్ట్రపరిధిలో కొన్ని వుంటే, మిగతావి కేంద్రం పరిధిలో వుంటాయని ఆయన తెలిపారు. మావోయిస్టు అగ్ర నేతల డిమాండ్లను తాను కేంద్ర హోం మంత్రి అమిత్ షా వద్ద ప్రస్తావించానని, వారికిచ్చే రివార్డులను పెంచాలని కోరానని, నక్సలైట్ల డిమాండ్లు చట్ట పరిధిలోనే వుండాలని అమిత్ షా సూచించారని సిఎం తెలిపారు. లొంగిపోయిన నక్సలైట్లకు పునరావాసం కల్పించాలని, ఆయుధాలు వీడిన వారిని స్వాగతించాలని, ఈ విషయంలో కచ్చితంగా వుండాలని అమిత్ షా చెప్పారని సిఎం వెల్లడించారు. నక్సలైట్ల విషయంలో తమ ప్రభుత్వం సానుకూలంగానే వుందని, అయితే వారంతా లొంగిపోయి సాధారణ జీవనం గడపాలని, ఇందుకు కావలసిన మౌలిక వసతులను తాము కల్పిస్తామని సిఎం హామీ ఇచ్చారు. లొంగిపోయిన వారు సాధారణ జీవనం సాగించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తామని సిఎం భరోసా ఇచ్చారు. లొంగిపోయిన వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని, అవకాశాన్ని బట్టి ఇళ్ల స్థలాలు కేటాయించే అంశాన్ని పరిశీలిస్తామని సిఎం హామీ ఇచ్చారు. నక్సలైట్లు భారీగా లొంగిపోవడం వెనుక కృషి చేసిన డిజిపి శివధర్ రెడ్డి, ఎస్ఐబి ఐజి సుమతిని సిఎం కొనియాడారు.

**గణపతి సహా అజ్ఞాత నక్సలైట్లంతా లొంగిపోవాలి**

మావోయిస్టులు వరుసగా లొంగిపోతున్న తరుణంలో అజ్ఞాతంలో వున్న అగ్రనేత గణపతి సహా మిగతా వారు కూడా జనజీవన స్రవంతిలో కలవాలన్నది తన ధ్యేయమని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. వయో భారంతో బాధపడుతున్న గణపతి లొంగిపోవాలని ఆయన పుట్టి పెరిగిన గ్రామవాసులు కూడా కోరుకుంటున్నారని సిఎం తెలిపారు. తొలితరం నక్సలైట్ నాయకుడు కొండపల్లి సీతారామయ్య తరువాత గణపతికి అంతటి పేరు వుందని సిఎం ఈ సందర్భంగా తెలిపారు. గణపతి లొంగిపోతే ఆయనకు రక్షణ కల్పిస్తామని సిఎం హామీ ఇచ్చారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధిని అందరు కాంక్షించాలని, శాంతి వుండేలా చూడాలని సిఎం కోరారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో నక్సలైట్లతో పాటు అందరు భాగ స్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. అజ్ఞాతంలో వున్న వారి డిమాండ్ల విషయంలో సానుకూలంగా పరిశీలిస్తామని, వారంతా ఆయుధాలు వీడి లొంగిపోవాలని ఆయన పిలుపునిచ్చారు. నక్సలైట్లు అంతా లొంగిపోయాక వారిపై వున్న నిషేధాన్ని ఎత్తివేస్తారా...? అన్న ప్రశ్నకు సిఎం సమాధానం ఇస్తూ నిషేధం వున్నా...లేకున్నా...ఒకటేనని తెలిపారు. లొంగిపోయిన నక్సలైట్లు రాజకీయ పార్టీలో చేరితే నష్టం లేదని, వారు ఏ పార్టీలో అయినా చేరవచ్చని, కాంగ్రెస్ పార్టీలో చేరాలనుకుంటే గాంధీ భవన్‌లో తమ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో మాట్లాడాలని సిఎం సూచించారు. అయితే లొంగిపోయిన వారు చాలా కాలం తరువాత తమ కుటుంబ సభ్యులతో ఆనందంగా వున్నారని, వారిని కొంతకాలం ఇలాగే వుండనివ్వాలని సిఎం కోరారు. అనంతరం జరిగిన ఓ కార్యక్రమంలో తెలంగాన నుంచి ఇటీవల లొంగిపోయిన ఐదుగురు నక్సలైట్లకు సిఎం రివార్డులు అందించా రు. ఈ కార్యక్రమంలో డిజిపి శివధర్ రెడ్డితో పాటు గ్రే హౌండ్స్ అదనపు డిజి అనిల్ కుమార్, నిఘా విభాగం అధిపతి విజయ్ కుమార్, ఎస్ఐబి ఐజి సుమతి తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ, పిజిలో ఎన్ఇపి

>> నాక్, ఎన్ఐఆర్ఎఫ్, ఎన్‌బిఏ, నేషనల్ క్రెడిట్ ఫ్రేమ్‌వర్క్ వంటి సంస్థల గుర్తింపు, ర్యాంకింగ్ వ్యవస్థల్లో విశ్వవిద్యాలయాలకు మెరుగైన ప్రయోజనాలు లభించడంతోపాటు జాతీయ స్థాయి పోటీ నిధులు, పరిశోధన నిధులను ఆకర్షించే అవకాశాలు పెరుగుతాయన్నారు. మూడు సంవత్సరాల డిగ్రీకి కనీసం 120 క్రెడిట్లు, నాలుగు సంవత్సరాల హానర్స్, హానర్స్ విత్ రీసెర్చ్ డిగ్రీకి 160 క్రెడిట్లు, పీజీ కోర్సులకు కనీసం 80 క్రెడిట్లు ఉండే విధంగా క్రెడిట్ వ్యవస్థను అమలు చేయాలని నిర్ణయించారు. మైనర్ డిగ్రీలు, క్రెడిట్ నిర్మాణం, క్రెడిట్ బదిలీ విధానం, మల్టీడిసిప్లినరీ ప్రోగ్రామ్‌లు, మల్టిపుల్ ఎంట్రీ-మల్టిపుల్ ఎగ్జిట్ విధానం అమలుకు సంబంధించి మార్గదర్శకాలను రూపొందించేందుకు సంప్రదాయ విశ్వవిద్యాలయాల ఉపకులపతులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. 2026-27 విద్యా సంవత్సరానికి కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రన్స్ టెస్ట్ (సీపీజీఈటీ) నిర్వహణ బాధ్యతను వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయానికి అప్పగించారు. ఐదేళ్ల సమగ్ర కోర్సుల కోసం ప్రత్యేక ప్రవేశ పరీక్షను తగిన సమయంలో నిర్వహించే విషయాన్ని కూడా సూచించారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి, యూజీసీ సూచనల మేరకు కొత్త, అభివృద్ధి చెందుతున్న రంగాలలో కొత్త అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులను ప్రారంభించేందుకు వచ్చిన ప్రతిపాదనలను ఉపకులపతులు ఆమోదించారు. ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల ఏఈడీపీ కార్యక్రమాల విషయంలో యూనివర్సిటీలు తమ నియమావళి ప్రకారం అనుమతులు ఇవ్వడానికి తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి సమన్వయం చేస్తుందని నిర్ణయించారు. 2026-27 విద్యా సంవత్సరానికి అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల కోసం సాధారణ విద్యా క్యాలెండర్ (అల్మనాక్) రూపొందించడంలో విశ్వవిద్యాలయాలు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలితో సమన్వయం చేసుకోవాలని నిర్ణయించారు. విద్యాశాఖ జారీ చేసిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఈ నెల 6 నుంచి జూన్ 12 వరకు యూనివర్సిటీల స్థాయిలో అమలు చేయాలని వీసీలను ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ కోరారు. యూజీసీ మార్గదర్శకాల ప్రకారం సిలబస్ రూపకల్పన, క్రెడిట్ కేటాయింపు, థియరీ, ప్రాక్టికల్స్, ల్యాబ్‌లు, ఇంటర్న్‌షిప్‌లు, అప్రెంటిస్‌షిప్‌లకు అవసరమైన బోధనా గంటల నిర్ణయానికి సంబంధించి తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి రూపొందించిన మార్గదర్శకాలను కూడా సమావేశంలో ఆమోదించారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్-1 ప్రొఫెసర్ ఈ. పురుషోత్తం, వైస్ ఛైర్మన్-2 ప్రొఫెసర్ ఎస్.కె. మహమ్మద్, ఉన్నత విద్యా మండలి సెక్రటరీ ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ కుమార్ మొలుగారం, కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్ రెడ్డి, తెలంగాణ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ టి. యాదగిరి రావు, మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఖాజా ఆల్తాఫ్ హుస్సేన్, పాలమూరు విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ జి.ఎన్. శ్రీనివాస్, శాతవాహన విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ యు. ఉమేష్ కుమార్, వీరనారి చాకలి ఇలమ్మ మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ సూర్య ధనంజయ్ పాల్గొన్నారు.



నేపాల్ సార్వత్రిక ఎన్నికల్లో జఫా నియోజకవర్గం నుండి నాలుగుసార్లు ప్రధాని అయిన కె.పి. శర్మ ఓలిని 50 వేల ఓట్ల భారీ మెజారిటీతో ఓడించిన అనంతరం శనివారం సర్టిఫికేట్‌ను అందుకుంటున్న రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ అభ్యర్థి బాలేంద్ర షా

# అమెరికా రక్షణ రాడార్ ధ్వంసం

>> గల్ఫ్‌దేశం దుబాయ్ ఎయిర్‌పోర్టుపై మరోసారి ఇరాన్‌డ్రోన్లతో దాడిచేసింది. ఇరాన్ వ్యూహాత్మక దాడులకు ధీటుగా అమెరికా మిత్రదేశం ఇజ్రాయెల్ కూడా అంతేస్థాయిలోభీకర దాడులకు సిద్ధం అవుతోంది. ఇరాన్ ఏర్పాటుచేసుకున్న భూగర్భ క్షిపణి కేంద్రాలపై భారీ క్షిపణులతో దాడులుచేస్తోంది. 80కిపైగా యుద్ధవిమానాలు, 230 బాంబులతో ఇరాన్ భూగర్భ క్షిపణి ఫ్యాక్టరీపై దాడిచేసింది. అంతేకాకుండా డ్రోన్లు, క్షిపణులు బయటికి రాకుండా కాపలా వేసి మరీ దాడులుచేస్తుండటంతో ఇరాన్ రక్షణరంగపరంగా యుద్ధంలో నిర్వీర్యం అవుతున్నదని తెలుస్తోంది. ఖండాంతర క్షిపణులకు సంబంధించి నిల్వకేంద్రం, ఉత్పత్తికేంద్రమే తమలక్ష్యం అని ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇక హార్మోజ్ జలసంధిని మూసివేసిన ఇరాన్ తమ ఆంక్షలు ఉల్లంఘించి వస్తున్న నౌకలపై దాడులకు ఉపక్రమించింది. శనివారం ప్రైమా అనే ఆయిల్ ట్యాంకర్‌పైఇరాన్ ఐఆర్‌జిసికార్ప్స్ దాడిచేసింది. హెచ్చరికలు బేఖాతరుచేస్తోందని ఐఆర్‌జిసి వెల్లడించింది. అంతర్జాతీయ నిబంధనలప్రకారమే నౌకల రాకపోకలు అనుమతిస్తామని, యుద్ధసమయంలో జలసంధిని నియంత్రించే హక్కు మాకు ఉందని, అమెరికా ఇజ్రాయెల్‌నౌకలు మారువేషంలో వచ్చే యుద్ధనౌకలను సైనిక లక్ష్యాలుగా పరిగణించి అడ్డుకుంటామని ఇరాన్‌ప్రకటించింది.

**గల్ఫ్‌దేశాలకు ఇరాన్ అధ్యక్షుడి క్షమాపణలు**

ఇదిలా ఉంటే గల్ఫ్‌దేశాలకు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ క్షమాఫణలుచెప్పారు. పొరుగుదేశాలపై ఇరాన్‌దాడులుచేసినందుకు క్షంతవ్యులమని, ఇకపై ఆ దేశాలపై దాడులు చేయకూడదని ఇరాన్ తాత్కాలిక నాయకత్వం నిర్ణయించిందన్నారు. పొరుగుదేశాలపై దాడులు, క్షిపణి ప్రయోగాలు ఉండవని ఆదేశాలనుంచి మాదేశంపైకి దాడులు జరగనంతవరకే మేం దాడులకు దిగబోమని పెజెష్కియాన్ అనాననరు. అమెరికా సైన్యం కొలువుదీరి ఉన్న ఆదేశాలనుంచి ఇరాన్‌పై దాడిజరిగితేమాత్రం ప్రతిదాడులు తీవ్రంగా ఉంటాయని స్పష్టంచేసారు. ఇరాన్ ఏదేశానికి లొంగిపోదని, ఎలాంటి చర్చలు, ఒప్పందాలు ఉండబోవని బేషరతుగా లొంగిపోవాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌చేసిన ప్రకటనపై పెజెష్కియాన్‌స్పందిస్తూ తమ దేశం ఎవరికీ లొంగిపోదన్నారు. యుఎఇ, దుబాయి, ఖతార్, బహ్రెయిన్ వంటి గల్ఫ్‌దేశాలపై దాడులుచేసిన ఇరాన్ ఇకపై నిలిపివేస్తుందో లేదో నని ఆదేశాలుఅనుమానాలు వ్యక్తంచేస్తున్నాయి.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై మరింత ఉధృతంగా దాడులుచేస్తామని హెచ్చరించారు. ఇరాన్‌ను సర్వనాశనంచేస్తామన్నారు. తమ సరిహద్దుదేశాలకు ఇరాన్ అధ్యక్షుడు క్షమాపణలు చెప్పడంతోనే అమెరికా, ఇజ్రాయెల్‌దేశాలు విజయం సాధించాయన్నారు.

# కడియం శ్రీహరి, దానం నాగేందర్‌లపై ముగిసిన విచారణ

## తీర్పును రిజర్వ్‌లో పెట్టిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి7:** తెలంగాణ రాజకీయాల్లో గత ఏడాది కాలంగా ప్రకంపనలు సృష్టిస్తున్న ఎమ్మెల్యేల ఫిరాయింపుల వ్యవహారం ఇప్పుడు క్లైమాక్స్‌కి చేరుకుంది. బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్లపై అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శనివారం తుది విచారణను ముగించారు. సుప్రీంకోర్టు విధించిన గడువు 12వ తేదీతో ముగియనుండటంతో, స్పీకర్ వెలువరించబోయే తీర్పుపై రాష్ట్ర వ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది. కాగా, రెండు రోజుల క్రితం స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అనర్హత పిటీషన్‌పై విచారణ పూర్తి కాగా, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్లపై దాఖలైన పిటిషన్లపై శనివారం స్పీకర్ ఛాంబర్‌లో కీలక విచారణ జరిగింది. దీంతో ఇప్పటి వరకు ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న పది మంది ఎమ్మెల్యేలపై స్పీకర్ విచారణ జరిపారు. అందులో 8 మంది ఎమ్మెల్యేలపై ఇదివరకే స్పీకర్ క్లీన్ చీట్ ఇచ్చారు. దానం, కడియం అనర్హత కేసులో విచారణ ఆలస్యమైంది. ఉభయ పక్షాల వాదనలు విన్న అనంతరం ఈ కేసులో కూడా విచారణ ముగిసినట్లు స్పీకర్ కార్యాలయం ప్రకటించింది. వీరిద్దరికి సంబంధించిన తీర్పును స్పీకర్ రిజర్వ్ ఉంచారు.

## వరంగల్‌లో భారీ అగ్నిప్రమాదం

**వరంగల్ సిటీ మార్చి7 ప్రభాతవార్త:** వరంగల్ నగరంలో నిత్యం జనం తో అత్యంత రద్దీగా ఉండే జె.పి.ఎన్ రోడ్ లో శనివారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. దత్తాత్రేయ ఫర్నిచర్ షాపులో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో నగరంలో ప్రజలు భయభ్రాంతులకు గురైయ్యారు. ప్రముఖ దత్తాత్రేయ ఫర్నిచర్ షోరూమ్ షాపులో అగ్నిప్రమాదం సంభవించింది. ఆ షాప్ లో ఫర్నిచర్ (చెక్క సామాగ్రి) ఎక్కువగా ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించాయి. దట్టమైన పొగలు పరిసర ప్రాంతాలను కమ్మేశాయి. దట్టమైన పొగ షాపులో నుండి బయటికి రావడం తో ఎగిసిపడుతున్న మంటలను గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ఫైర్ ఇంజిన్ల తో మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అగ్నిప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రధాన కారణం అని దత్తాత్రేయ ఫర్నిచర్ షాపు యజమాని సతీష్ తెలిపారు. రెండు రోజుల క్రితం కరెంట్ సమస్య ఉంటే రిపేర్ చేపించానని అన్నారు. వేములవాడ తీర్థయాత్ర కోసం మేము ఉండగా ఈ సంఘటన జరిగిందని తెలిపారు. అగ్ని ప్రమాదం లో దాదాపు 50 లక్షల వరకు నష్టం జరిగిందని తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వం
పురపాలక సంఘు కార్యాలయం, నర్సంపేట, జిల్లా : వరంగల్
ఆర్.సి. నెం. A1/40/2026, బహిరంగ వేలము ప్రకటన తేది : 07.03.2026
ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా! నర్సంపేట పురపాలక సంఘముచే 2026-27 (తేది: 01.04.2026 నుండి 31.03.2027 వరకు 12 మాసములకు) సంవత్సరమునకు పశువుల రహదారి, మేకలు-గొర్రెల రహదారి, గంప చీటి మరియు కమేలా ఫీజు వసూలు చేయుటకు తేది: 17.03.2026 రోజున ఉదయం 11.00 గంటలకు కమిషనర్ గారి సమక్షములో లేదా వారు అనుమతించిన వారి సమక్షములో బహిరంగ వేలములు నిర్వహించబడును. వేలములో పాల్గొనువారు డిపాజిట్లు, వేలం రుసుము (తిరిగి చెల్లించబడదు) "COMMISSIONER MUNICIPALITY NARSAMPET" గారి పేర తేది: 16.03.2026 రోజు వరకు డి.డి.ల ద్వారా చెల్లించి దరఖాస్తు ద్వారా సాయంత్రం 5.00 గంటలలోపు కార్యాలయములో సమర్పించుటకు కోరనైనది. డిపాజిట్లు మరియు వేలము రుసుము వివరములు ఈ దిగువ చూపిన పట్టిక ప్రకారం కలవు. **క్రమ సంఖ్య, కాంట్రాక్టు వివరములు, డిపాజిట్, వేలము రుసుము తిరిగి చెల్లించబడదు: 1),** పశువుల రహదారి మరియు లారీలోకి ఎక్కించుట, 6,00,000=00లు, 10,000=00లు, **2),** మేకలు-గొర్రెల రహదారి, 6,00,000=00లు, 10,000=00లు, **3),** గంప చీటి, 6,00,000=00లు, 10,000=00లు, **4),** కమేల, 75,000=00లు, 1500=00లు. ఇతర వివరములకు కార్యాలయము పనిచేయు వేళలో సంప్రదించగలరు. ఏ కారణము చూపకనే టెండర్లు ఆమోదించు లేదా నిరాకరించుట అధికారం మునిసిపల్ కౌన్సిల్ కలిగి ఉన్నది.
సం/- కమిషనర్, పురపాలక సంఘం, నర్సంపేట
DIPR.No.16580-PP/CL/Advt/1/2025-26, తేది: 07.03.2026

దర్శించండి తరించండి
శ్రీశ్రీశ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానము, ధర్మపురి,జగిత్యాల జిల్లా.
శ్రీ స్వామి వారి బ్రహ్మోత్సవములు (జాతర) ఆహ్వానము
తేది: 27.02.2026 నుండి 11.03.2026 వరకు అత్యంత వైభవముగా జరుగును
బ్రహ్మోత్సవముల ముఖ్య కార్యక్రమములు
తేది: 28.02.2026 శనివారము రోజున "శ్రీస్వామి వారల కళ్యాణోత్సవములు"
తేది: 03.03.2026 మంగళవారం రోజున చంద్రగ్రహణం సందర్భంగా ఉ.6.00గం.ల నుండి 7.00గం.ల వరకు "శ్రీలక్ష్మీ (యోగ) నర్సింహస్వామి వారి డోలోత్సవము"
తేది:04.03.2026 బుధవారం రోజున మ.3.00గం.లకు కోనేరు (బ్రహ్మపుష్కరిణిలో) "శ్రీఉగ్ర నర్సింహస్వామి వారి తెప్పోత్సవము, డోలోత్సవము"
తేది: 05.03.2026 గురువారం రోజున మ.3.00గం.లకు కోనేరు (బ్రహ్మపుష్కరిణిలో) "శ్రీ వేంకటేశ్వరస్వామి వారి తెప్పోత్సవము, డోలోత్సవము"
తేది: 08.03.2026 ఆదివారం రోజున మ.3.00గం.లకు "రథోత్సవము"
తేది:09.03.2026 సోమవారం నుండి 11.03.2026 బుధవారము వరకు రా.9.00గం.లకు శ్రీ స్వామి వారల ఏకాంతోత్సవములు
ముఖ్య అతిథి: మాన్యశ్రీ ఎనుముల రేవంత్‌రెడ్డి గారు, రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు
ఇట్టి బ్రహ్మోత్సవములలో పాల్గొను విశిష్ట అతిథులు :
గౌ॥శ్రీమతి కొండ సురేఖగారు, రాష్ట్ర దేవాదాయ-ధర్మాదాయశాఖ మాత్యులు
గౌ॥శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు, రాష్ట్ర ఎస్సీ,ఎస్సీ సంక్షేమ శాఖామాత్యులు
గౌ॥శ్రీ గడ్డం వంశీకృష్ణగారు, పార్లమెంట్ సభ్యులు, పెద్దపల్లి
గమనిక: బ్రహ్మోత్సవములు (జాతర) సందర్భముగా ప్రతిరోజు స్థానిక ఆర్యవైశ్య సంఘం, వర్తక సంఘం, రైస్‌మిల్లర్స్, దాతలు మరియు స్వచ్ఛంద సంస్థలు, భక్తుల సహాయ సహకారములతో ఉచిత అన్నదానము జరుపబడును. ఇట్టి అన్నదానమునకు తమ వంతు ధన, వస్తు రూపేణా విరాళములు చెల్లించి రశీదు పొందగలరని కోరుచున్నాము.
శ్రీ జక్కు రవీందర్, అధ్యక్షులు
ధర్మకర్తలు:
శ్రీ పొల్లారపు పోచయ్య, శ్రీగుడ్ల రవీందర్, శ్రీ మందుల మల్లేష్, శ్రీ నేదునూరి శ్రీధర్
శ్రీ రావర్తి సాయికిరణ్, శ్రీ స్తంభంకాడి గణేష్, శ్రీ సంబెట తిరుపతి,
శ్రీమతి పొల్లాల సౌజన్య, శ్రీ అప్ప సుధాకర్, శ్రీ నేరెళ్ల శ్రీనివాసాచారి (ఎక్స్‌అఫిషియో మెంబర్)
అర్చకులు & సిబ్బంది
సహాయ కమీషనర్ & కార్యనిర్వహణాధికారి (ఎఫ్.ఎ.సి)
జారీ చేసినవారు: సమాచార పౌర సంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
వరంగల్ : fb.com/vaartha Digital
Published from Warangal, Karimnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
8-3-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 36 పేజీలు: 8+16 వెల: 8.00

ఎపి 'విజయ' పేరుతో కల్తీపాలు, నెయ్యి 5
నెలాఖరులోగా లక్ష ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు 6



# చిరంజీవికి ఎన్టీఆర్ అవార్డు

2

గద్దర్ ఫిల్మ్ అవార్డులు -2025 ప్రకటించిన జ్యూరీ

డి.సిఎం భట్టి విక్రమార్కకు జాబితా అందజేత

ఎఎన్ఆర్ అవార్డు: జయసుధ
పైడి జయరాజు అవార్డు: కమల్ హాసన్
ఉత్తమ చిత్రం: రాజ్ వెడ్స్ రాంబాయి
ఉత్తమ నటుడు: నాగచైతన్య (తండేల్)
ఉత్తమ నటి: రష్మిక (ది గర్ల్ ఫ్రెండ్)








# భగ్గుమన్న వంటగ్యాస్

సిలిండర్‌పై రూ. 60 పెంపు..

వాణిజ్య సిలిండర్ కూడా పెంపు

# అమెరికా రక్షణ రాడార్ ధ్వంసం




**టెహ్రాన్ / జెరూసలెం, మార్చి 7:** మధ్యప్రాచ్యంలో జరుగుతున్న యుద్ధంలో ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సేనలు భీకర దాడులుచేస్తుంటే మరోపక్క గల్ఫ్‌స్థావరాల్లోని అమెరికా స్థావరాలపై అదునుచూసి దెబ్బకొడుతోంది ఇరాన్. అమెరికాకు గల్ఫ్‌దేశం జోర్డాన్‌లో అత్యంత రక్షణ రంగ థాడ్ కీలకస్థావరం ఏర్పాటుచేసింది. వీటిని తన డ్రోన్లసాయంతో ధ్వంసంచేయడంతో అమెరికాకు సుమారు రూ. 2500 కోట్లకుపైగా నష్టం వాటిల్లినట్లు అంచనా. బాలిస్టిక్ క్షిపణులను అత్యంత ఎత్తులోనే గుర్తించి వాటిని ధ్వంసం చేస్తుంది. యుద్ధం ప్రారంభ రోజుల్లోనే ఇరాన్ ఈ దాడి చేసిందని అధికారులు కూడా వెల్లడించారు. ఖరీదైన ఈ రాడార్ వ్యవస్థ ధ్వంసంకావడంతో గల్ఫ్‌ప్రాంతంలో అమెరికా మిత్రదేశాల రక్షణ వలయంపై తీవ్ర ఒత్తిడి పడుతోంది. అంతటితో ఆగకుండా మరో >>2

**జోర్డాన్‌పై డ్రోన్‌లతో దాడి జరిపిన ఇరాన్**

**గల్ఫ్ దేశాలకు తర్వాత క్షమాపణ చెప్పిన ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్**

**హార్మొజ్ జలసంధి చేరిన అమెరికా యుద్ధనౌకలు**

**దాడులు ఉధృతం చేస్తామన్న ట్రంప్**

**ఇజ్రాయెల్ దాడుల్లో దక్షిణ లెబనాన్‌లో 40 మంది మృతి**



మావోయిస్టుల ఆయుధాలను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

# లొంగిపోయిన మావోయిస్టులు మరో 130



శనివారం హైదరాబాద్‌లో లొంగిపోయిన మావోయిస్టులతో సిఎం రేవంత్, డిజిపి శివధర్‌రెడ్డి

గణపతి సహా అజ్ఞాత మావోయిస్టులందరు లొంగిపోవాలి

చట్ట పరిధిలో వారికి పునరావాసం, రక్షణ కల్పిస్తాం..

శాంతియుతంగానే అన్ని సమస్యలకు పరిష్కారం

లొంగిపోయిన నక్సలైట్లతో కమాండ్ కంట్రోల్‌లో భేటీ సందర్భంగా సిఎం రేవంత్

**హైదరాబాద్ మార్చి 7, ప్రభాతవార్త:** మావోయిస్టు అగ్రనేత గణపతి సహా అజ్ఞాతంలో వున్న మావోయిస్టులంతా లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవాలని సిఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. లొంగిపోయిన మావోయిస్టులకు చట్ట పరిధిలో చేయాల్సిన సహాయం చేస్తామని, పునరావాసంతోపా టు రక్షణ కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అజ్ఞాతంలో వున్న 130 మంది మావోయిస్టులు తమ ఆయుధాలతో సహా లొంగిపోయిన సందర్భం గా బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్‌లో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ శాంతియుతంగానే అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, హింసతో దేనికి జవాబు లభించదని అన్నారు. రాష్ట్రంలో తొలిసారిగా అజ్ఞాతంలో వున్న 130 మంది నక్సలైట్లు 124 ఆయుధాలతో లొంగిపోవడం మంచి పరిణామమని ఆయన తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చాక 721 మంది నక్సలైట్లు 260 ఆయుధాలతో లొంగిపోయారని ఇది ఒక రికార్డుగా సిఎం తెలి పారు. తాజాగా లొంగిపోయిన 130 మందిలో 125 మంది ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన వారు కాగా నలుగురు తెలంగాణ, ఒకరు ఎపికి చెందిన వారుగా సిఎం తెలిపారు . లొంగిపోయిన వారు వారి రాష్ట్రంలో వెళ్లాలనుకుంటే ఇబ్బంది లేదని తెలంగాణలోనే వుండాలనుకున్నా పునరావాసం కల్పిస్తామని ఆయన తెలిపా రు. లొంగిపోయిన వారికి మెరుగైన జీవనం గడిపేందుకు అవకాశం కల్పిస్తామని, వీరికి ప్రత్యేకంగా ఆరోగ్య భద్రత కార్డులు ఇస్తామని, ఈ కార్డులతో నిమ్స్ సహా కొన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం అందేలా చూస్తామని సిఎం హామీ ఇచ్చారు. >>2

# డిగ్రీ, పిజిలో ఎన్ఇపి

ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు

కామన్‌పిజి ఎంట్రన్స్ నిర్వహణ బాధ్యత కాకతీయ వర్సిటీకి

**విసిల సమావేశంలో నిర్ణయం తీసుకున్న ఉన్నత విద్యా మండలి**



శనివారం హైదరాబాద్‌లో న్యూస్‌లెటర్ సంచికను విడుదల చేస్తున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి. చిత్రంలో పలు వర్సిటీ వైస్ ఛాన్స్‌లర్లు తదితరులు

**హైదరాబాద్, ప్రభాతవార్త, మార్చి 7:** తెలంగాణ రాష్ట్రంలో రానున్న 2026-27 విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ, పీజీ కోర్సుల్లో జాతీయ విద్యా విధానం(ఎన్‌ఈపీ)-2020ని అమలు చేయాలని నిర్ణయించారు. గత ఏడాది వరకు కామన్ పీజీ ఎంట్రన్స్ టెస్ట్(సీపీజీఈటీ)ను ఉస్మానియ యూనివర్సిటీ నిర్వహిస్తూ వస్తుండగా.. ఈ ఏడాది ఆ బాధ్యతలను కాకతీయ యూనివర్సిటీకి అప్పగించాలని శనివారం జరిగిన విశ్వవిద్యాలయాల ఉపకులపతుల సమావేశంలో నిర్ణయించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ యూనివర్సిటీల వీసీల సమావేశం శనివారం ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో జరిగింది. ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి అధ్యక్షతన వీసీల సమావేశం జరిగింది. సమావేశంలో పలునిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్రంలోని ఉన్నత విద్యకు సంబంధించిన ముఖ్యమైన విద్యా, విధాన పరమైన అంశాలపై సమావేశంలో చర్చించారు. సమావేశంలో ఉన్నత విద్యామండలి ఫిబ్రవరి 2026 న్యూస్‌లెటర్ సంచికను చైర్మన్ విడుదల చేశారు. ఉన్నత విద్యలో విద్యా ప్రమాణాలను మరింత బలోపేతం చేయడం, జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ)-2020 అమలు దిశగా సంస్కరణలు చేపట్టడంతోపాటు మండలి,విశ్వవిద్యాలయాల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం అవసరమని పేర్కొన్నారు. 2026-27 విద్యా సంవత్సరం నుండి అండర్ గ్రాడ్యుయేట్ (యూజీ), పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) కోర్సుల్లో ఎన్‌ఈపీ- 2020 రూపకల్పనను అమలు చేయాలని తీర్మానించారు. విద్యా నాణ్యతను బలోపేతం చేయడమే కాకుండా >>2

# ఎసిబి వలలో తహసీల్దార్

రూ. 4 కోట్ల అక్రమాస్తులు గుర్తింపు

**కరీంనగర్ కార్పొరేషన్, ప్రభాత వార్త:** ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలతో సిద్దిపేట జిల్లా గజ్వేల్ తహసీల్దార్ కామటం శ్రవణ్ కుమార్ చిక్కుల్లో పడ్డారు. శనివారం కరీంనగర్ ఏసీబీ అధికారులు నిర్వహించిన ఆకస్మిక సోదాల్లో భారీ ఎత్తున అక్రమాస్తులు వెలుగుచూసినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు



అధికారులు ఆయనపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

**కుప్పలుతెప్పలుగా స్థిరాస్తులు:**
తహసీల్దార్ శ్రవణ్ కుమార్ తన సర్వీసు కాలంలో అధికార దుర్వినియోగానికి పాల్పడి, అక్రమ మార్గాల్లో భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ ప్రాథమిక విచారణలో తేల్చిందనీ అధికారులు తెలిపారు. కరీంనగర్‌లో నిర్వహించిన సోదాల్లో లభించిన కీలక పత్రాలు, ఆస్తుల వివరాలు ఏసీబీ అధికారులు వెల్లడించారు. కరీంనగర్ పట్టణంలో 2 స్వంత ఇళ్లు, ఒక అపార్ట్‌మెంట్ (6 ఫ్లాట్లు), 4 ఖాళీ ప్లాట్లు ఉన్నాయి. వాటి డాక్యుమెంట్ విలువ సుమారు రూ. 2,47,33,540 ఉంటుందన్నారు. 30 లక్షల విలువైన ఫోర్ వీలర్, రూ. 1.60 లక్షల విలువైన రెండు ద్విచక్ర వాహనాలు ఉన్నట్లు తెలిపారు. రూ. 11.90లక్షల నగదు, రూ. 4.20 లక్షల విలువైన బంగారు ఆభరణాలు తనిఖీల్లో దొరికినట్లు తెలిపారు. సుమారు రూ. 15.66 లక్షల విలువైన విలాసవంతమైన వస్తువులు గుర్తించినట్లు పేర్కొన్నారు. పత్రాల ప్రకారం ఆస్తుల విలువ రూ. 4 కోట్లుగా ఉన్నప్పటికీ, బహిరంగ మార్కెట్ ధర ప్రకారం వాటి విలువ మరింత పెరిగే అవకాశం ఉందని ఏసీబీ అధికారులు అంచనా వేస్తున్నారు. శ్రవణ్ కుమార్‌ను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకుని, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మరింత లోతైన విచారణలు కొనసాగుతున్నాయని ఏసీబీ డీఎస్పీ తెలిపారు.



శనివారం కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని గోపాలరావుపల్లిలో ఎండిపోయిన పంటల్లో మహిళా రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

# ప్రజా సంక్షేమం అక్కరలేదా?

రైతులకు సకాలంలో సాగునీరివ్వని కాంగ్రెస్ సర్కార్

**1,65,000 ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కెసిఆర్‌ది: హరీష్ రావు**

**చొప్పదండి / గంగాధర ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటేనే విధ్వంసం అని ప్రజా సంక్షేమం మీద రైతుల మీద ఆయనకు పట్టింపు లేదని రాష్ట్ర మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు ఈ మేరకు కరీంనగర్ జిల్లా గంగాధర మండల పరిధిలోని గోపాలరావుపల్లి లో ఆయన ఎండిపోయిన పంటలను పరిశీలించి వరద కాలువను పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు రైతులు వారితో మాట్లాడుతూ నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ యావత్ తెలంగాణలో ఇదే పరిస్థితి ఉందని పేర్కొన్నారు రెండేళ్ల మూడు నెలలు పూర్తి అయి కాంగ్రెస్ ప్రభుత్వంలోకి వచ్చి అభివృద్ధి చేసింది ఏమీ లేదన్నారు అంత విధ్వంసమే నని హైడ్రా పేరుతో హైదరాబాదులో విధ్వంసం రేవంత్ రెడ్డి అంటేనే విధ్వంసం అని ధ్వజమెత్తారు. అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ కేసీఆర్ అయితే విధ్వంసానికి రేవంత్ రెడ్డి కేరాఫ్ అడ్రస్ అని అన్నారు. రేవంత్ రెడ్డి కర్ణుడు అని చెప్పుకుంటున్నాడు అని కానీ కర్ణుడు కాదు క్రూరుడు అని ఆరోపించారు. తెలంగాణ ప్రజల గుండెల మీద తన్నిన వ్యక్తి రేవంత్ రెడ్డి అని తెలిపారురైతులకు 24 గంటల కరెంటు ఇచ్చి వ్యవసాయాన్ని పండగ చేసిన వ్యక్తి కెసిఆర్ అని పేర్కొన్నారు. రైతులకు సకాలంలో నీరు ఇవ్వక పంటలను ఎండిపోయే పరిస్థితికి తెచ్చిన వ్యక్తి రేవంత్ రెడ్డి కారణమన్నారు. కేసీఆర్ మీద నిందలు వేసుకుంటూ కాలం గడుపుడు తప్ప తెలంగాణ ప్రజలకు చేసింది ఏమీ లేదు అని అన్నారు. రేవంత్ రెడ్డికి బూతుల మీద ఉన్న ధ్యాస రైతుల మీద లేదు అని అన్నారు బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక సంవత్సరంలో 119 గురుకులాలు ఏర్పాటు చేసిన వ్యక్తి కెసిఆర్ అని తెలిపారు కేసిఆర్ ప్రభుత్వంలో లక్ష అరవై 5 వేల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కేసీఆర్ దక్కుతుందన్నారు.. రేవంత్ రెడ్డి కోతలు పెట్టుడు రైతు బంధు ఎదగొట్టుడు ఇచ్చిన హామీలు ఎగగొట్టుడుతప్ప వేరే చేసింది ఏం లేదని అన్నారు. కమిషన్ల కోసం కాంట్రాక్టర్లకు బిల్లులు పాస్ చేస్తున్నాడు అని అన్నారు అన్ని వర్గాలను మోసం చేసిన వ్యక్తి రేవంత్ రెడ్డి అన్నారు. కెసిఆర్ ప్రభుత్వంలో మొదటి ఏజెండా వ్యవసాయమేనని అన్నారు. రేవంత్ రెడ్డి రైతులకు సకాలంలో నీళ్లు ఇచ్చి పంటలను కాపాడలని కోరారు అన్నదాతలు తిరుగుబాటు చేస్తారని హెచ్చరించారు అన్నదాతల కండగా బిఆర్ఎస్ ఉంటుందని అన్నారు ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాజీ చొప్పదండి ఎమ్మెల్యే సుంకే రవిశంకర్‌తో పాటు పలువురు టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.




# ఇంత ప్రొటోకాల్ వైఫల్యమా?

మమత ప్రభుత్వంపై రాష్ట్రపతి అసహనం

**కోల్‌కతా, మార్చి 7:** పశ్చిమ బెంగాల్ పర్యటనలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రొటోకాల్ వైఫల్యం కనిపించిందని ఆమె వ్యాఖ్యానించారు. ఉత్తర బెంగాల్‌లో అంతర్జాతీయ ఆదివాసీ సదస్సుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతివ్వలేదని, >>2

అన్ని హద్దులు దాటేసిన మమతాబెనర్జీ: ప్రధాని 5

# నిప్పుల కొలిమి



## రెడ్ అలర్ట్ జారీ

41 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు

**హైదరాబాద్, మార్చి 7, ప్రభాతవార్త:** తెలంగాణ నిప్పుల కొలిమిలా మారుతోంది. ఉత్తర భారతదేశం నుంచి వీస్తున్న పొడిగాలుల కారణంగానే ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని వాతావరణ కేంద్రం తెలిపింది. సాధారణంగా మార్చి మూడోవారం తర్వాత ఎండలు పెరుగుతాయి. కానీ ఈసారి తొలి వారంలోనే వేడి తీవ్రత మొదలైంది. దీంతో ఈ సీజన్‌లోనే అత్యధిక గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ముఖ్యంగా ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలైన ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం,మంచిర్యాల, ఆదిలాబాద్, జిల్లాల ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలంటూ వాతావరణ కేంద్రం రెడ్‌అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో ఉష్ణోగ్రత 39 నుంచి 41 డిగ్రీలకు చేరిందని, రాబోయే 4రోజులు ఇవే గరిష్ఠ ఉష్ణోగ్రతలు కొనసాగుతాయని పేర్కొంది. తీవ్రమైన ఎండలతో పాటు వడగాల్పులు వీచే అవకాశమున్నదని హెచ్చరించింది. ఇక హైదరాబాద్‌లో కూడా గతంలో కంటే భిన్నంగా మార్చిలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 37 నుండి 38 డిగ్రీలుగా నమోదయ్యాయి. ఆదిలాబాద్ అర్బన్, ధర్మపురి, ఖమ్మం అర్బన్ ప్రాంతాల్లో 38.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మరో 14 జిల్లాల్లో 38.5 డిగ్రీలపైనే రికార్డు అయ్యింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 మధ్య అత్యవసరమైతే తప్ప బయటకు రాకపోవడమే మంచిదని అధికారులు హెచ్చరించారు. ములుగు, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, భద్రాద్రికొత్తగూడెం జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది.

# విద్యుత్ ఛార్జీల పెంపు లేదు

5

స్పష్టం చేసిన డిస్కంలు

ఎస్పీడిసిఎల్ ఆదాయం రూ.40,659 కోట్లు

సర్కారీ విభాగాల్లో పలువురు అధికారులు వరుసగా లంచాలు తీసుకుంటూ దొరికిపోతుండడం ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చుతోంది. అనేక మంది ఏకంగా తమ కార్యాలయాల్లోనే లంచాలు తీసుకోవడం సంచలనం రేపుతోంది. సాధారణంగా కిందిస్థాయిలోవుండే అధికారులపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ క్రమం తప్పకుండా వుండాల్సి వుంది. వీరి పనితీరు, విచారించే కేసులు, వీటిపై సాగుతున్న విచారణ ఎలావుంది? నిందితుల నుంచి అధికారులు ఏమైనా ఆశిస్తున్నారా? ఇదే సమయంలో విచారణను తప్పుదోవ పట్టిస్తున్నారా? అనే దానిపై అంతర్గతంగా వేగుల నుంచి సమాచారం సేకరించాల్సి వుంది. గతంలో ఇలాంటి వ్యవస్థ వుండేది. కానీ ఇప్పుడంతా హైటెక్ వ్యవస్థ అవతరించడం, వేగుల్లో కూడా కొందరు అవినీతి అధికారులకు కొమ్ముకాస్తుండడంతో అంతాగోల్‌మాల్ వ్యవహారంగా మారింది. దీంతో ఎసిబిలోనే కొందరిపై వరుసగా ఫిర్యాదులు రావడంతో అనేక మందిని వున్నపళంగా వెనక్కుపంపడం లేదాసస్పెండ్ చేయడం జరుగుతోంది. మరోవైపు సర్కారీ విభాగాల్లో అడుగడుగునా సిసి కెమెరాలుఏర్పాటు చేసినా ఇవికూడా అవినీతి అధికారులలంచాల బాగోతాన్ని నిలువరించలేకపోతున్నాయని చెప్పాలి. ఈ తరహా ఘటనలపై నిపుణులు భిన్నంగా వ్యాఖ్యానిస్తున్నారు. రాజకీయ సిఫార్సులకు తలవొగ్గి అవినీతి అధికారులకు బిగ్ బాస్‌లు పోస్టింగులు ఇస్తుండడంవల్లే అవినీతి అక్రమార్కుల సంఖ్య పెరిగిపోతుందని వారంటున్నారు. గతంలో ఒకసారి ఎసిబికి దొరికిపోయిన వారికి సర్వీసంతా మంచి పోస్టింగులు లభించేవి కావు. ఒకటి కాదుకదా రెండు అంతకు ఎక్కువసార్లు ఎసిబికి దొరికిపోయిన వారు కూడా నేడు దర్జాగా కీలక చోట్ల పోస్టింగుల్లో అది కీలక విభాగాలలోనే కొనసాగుతుండడం గమనార్హం. ఇక ఎసిబికి దొరికిపోయిన వారిపై కేసులను ఎత్తివేస్తున్న సర్కారు తిరిగి వారికే ప్రాముఖ్యమున్న ప్రాంతాలలో నియమించడాన్ని నిపుణులు తప్పుపడుతున్నారు.

# సర్కారీ విభాగాల్లో పేట్రేగుతున్న అవినీతి!

**డి.మురళీధర్ అమర్‌నాథ్**

ప్రభుత్వంలో కీలకమైన రెవెన్యూ, పోలీసు, హెచ్‌ఎండిఎ, మున్సిపల్, విద్యుత్, నీటి పారుదల శాఖల్లో క్రమశిక్షణ కట్టుతప్పుతోంది. ప్రభుత్వంలో ఎంతో ముఖ్యమైన ఈ ఆరు విభాగాల్లో కీలకస్థానాల్లో వున్న అధికారులు వరుసగాలంచాలు తీసుకుంటూ ఎసిబికి పట్టుబడుతున్న వైనం, అక్రమాస్తుల కేసులో దొరికిపోతున్న ఉదంతాలు ప్రభుత్వాన్ని నవ్వులపాలు చేయసాగింది. ఈ విభాగాలను ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తూ కోరిన వరాలన్నీ తీరుస్తున్నా లంచావతారుల ఆగడాలు మాత్రం ఆగడం లేదు. ఎసిబికి పట్టుబడుతున్న వారిలో ఓ మోస్తరుస్థాయి అధికారులే వుండడం గమనార్హం. ఉన్నత స్థానాల్లో వున్న వారిపై తీవ్రమైన అభియోగాలు వస్తున్నా ఎసిబి వారి జోలికి వెళ్లక పోవడం విశేషం. ఎసిబి విడుదల చేస్తున్న వార్షిక నివేదికలో ఈ విభాగాలకు చెందిన అధికారులే ఎక్కువగా పట్టుబడడం మరో విశేషం. సర్కారీ విభాగాల్లో కీలక శాఖల్లో అవినీతిపరుల సంఖ్య పెరగడానికి రాజకీయ పోస్టింగులు ఒక కారణం అయితే అంతర్గత విజిలెన్స్ మొద్దు నిద్రలో వుండడం మరో కారణం. ఇక ఎసిబికి పట్టుబడుతున్న వారు ఐదారు నెలల్లోనే మళ్లీ ఉద్యోగాల్లో చేరుతూ మళ్లీలంచాలు మేస్తూ ప్రజలను జలగల్లా పీల్చుకు తింటున్నారు. నిజాయితీపరులైన అధికారులను కాదని రాజకీయ నాయకులు, బడా బాబుల సిఫార్సులకే ప్రభుత్వం మొగ్గు చూపుతుండడంవల్లే సర్కారు పరువు బజారు పాలవుతుందనే విమర్శలు వున్నాయి. ఇక ఎసిబిలోనూ ఇంటి దొంగలు ఎక్కువవడం అవినీతి అధికారులకు ఊతం ఇస్తోంది. అవినీతి నిరోధక విభాగానికి సర్కారీ ఉద్యోగులు పట్టుబడడం సాధారణమే అయినా ఇటీవల కాలంలో దొరికిపోతున్న వారి వద్ద వంద నుంచి 200 కోట్ల రూపాయల వరకు ఆస్తులు వెలుగు చూడడం దేశవ్యాప్తంగా సంచలనం రేపుతోంది. మూడేళ్ల క్రితం హెచ్‌ఎండిఎ అధికారి శివబాలకృష్ణను అక్రమాస్తుల కేసులో అరెస్టు చేసిన సమయంలో ఆయన వద్ద 200 కోట్ల రూపాయల ఆస్తులు వెలుగు చూశాయి. గడచిన ఏడాది వ్యవధిలో నీటి పారుదల శాఖలో ఎసిబికి లంచం కేసులో దొరికిపోయిన వారు, అక్రమాస్తుల కేసులో అరెస్టయిన వారి వద్ద వంద కోట్ల రూపాయల నుంచి 200 కోట్ల రూపాయల వరకు ఆస్తులు బట్టబయలయ్యాయి. వీరితోపాటు పలు జిల్లాలకు అదనపు కలెక్టర్లుగా పనిచేస్తూ ఎసిబికి పట్టుబడిన వారివద్ద కూడా వంద కోట్ల రూపాయలు అంతకు మించిన ఆస్తులు వెలుగుచూశాయి. ఎసిబికి పట్టుబడిన వారు గతంలో కూడా వున్నా ఇటీవల కాలంలో పట్టుబడిన వారంతా ప్రభుత్వం ఎంతో నమ్మకం వుంచిన వారు కావడం



గమనార్హం. వీరంతా లంచాలకు అలవాటుపడి దొరికిపోవడం, బలవంతంగా ఒక వర్గానికి అనుకూలంగా సెటిల్మెంట్లు చేయడం చర్చనీయాంశంగా మారుతోంది. ఈ తరహా ఘటనలు రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలతో పాటు హైదరాబాద్ మహానగరం సహా రాష్ట్రంలో ప్రముఖ నగరాలుగా పేరొందుతున్న పట్టణాలలోనూ తరచూ వెలుగు చూస్తున్నాయి. దీంతో పాటు అధికారంలో కీలక హోదాల్లో వున్న మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న చోట్ల కూడా ఈ గోల్‌మాల్ వ్యవహారం వెలుగు చూస్తున్నాయి. ఎసిబికి పట్టుబడుతున్న వారిలో మొదట రెవెన్యూ విభాగం వరకు వస్తే జిల్లాలకు అదనపు కలెక్టర్లుగా వున్నవారి నుంచి తహసీల్దార్లు, విఆర్‌ఓలు, విఆర్‌ఐలు లంచాలు తీసుకుంటూ దొరికిపోతుండడం ఇటీవల కాలంలో మరింత ఎక్కువవడం ఈ విభాగంపై ప్రభుత్వం పట్టు కోల్పోతుందా? అనిపించేలా వుంది. ఉదాహరణకు వరంగల్ అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి ఇటీవలే అక్రమాస్తుల కేసులో అరెస్టవగా ఆయన వద్ద వంద కోట్ల రూపాయలకు పైగా ఆస్తులను ఎసిబి గుర్తించింది. ఇంతకుముందు రంగా రెడ్డి అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డి సంగారెడ్డి అదనపు కలెక్టర్లు కూడా ఇలాంటి కేసుల్లో అరెస్టవగా వారి వద్ద కూడా వంద కోట్ల రూపాయలకు పైగా ఆస్తులు వెలుగుచూశాయి. అంతకు ముందు మూడేళ్ల క్రితం కీసర తహసీల్దార్ నాగరాజుతో పాటు మరో ఇద్దరు ఓ భూవివాదంలో కోటీ పది లక్షల రూపాయల లంచంతో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడడం అన్నివర్గాలనుషాక్‌కు గురిచేసింది. ఈ కేసులో లంచం తీసుకున్న నాగరాజుతో పాటు లంచం ఇచ్చిన ఇద్దరిని కూడా ఎసిబి అధికారులు అరెస్టు చేశారు. ఎసిబి చరిత్రలో కోటి పదిలక్షల రూపాయల లంచంతో తహసీల్దార్ పట్టుబడడం ఉమ్మడి ఎపిలో కూడా ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఈ కేసులో ఎలాంటి ఫిర్యాదు లేకున్నా తమకు అందిన సమాచారం మేరకు ఎసిబి అధికారులు రహస్యంగా విచారణ చేసి దాని ఆధారంగా ముందుకుపోయి తహసీల్దార్ నాగరాజుతో పాటు మరో ఇద్దరిని కటకటాల్లో నెట్టారు. అంతకు ముందు బంజారాహిల్స్‌లో సర్కారు భూమిని కాజేసేందుకు ఓ వ్యక్తి అక్రమాలకు తెరలేపగా ఈ వ్యవహారంలో 30లక్షల రూపాయల లంచంతో ఏకంగా తహసీల్దార్‌తో పాటు ఆర్‌ఐ, చివరగా ఎస్‌ఐ పట్టుబడ్డారు. ఒక ఘటనలో రెవెన్యూ విభాగం నుంచి ఇద్దరు, పోలీసు శాఖ నుంచి మరొకరు ఏకకాలంలో దొరికిపోవడం ఇదే తొలిసారి. అంతకు ముందుఘటన సైబరాబాద్‌లోని షాబాద్ పోలీసు స్టేషన్‌లో సిఐ, ఏఎస్‌ఐలు భూ వివాదంలో లక్షా 20వేల రూపాయల లంచంతో ఎసిబికి దొరికిపోయారు. ఈ కేసులో సిఐవద్ద నాలుగున్నర కోట్ల రూపాయల అక్రమాస్తులు వెలుగుచూశాయి. అంతకు ముందు సిద్ధిపేటలో అదనపు డిసిపిగా పనిచేసిన ఓ అధికారి ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఎసిబికి దొరికిపోగా ఆయన వద్ద 15 కోట్ల రూపాయలకు పైగా అక్రమాస్తులు గుర్తించారు. దీని తరువాత వికారాబాద్ జిల్లాలో ఓ మహిళా తాహసీల్దార్ 30 లక్షల రూపాయల లంచంతో దొరికిపోగా ఆమె భర్త సాంఘీక సంక్షేమ అధికారి సైతం దొరికిపోయాడు. వీరివద్ద నాలుగు కోట్ల రూపాయల అక్రమాస్తులు పట్టుబడ్డాయి. ఈ ఘటనలతో పాటు ఉమ్మడి నల్లగొండ, వరంగల్, రంగారెడ్డి జిల్లాలలో రెవెన్యూ అధికారులు అనేక మంది ఎసిబికి పట్టుబడిన ఉదంతాలున్నాయి. ఇక పోలీసు శాఖ విషయానికి వస్తే కీలకమైన జిల్లా ఎస్‌పిలు, కమిషనరేట్ల కొత్వాళ్లు విధి నిర్వహణలో నిక్కచ్చిగా వ్యవహరించేవారుగా పేరున్నా వారి బృందంలోని కొందరు అవినీతి అధికారుల హంగామా మాత్రం యధేచ్ఛగా జరిగిపోతుండడం గమనార్హం. ఇటీవల అక్రమాస్తుల కేసులో అరెస్టయిన సైబరాబాద్‌కు చెందిన ఓ ఎసిపి ఇంతకు ముందు పలుమార్లు సస్పెండ్ కాగా ఆయనకు కీలకమైన పోస్టింగులు వరుసగా లభించాయి. ఆఖరుకు సిసిఎస్‌లో కూడా రెండు వేలకోట్ల రూపాయల సాహితీఇన్‌ఫ్రా స్కాంకేసు విచారణ బాధ్యతలను కూడా ఆయనకే అప్పగించడం గమనార్హం. సాహితీ ఇన్‌ఫ్రాకేసులో బాధితులు తమకు న్యాయం జరగడం లేదని పలుమార్లు ఆందోళన వ్యక్తం చేయడంతోపాటు ఈ కేసు విచారణ సవ్యంగా సాగడంలేదని పదేపదే చెబుతున్నారు. ఇప్పుడు ఈకేసును విచారిస్తున్న సమయంలోనే సదరు ఎసిపి అరెస్టవడం సంచలనం రేపింది. గతంలో సిద్ధిపేట్‌లో అదనపు డిసిపిస్థాయి అధికారి ఏకంగా రూ.15కోట్ల అక్రమాస్తుల కేసులో అరెస్టయ్యారు. ఇక హైదరాబాద్ పరిధిలో వివిఐపిలువుండే బంజారాహిల్స్ పరిధిలో ఏడాదిన్నర క్రితం ఓపబ్ యజమానిని ఇన్‌స్పెక్టర్, ఎస్‌ఐవీరికి ఏజెంట్‌గా వున్న ఓహోంగార్డు నెలసరి మామూలుకోసం బెదిరించారు. కాగా మామూలు ఇచ్చేందుకు పబ్‌యజమాని నిరాకరించంతో అతనిపై అక్రమంగా ఓ కేసు నమోదుచేసి అర్ధరాత్రివేళ బలవంతంగా స్టేషన్‌లో నిర్బంధించారు. దీంతో బాధితుడు తనకు జరిగిన అన్యాయంపై అన్ని వివరాలతో ఎసిబికి ఫిర్యాదుచేశాడు. ఈఫిర్యాదుపై రంగంలో దిగిన ఎసిబి అధికారులు బంజారాహిల్స్ పోలీసు స్టేషన్‌లో ఏకంగా20గంటల పాటు విచారణజరిపి కీలక పత్రాలు జప్తు చేశారు. లంచాలు తీసుకుంటూ దొరికిపోతున్న వారు కొందరైతే ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన కేసులతో పట్టుబడుతున్న వారు ఇంకొందరు. ఈవిభాగాలకు జమాల్ జట్టీలాంటి అధికారులే బాస్‌లుగా వున్నా, వీరంతా విధి నిర్వహణలో నిక్కచ్చిగా వుండేఅధికారులుగా పేరొందినా అవినీతి అధికారుల హాల్‌చల్, యధేచ్ఛగా కొనసాగుతుండడం విశేషం.

# కొత్త 'అవతారం' !

విశ్లేషణ

బీహార్

ఒక అవతారం పూర్తయ్యాక మరో అవతారం ఎత్తడం విష్ణుమూర్తికైనా అలవాటు. కానీ నేటి రాజకీయ నాయకులు రెండాకులు ఎక్కువే చదివినట్లున్నారు. అవతారం మధ్యలోనే మరో అవతారం దాల్చుతూ అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తుతూంటారు. బీహార్‌లో ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ చేసింది అదే. ముఖ్యమంత్రిగా ఉంటూనే రాజ్యసభ సీటుకు గత గురువారం నామినేషన్ వేసి కొత్తరికార్డు సృష్టించారు. తన కుమారుడు నిశాంత్‌ను బీహార్ ఉప ముఖ్యమంత్రిని చేయడం కోసం ఆయన ఈ ట్విస్ట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే అదే కారణమా! లేక అంతకుమించిన వ్యూహం ఉన్నదా? అన్న సందేహమే రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. మరో వారం రోజుల్లో ఆయన రాజ్యసభకు ఎన్నికైనట్లు ప్రకటన రాగానే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసే అవకాశం ఉంది. రాజీనామా తర్వాత సిఎం పదవి బిజెపికి, డిప్యూటీ సీఎం పదవి ఆయన కుమారునికి ఇచ్చేలా 'ఒప్పందం' కుదిరినట్లు కూడా తెలుస్తోంది. ఈ ఒప్పందం కుదరడానికి తెరవెనుక కథ నడిపించెవరన్నది మరో సందేహం. నితీశ్ వైపు నుంచి చూస్తే, వార్థక్యం ఆయన్ని వెంటాడుతున్న మాట వాస్తవం. ఈమధ్య ఆయన మాటల్లో తడబడడం, చేతల్లో పొరబడడం చాలాసార్లే వినిపించింది. అందువల్ల నిరంతరం ఒత్తిడితో నిండి ఉండే ముఖ్యమంత్రి పదవి కంటే ప్రశాంతంగా కాలం గడిపే రాజ్యసభ సీటును ఆయన ఎంచుకొని ఉండవచ్చు. జయప్రకాశ్ నారాయణ్ అనుచరునిగా మొదటి నుంచి పేరున్న నితీశ్ సామ్యవాదిగా, బడుగు బలహీన వర్గాల నేతగా గత 20యేళ్లలో రాష్ట్రప్రజలకు ఎంతో దగ్గరయ్యారు. జెడియును స్థాపించిన తర్వాత కూడా బిజెపికి అనుకూలంగా కొన్ని సార్లు, ప్రతికూలంగా కొన్ని సార్లు రాజకీయాలు నడుపుతూ ముఖ్యమంత్రిగా పది సార్లు ప్రమాణం చేశారు. ఒక రాష్ట్రంలో ఇంత ఘనమైన చరిత్రఉండేవారు చాలాఅరుదు. ఆయన నేతృత్వంలో 2005నుంచి ఇప్పటి దాకా వరుసగా ఐదుఅసెంబ్లీ ఎన్నికల్లో జెడియు కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. 2010లో కూటమికి అత్యధికంగా 206సీట్లు వచ్చాయి కూడా. 2020 నాటికి బలహీపడి 43 సీట్లు

**ఎ.వి.వి ప్రసాద్**

మాత్రమే సాధించగలిగింది. గత సంవత్సరంఎన్నికల్లో కొద్దిగా పుంజుకొని 85 సీట్లకు బలం పెంచుకొంది. ఎన్డీయేకు మొత్తం 202సీట్లువచ్చాయి. అసెంబ్లీలోని మొత్తం 243సీట్లలో బిజెపి, జెడియుకూటమి అత్యధిక స్థానాలు గెలుచుకొన్నా, బిజెపికి ఎక్కువ స్థానాలు వచ్చినా, నితీశ్‌కే ముఖ్యమంత్రి పదవి ఇచ్చి బిజెపి అవకాశంకోసం ఎదురు చూస్తోంది. రాష్ట్రంలో జెడియు ఓట్ల శాతం తగ్గి బిజెపికి పెరగడం కూడా గమనించవలసిన అంశం.



నితీశ్ కుమార్

గత సంవత్సరం ఎన్నికల్లో జెడియుకు 19.25 శాతంఓట్లు రాగా, ఆధిక్యం స్వల్పమే అయినా 20.08శాతం ఓట్లతో బిజెపి పరుగులు తీసింది. అయినా కూటమిశాతం అధికం కనుక నితీశ్ కుమార్ ముఖ్యమంత్రి అయ్యారు. దాదాపు 47శాతం ఓట్లు కూటమి ఖాతాలో చేరాయి. తన రాజకీయ వారసుడిగా కుమారుడు నిశాంత్‌ను తెరపైకి తేవడానికి ఆయన కొంతకాలం నుంచి ప్రయత్నిస్తున్నారనేది అందరికీ తెలుసు. నిశాంత్ త్వరలో రాజకీయ తీర్థం పుచ్చు కొంటారని రాష్ట్రమంత్రి శ్రవణ్ కుమార్ గత మంగళవారంచేసిన ఓ ప్రకటన సంచలనం సృష్టించింది. కుమారుని రాజ్యసభకు పంపడానికే నితీశ్ ఆప్రకటన చేయించి ఉంటారనిఅంతా అనుకొన్నారు. కానీ ఆ మర్నాటికే పరిస్థితి మారి పోయి రాజ్యసభకు తానే వెళ్తానని నితీశ్ చెప్పి గురు వారం నామినేషన్ కూడా వేయడంతో బీహార్ రాజకీయాలు ఎంత ఆసక్తి కరంగా మారాయో అర్థమవుతుంది. ఇక అక్కడ బిజెపి ప్రభుత్వం ఏర్పాటు కావడం, నిశాంత్‌కు డి.సిఎం పదవి లభించడం లాంఛనమే. బిజెపి జాతీయ అధ్యక్షుడైన నితిన్‌నబీన్ కూడా బీహార్ నుంచే రాజ్యసభ బరిలోఉన్నారు. ఎన్డీయే కూటమికి నాలుగు సీట్లువచ్చే అవకాశం ఉంది కనుక నితీశ్, నబీన్ సీట్లు ఖాయం. రామ్ విలాస్ పాశ్వాన్ పార్టీ అయిన లోక్ జనశక్తికి గత అసెంబ్లీ ఎన్నికల్లో 19సీట్లు వచ్చాయి. అంటే బిజెపి, జెడియు తర్వాతకూటమిలో ఎల్జేపీకికూడా ఎక్కువ సీట్లే ఉండడంతో కొత్తప్రభుత్వంలోదానికి తగినట్లుగా 'పంపకం'జరిగే అవకాశం ఉంటుంది. రాజ్యసభలోకి అడుగు పెట్టిన తర్వాత నితీశ్‌కు కేంద్రమంత్రి పదవి లభించే అవకాశం ఉన్నదనీ, గతంలో ఆయన నిర్వహించిన రైల్వేశాఖనే తిరిగి అప్పగించవచ్చనీ తెలుస్తోంది. దానికంటే రాష్ట్రంలో జెడి యు తర్వాతితరం నాయకత్వాన్ని పటిష్టం చేయడానికే ఆయన బిజెపితో కలిసి ఈ వ్యూహం రూపొందించారని కూడా అనుకుంటున్నారు. రాజకీయంగా తాను చరమాంకానికి చేరడంవల్ల పార్టీ బాధ్యతలు నిశాంత్‌కు అప్పగించాలనే ఆలోచనతో ఆయన ఈ పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. నితీశ్ ఎవరితో జతకడితే ఆ కూటమి బలపడుతుందనేది రెండు దశాబ్దాలుగా అందరికీ తెలిసిన విషయమే. బిజెపితోకొన్నిసార్లు, ఆర్జేడీతో కొన్నిసార్లు జతకట్టినప్పుడు ఆరెండు పార్టీలు బీహార్‌లో బలం బాగానే పెంచుకొన్నాయి. ఒక దశలో నితీశ్ ప్రధానమంత్రి అభ్యర్థిగా కూడా జాతీయ రాజకీయాల్లో చర్చకు వచ్చారు. అటు లాలూయాదవ్‌తో చేతులు కలిపినా, ఇటు నరేంద్ర మోడీతో చేతులు కలిపినా దాని వెనుక నితీశ్ పటిష్టమైన వ్యూహంతో కదులుతారనే అభిప్రాయం ఉంది. క్రియాశీల రాజకీయాల్లో 'ఇది నితీశ్ తరహా వ్యూహం' అనిపించుకొని, ఇప్పుడు అస్త్రసన్యాసం చేయడానికి కారణం వారసుడి బలం పెంచడానికే అనుకొంటున్నారు. అందుకే నితీశ్ కొత్త అవతారం ఎత్తుతున్నారని తెలుస్తోంది. సిఎం పదవి నుంచి నితీశ్ వైదొలగడాన్ని జెడియులో ఒక వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. అయితే క్రమంగా అది సర్దుమణిగి కొత్త సమీకరణాలు రూపుదిద్దుకోవచ్చు. నితీశ్ తరహాలో నిశాంత్ పార్టీని ఎంతవరకు ముందుకు తీసుకువెళ్లగలరో కాలమే నిర్ణయించాలి.

# క్యూబాపై ట్రంప్ విధ్వంసక నేత్రం!

దృష్టి

క్యూబా

ఉత్తర అమెరికా ఖండంలోని చిన్న ద్వీపసమూహ దేశం. ఆ దేశంపై ట్రంప్ కన్నుపడింది. అక్కడ స్థావరాలు ఏర్పాటు చేయడానికో లేక అక్కడ ఉన్నఅపారమైన ఖనిజ వనరులను లాక్కోడానికో ఏమో కాని అనువుగా ఉన్న అన్నింటిపైనా అగ్రరాజ్యం కన్నేయడం పరిపాటిగా మారిన సంగతి తెలిసిందే. నిన్నటికి నిన్న వెనిజులా అధ్యక్ష దంపతులను సైనిక చర్యతో అరెస్టు చేసి తన దేశానికి తరలించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గ్రీన్‌ల్యాండ్ కూడా తమదేనంటూ ప్రగల్భాలు పలికారు. అంతటితో ఆగకుండా కెనడాను అమెరికాలో 51వ రాష్ట్రంగా చేరిపోతే ఎంతో అభివృద్ధి చేస్తామంటూ ఆఫర్లు ఇవ్వడం ప్రారంభించారు. మరోపక్క సుంకాలను ఎడాపెడా దంచేస్తూ కోర్టు మొట్టికాయలు వేసినా తనకున్న విచక్షణాధికారాలతో సర్వం తానే అన్నీనేనే అన్నట్లుగా ట్రంప్ వైఖరి సాగిపోతోంది. ఇప్పుడు ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై సైనిక దాడులు ముమ్మరం చేసిన ట్రంప్ ఇరాన్‌ను భూస్థాపితం చేసేస్తానన్న శపథం చేసి మరీ ఉన్నారు. ఇరాన్ చర్యలు పూర్తయ్యాక ఇక క్యూబాసంగతి చూస్తామంటూ బాహాటంగానే హెచ్చరికలు చేసేసారు. ఇంతకీ క్యూబాపై ఎందుకింత ద్వేషం, ఎడాపెడా ఆంక్షలు అమలు ఎందుకు చేస్తున్నట్లు, ఇంచుమించుగా ఉత్తరకొరియా, ఇరాన్, రష్యాలపై ఉన్న ఆంక్షలన్నీ అతిచిన్న దేశం క్యూబాపై అమలు చేస్తున్న ట్రంప్ త్వరలోనే స్వాధీనం చేసుకుంటామని, ఈలోపు నయాన్నో భయాన్నో తమతో ఒప్పందాలకు తెచ్చుకోగలమన్న ధీమా వ్యక్తం చేస్తున్నారు. వెనిజులా నుంచి చమురు సరఫరాను బ్లాక్‌చేసేసారు. ఇతర దేశాల నుంచి వచ్చే ఇంధన సరఫరాలు, ఎగుమతులన్నింటినీ బ్లాక్‌చేసారు. క్యూబా దేశ పరిస్థితి అత్యంత అధ్వాన్నంగా మారిపోతోంది. దేశంలో ఇంధన కొరతతో పారిశుధ్యం పూర్తిగా కొరవడిపోయింది. గాడాంధకారంలో క్యూబా ప్రజలు కునారిల్లిపోతున్నారు. రాజధాని హవానాలో కుప్పలు కుప్పలుగా చెత్తపేరుకునిపోతోంది. ఇంధనం లేక రోడ్లపై కార్లు కూడా తిరిగే పరిస్థితి లేదు. కొందరికి మాత్రమే సోలార్ ప్యానెళ్లఉన్నాయి. సోవియట్ కాలం నాటి గ్రిడ్ ఒక్కటే ఇప్పుడు దేశానికి తోడుగా ఉంది. ఇక దేశంలోని థర్మోఎనర్జిట

**గన్ని మోహన్**

ప్లాంట్లు సరిపడా విద్యుత్‌ను అందించలేకపోతున్నాయి. మరింత ముడిచమురు లేకుంటే ఇంధన కొరత కూడా మరింత పెరుగుతుంది. గ్రీన్‌ల్యాండ్ తోపాటే బెదిరింపులు ప్రారంభించినా దేశ అగ్ర నేత మిగ్యూల్ దియాజ్ కేనెల్ నన్ను అరెస్టు చేసుకోండి నేనిక్కడే ఉంటా అంటూ అమెరికాకు సవాల్ కూడా విసిరిన సంగతి తెలిసిందే. రష్యా నుంచి మాత్రమే క్యూబాకు ఆయుధ సాయం, రక్షణరంగ సాయం, శిక్షణ ఇతర వనరులు అందేవి.



మిగ్యూల్ దియాజ్

ఇప్పుడు ఉక్రెయిన్‌పై యుద్ధంతో నెలకొన్న సమస్యలతో రష్యా కూడా సాయం అంతంతమాత్రంగానే అందిస్తోందని తెలుస్తోంది, మొత్తంగా చూస్తే అమెరికా లక్ష్యం మొత్తం క్యూబా ప్రజల్లో ఆ పాలనపై అసహనం పెంపొందించేలా చేయడం అనే తెలుస్తోంది. ఇందుకోసమే మౌలిక వనరులన్నింటినీ బ్లాక్‌చేస్తోంది. దీనితో ప్రజల్లో అసహనం తీవ్రస్థాయికి చేరి జెన్‌జడ్ ఉద్యమం లాంటిది లేస్తే తమపని సులువైపోతుందని అమెరికా వ్యూహం ఈ లోపు ఇప్పటికే అన్నింటిని స్తంభింపచేయడంతో క్యూబా చర్చల వైపే మొగ్గుచూపుతుండటంతో అమెరికావిదేశాంగ మంత్రి మార్కో రుబియోకు ట్రంప్ బాధ్యతలు అప్పగించారు. శాంతిని కోరుకునేటట్లయితే క్యూబా ఒప్పందానికి రావడంద్వారా తన దేశ శ్రేయస్సును పరిరక్షించుకోగలుగుతుంది. లేనిపక్షంలో ఇప్పుడు ఇరాన్ తరహాలోనే క్యూబా కూడా దావానలంగా దహించిపోతుందని ప్రత్యేకించి చెప్పనవసరంలేదు. అనేక దీవుల సమూహంగా ఏర్పడిన ఈక్యూబా కరేబియన్ సముద్రం, మెక్సికో తీరం, అట్లాంటిక్ సముద్రాలకు చేరువగా ఉంటుంది. అలాగే దక్షిణాన అమెరికా ఫ్లోరిడా రాష్ట్రం, బహామాస్ పశ్చిమాన హిపేని యోలా, ఉత్తరాన జమైకా, కేమెన్ దీవులున్నాయి. హైతీ, డొమినికా తర్వాత క్యూబా అత్యంత జనాభా ఉన్నదేశంగా నిలిచింది. పదిమిలియన్ల కుటుంబాలు ఇక్కడున్నాయి. 2024 లెక్కల ప్రకారం చూస్తే జనాభా 10.97 లక్షలమంది మాత్రమే. జిడిపి కూడా 252.063 బిలియన్ డాలర్లుగా, తలసరి ఆదాయం 22,237 డాలర్లుగా ఉంది. ఇప్పుడు అమెరికా చేపట్టే చర్యలపై స్పందించే ప్రధాన బాధ్యతలు ఆదేశ అధ్యక్షుడు మిగ్యూఎల్ దియాజ్ కేనల్, ప్రధాని మాన్యువల్ మార్రేరో క్రజ్‌లపైనే ఉంది. అమెరికా చర్యలవల్ల క్యూబాలో ప్రజారోగ్య సంక్షోభం తలెత్తుతోంది. దీనికితోడు క్యూబాకు పర్యాటకమే ప్రధాన రాబడి వనరుగా ఉంది. ఇప్పటికే ఇంధన కొరతతో విమాన సర్వీసులు కూడా నిలిచిపోయాయి. ఎయిర్‌ఫ్రాన్స్ ఇప్పటికే తన సర్వీసులన్నింటినీ నిలిపివేసింది. దేశంలోని ఏకైక పార్టీగా ఉన్న కమ్యూనిస్టుపార్టీ ఆఫ్ క్యూబా (పిసిసి)ప్రభుత్వాన్ని ఎలాగైనా గద్దెదించి అమెరికా చెప్పుచేతల్లోకి తీసుకోవాలన్నది నిర్ణయంగాఉంది. మార్క్సిస్టు లెనినిస్టు పార్టీ అయిన ఈపార్టీ ఒక్కటే క్యూబాలో 1965 నుంచి కొనసాగుతోంది. ఆనాటి నేత ఫిడేల్ క్యాస్ట్రో నుంచి మనుమడు రౌల్‌క్యాస్ట్రోవరకూ ఇప్పటికీ ఆపార్టీకి వారే అండదండలతో ఉన్నారు. అమెరికా ఆంక్షలతో దేశంలో ద్రవ్యోల్బణం 24శాతానికి పెరిగిపోయింది. నికెల్, కోబాల్ట్ ఖనిజ వనరుల అపార నిల్వలున్న దేశంగా క్యూబాకు పోరుంది. సిలికా ఇసుక, క్రోమైట్, బంగారం, లెడ్, జింక్ వనరులు కూడా అత్యధికమే. బహుశా వీటిపైఫోకస్‌పెట్టిందో ఏమోకానీ ద్వీపసమూహాల్లో తన సైనిక, వైమానిక స్థావరాలను ఏర్పాటు చేసుకుని చిన్నచిన్న దేశాలను హస్తగతం చేసుకునే లక్ష్యంతోనే ఇరాన్ తర్వాత క్యూబాపై ట్రంప్ కన్నేసినట్లు ఆయన ధోరణులు చెప్పకనే చెపుతున్నాయి. ఏదో ఒక ఒప్పందానికి వచ్చేటట్లు చేసుకునేందుకుఅమెరికా అధ్యక్షుడు క్యూబాను అష్టదిగ్బంధనంలో ఉంచారు. క్యూబన్ ప్రజల భవిష్యత్తు మొత్తంఇప్పుడు ఆ పాలకులతోపాటు అమెరికా చేతుల్లోనే ఉందనడంలో ఎలాంటి సందేహంలేదు.

# ప్రత్యేక రిజర్వేషన్లతోనే మహిళా సాధికారత

**నేదునూరి కనకయ్య**

ఒక దేశ ప్రగతి పురోగతి స్త్రీ పురుష సమానత్వంపై ఆధారపడి ఉంటుంది. మానవ వనరుల్లో సగభాగమైన మహిళలకు ప్రాధాన్యమిస్తున్న దేశాలు ఆర్థికంగా అభివృద్ధి చెంది అగ్రస్థానంలో నిలిచాయి. స్త్రీ, పురుష అసమానతలు ఎక్కువగా వున్న దేశాలు ఆర్థికంగా ఆశించిన మేరకు అభివృద్ధి చెందలేదు. ప్రపంచ ఆర్థిక ఫోరం 2022 నివేదిక ప్రకారం ప్రపంచంలోని లింగ సమానత్వ భారత దేశం146 దేశాల్లో 135వ స్థానంలో నిలిచింది. స్త్రీ పురుషసమానత్వం కోసం తీసుకున్న నాలుగు ప్రధానఅంశాలు అంచనావేశారు. ఆర్థిక భాగస్వామ్యంలో 143వ స్థానం, రాజకీయ సాధికారత అధికారంలో 48వ స్థానం, విద్యాభ్యాసంలో 107వ స్థానం నిలిచిన భారతదేశం వైద్యరంగంలో అట్టడుగు146వ స్థానంలో వుంది. సమానత్వ సుచిలో 135వ స్థానంలో ఉన్న మనదేశంకంటే కేవలం 11దేశాలుమాత్రమే ఉన్నాయి. మన పొరుగు దేశమైన బంగ్లాదేశ్ నేపాల్ లాంటి చిన్న దేశాలు స్త్రీ, పురుష సమానత్వంలో మనకంటే ముందు ఉన్నాయి. మనదేశంలో లోక్‌సభలో 543పార్లమెంట్ సభ్యు లుంటే మహిళా సభ్యులు 66 మంది మాత్రమే ఉన్నారు. మొదటి లోక్‌సభలో మహిళా ఎంపిల సంఖ్య22 కాగా ప్రస్తుత లోక్‌సభలో మహిళా ఎంపిల సంఖ్య66 మాత్రమే. అధికార రాజకీయపార్టీకానీ ప్రతిపక్ష పార్టీలు మహిళా సాధి కారతను మాటలకే పరిమితం చేశాయి. మహిళాప్రాతినిధ్యం పెంచడానికి కృషి చేయలేదు. శాసన నిర్మాణ వ్యవస్థలో స్త్రీల భాగస్వామ్యం అతి తక్కువగావుంది. మన పార్లమెంట్ ఉభయ సభల్లో మహిళా ఎంపిల వాటా 15 శాతం లోపే వుంది. ప్రస్తుత లోక్‌సభలో 81 మంది రాజ్యసభలో 29 మంది మహిళా ఎంపిలున్నారు. దేశవ్యాప్తంగా అన్నిరాష్ట్రాల అసెంబ్లీలలో మహిళా ఎమ్మెల్యే సగటు సంఖ్య 8 శాతం లోపే వుంది. తెలంగాణ ఏర్పడిన తొలి కేబినెట్లో ఒక్క మహిళా మంత్రి లేరు. ప్రస్తుత ఇద్దరు మహిళా మంత్రులు ఉన్నారు. ఇటీవల గుజరాత్ హిమాచల్‌ప్రదేశ్ ఎన్నికల్లో ఇదే కథ పునరావృతమైంది. మహిళా రిజర్వేషన్స్ బిల్లు మరో సారి పార్లమెంట్లో ప్రవేశ పెట్టాలని సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. తాజా పరిణామాలు చట్ట సభల్లో స్త్రీల ప్రాతినిధ్యం మహిళా రిజర్వేషన్ మీద చర్చకు దారితీసాయి. న్యాయ శాఖ మంత్రి లోక్‌సభలో వెల్లడించిన గణాంకాలు రాజకీయపార్టీల చిత్తశుద్ధిని ప్రస్ఫుటం చేశాయి. ఆకాశంలో సగం అవకాశాల్లో సగం అనే నినాదంనినాదంగానే మిగిలిపోయింది? స్త్రీలు, పురుషులతో సమానంగా అభివృద్ధి చెందడం లేదు. జనాభాలో సగం వున్న మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్స్ చట్టం చేయడానికి రాజకీయ పార్టీలనేతలు మీనమేషాలు లెక్కిస్తూ తీవ్రజాప్యం చేస్తున్నారు. మహిళలకు ఒకసారి సీట్లు రిజర్వ్ చేస్తే శాశ్వతంగా తమకు అధికారం దక్కదన్న భావన మహిళా బిల్లు ఆమోదం కాకుండా అడ్డుపడుతుంది. 1996లోనే మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్లో ప్రవేశపెట్టారు. అనేక పరిణామాలు అపరిమిత ఆలస్యం తర్వాత2010లో బిల్లును రాజ్యసభ ఆమోదించింది. నాటి లోక్‌సభ కాలపరిమితి తీరిపోవడంతో ఆ బిల్లు అమలుకు నోచుకోలేదు. ఇటీవల కాలంలో మహిళా బిల్లు పార్లమెంట్లో ప్రవేశపెట్టాలని డిమాండ్ పెరిగింది. లింగ సమానత్వం ద్వారా స్త్రీ, పురుషులకు సమన్యాయం కలిపించడానికి కట్టుబడిన కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్లో బిల్లు తేవడానికి పార్టీల మధ్య ఏకాభిప్రాయం అనే సాకుతో ఆలస్యం చేస్తున్నారు. మహిళా సాధికారత సాధనకు కట్టుబడి వున్నామని మహిళా సంక్షేమమే మానవ సంక్షేమమని చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశ పెడతామని ఎన్నికల మేనిఫెస్టోల్లో అన్ని రాజకీయ పార్టీలు ప్రకటించి మహిళలకు ఉచిత విద్య బాలికలకు ఉచితంగా సైకిళ్లు ఇవ్వడం కంప్యూటర్, లాప్టాప్‌లు ఇవ్వడం ఉచితాల ప్రకటనల్లో పోటీపడుతున్న రాజకీయ పార్టీలు మహిళలకు వెనుకబడిన వర్గాల వారికి వారి జనాభా దామాషా ప్రకారం సార్వత్రిక ఎన్నికల్లో టిక్కెట్లు ఇవ్వడంలో నిర్లక్ష్యాన్ని ఉదాసీనతను సాచివేత వైఖరిని అవలంబించడం శోచనీయం. రాజ్యాధికారంలో సమాన వాటా పొందక రాజ్యాంగ




పితామహుడిగా కీర్తి గడించిన బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయమైన ప్రజాస్వామిక న్యాయం మహిళలు వెనుకబడిన వర్గాల వారికి అందని ద్రాక్ష అయింది. అధికారపార్టీ ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల సమయంలో మహిళలను, బిసిలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారు. పార్టీలు టికెట్ల కేటాయింపులో మగవాళ్ళకే పెద్దపీట వేస్తున్నాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలైనప్పటికి అమృతోత్సవాలు జరుపుతున్నప్పటికి దేశ జనాభాలో సగం వున్న మహిళలకు శాసన నిర్మాణంలో అతి తక్కువ స్థానం ఇవ్వడం సమంజసం కాదు. తక్కువ సంఖ్యలో వున్న వారు అధికారాన్ని చెలాయిస్తూ అధిక సంఖ్యాకులైన మహిళలు వెనుకబడిన వర్గాల వారు రాజ్యాధికారానికి దూరంగా ఉండడం ప్రాతినిధ్య ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని రాజనీతివేత్తలు, న్యాయనిపుణులు ఆందోళన వ్యక్తంచేశారు. 2022 లెక్కల ప్రకారం అమెరికా, ఐరోపా, సహారా ఎడారికి దక్షిణాన వుండే సబ్ సహారా ఆఫ్రికా ప్రాంతాలలో జాతీయ పార్లమెంట్లో ప్రపంచ సగటు 26.2 శాతం కన్నా ఎక్కువే మహిళలు ఎంపిలుగా వున్నారు. నేపాల్‌లో 34 శాతం, బంగ్లాదేశ్ 21శాతం, పాకిస్థాన్ 20శాతం, భూటాన్ 17 శాతం, మన దేశం కన్న మెరుగుగా ఉన్నాయి. ఆసియా దేశాల్లో19.2 శాతం, అరబ్ దేశాల్లో 18.4 శాతం, పసిఫిక్ దేశాల్లో 13.5శాతం వుంది. మన దేశంలో 10 నుండి 15 శాతం లోపు మహిళా ఎంపిలు వున్నారు. ప్రపంచంమొత్తం మీదకేవలం రెండుదేశాల్లో మాత్రమే పార్లమెంట్లో 50శాతం కంటే ఎక్కువ మహిళా ప్రాతినిధ్యం కలిగి వున్నారు. 2016 జూన్ గణాంకాల ప్రకారం రువాండా దేశంలో 63.8శాతం బోలివియాలో 53.1శాతం వుండగా 30శాతం కంటే ఎక్కువ మహిళా ప్రాతినిధ్యంగల దేశాల సంఖ్య పెరిగింది. రాజకీయాలలో మహిళల ప్రాతినిధ్యం ఇవ్వడంలో ఇతర దేశాల కంటే మన దేశం చాలా వెనుకబడి వుంది. పురుషులతో సరిసమాన సంఖ్యలో వున్న మహిళలు ఓటు హక్కును పురుషులతో పాటు సమానంగా వినియోగించుకున్నప్పటికి మహిళలకు చట్ట సభల్లో సముచిత స్థానం దొరకడం లేదు. స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్ ఉన్నపటికీ 90 శాతం మగవారే పెత్తనం చెలాయిస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తే పురుషుల కన్న మహిళలకే విజయావకాశాలు ఎక్కువ వుంటాయి. మహిళలు పోటీచేస్తున్నస్థానాలలో ఎన్నికలవ్యయం తక్కువ వుంటుంది. సమాజంలో సగా భాగమున్న మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు ఇవ్వడం ద్వారా మహిళలకు ప్రజాస్వామిక న్యాయం జరుగుతుంది. ప్రాతినిధ్య ప్రజాస్వామ్య లక్ష్యం నెరవేరుతుంది. రాజ్యాంగంలో పొందుపరచిన స్త్రీ పురుష సమానత్వం అందరికీ సమాన అవకాశాలు కల్పించబడి సామాజిక ఆర్థిక రాజకీయ పంపిణీ న్యాయం సిద్ధిస్తుంది. రాజకీయ పార్టీలు మహిళలకు చట్టసభల్ల కచ్చితమైన శాతాన్ని రిజర్వ్. చేస్తెనే ఆయా పార్టీల గుర్తింపు కొనసాగుతుందనే నిబంధన ఎన్నికల కమిషన్ విధించాలని గిల్ ఫార్ములా సిఫారసు చేసింది. ఈదిశగా ఎన్నికల కమిషన్ సమగ్ర సంస్కరణలు అమలు చేయాలి. అన్ని రాజకీయ పార్టీలు మహిళలకు చట్టసభల్లో వారి జనాభా దామాషా ప్రకారం టికెట్టు ఇచ్చి వారికి చట్ట సభల్లో సముచిత స్థానం ఇవ్వాలి. కేంద్ర రాష్ట్రప్రభుత్వాల మంత్రివర్గంలో మహిళలకు స్థానం ఇవ్వాలి. నీతిఆయోగ్ లాంటి ఉన్నతస్థాయి రాజకీయ నిర్ణయాలలో స్త్రీ పురుషులకు సమాన భాగస్వామ్యాన్ని కలిపించాలి. ఉపాధిఉద్యోగ కల్పనలో వున్న అసమానతలు లింగ వివక్షత రూపుమాపాలి. మహిళా సాధికారత సాధనకు అనువైన వాతావరణాన్ని సృష్టించాలి. మహిళల మీద బాలికల మీద జరుగుతున్న హింస అత్యాచారాలను అరికట్టాలి. స్త్రీలకు సమాన హక్కులు కల్పించాలి. ప్రజాజీవితంలో రాజకీయ ఆర్థికసామాజిక నిర్ణయాలలో, నిర్మాణంలో మహిళల కు క్రియాశీల ప్రాతినిధ్యం నాయకత్వానికి సమాన అవకాశాలుకల్పించాలి. మహిళా సాధికారత ద్వారా ఆర్థిక అసమానతలు కాలుష్యరహిత పర్యావరణవ్యవస్థ ఏర్పడుతుంది. మహిళలు రాజకీయ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి. మహిళలు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి. మహిళలు ఆత్మవిశ్వాసాన్నిపెంచుకోవాలి. పాలనాసంస్థల్లో సహకార ఉద్యమంలో పౌర సంఘాలలో మహిళలు చురుకుగా పాల్గొనాలి. ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఆశించి భంగపడకుండా మహిళలు తమ హక్కుల రక్షణ భద్రత సంరక్షణ సంక్షేమ పథకాల మీద చట్టాల మీద అవగాహన చైతన్యం పెంచుకోవాలి.

### మేమిచ్చిన ఉత్తర్వులు

# అమలు చేయని ఆర్థిక శాఖ

### హైకోర్టు ధర్మాసనం అసహనం

**హైదరాబాద్, మార్చి 7, ప్రభాతవార్త :** తాము ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయకపోవడంతో ఆర్థిక శాఖ పనితీరుపై హైకోర్టు అసహనాన్ని వ్యక్తం చేసింది. మిషన్ భగీరథ పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ఉత్తర్వులు ఇచ్చినా అమలు చేయకపోవడంపై నిలదీసింది. తమ ఉత్తర్వులను ఎందువల్ల అమలు చేయలేకపోయారో కనీసం వివరణ ఇవ్వలేదని, కోర్టు ఉత్తర్వులంటే ఎలాంటి గౌరవం ఉన్నట్టు లేదని వ్యాఖ్యానించింది. పనులు చేసిన కంపెనీకి బిల్లులు చెల్లించకపోతే ఆ కంపెనీని ఎలా నిర్వహించాలని, ఉద్యోగులకు వేతనాలు ఎలా చెల్లిస్తుందని ప్రశ్నించింది. చేవెళ్ల, వికారాబాద్, పరిగి, తాండూరు, మహేశ్వరం నియోజకవర్గాలకు మిషన్ భగీరథ కింద తాగునీటి పథకాల నిర్మాణం, నిర్వహణకు సంబంధించి రూ.180.17 కోట్ల బిల్లుల్లో ఆమోదించిన వాటిని చెల్లించాలంటూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను ప్రభుత్వం అమలు చేయలేదని తెలుపుతూ సంబంధిత కంపెనీ కోర్టు ధికరణ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ పీ మాధవీదేవి విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి ఈ నెల 13లోగా గత ఉత్తర్వులను అమలు చేసి నివేదికను సమర్పించాలని, లేకుంటే ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి వ్యక్తిగతంగా హాజరవ్వాలని ఆదేశించారు.

# తండ్రి మందలించాడని కొడుకు ఆత్మహత్య

### మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలో ఘటన

**నవాబుపేట, మార్చి 7, ప్రభాతవార్త :** తండ్రి మందలించాడని కొడుకు ఆత్మహత్య చేసుకున్న ఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలంలో చోటు చేసుకున్నది. ఎస్సై విక్రం తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని గురుకుంట గ్రామానికి చెందిన గణేష్ పదవ తరగతి వరకు చదువుకుని ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. హోలీ పండుగ సందర్భంగా తన స్నేహితులతో గొడవ పడడంతో తండ్రి మందలించాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం ఇంట్లో నుంచి ఆటో తీసుకొని వెళ్ళిపోయాడు. రాత్రికి ఇంటికి తిరిగి రాకపోవడంతో శనివారం ఉదయం గణేష్ వ్యవసాయ పొలం వద్ద రేకుల షెడ్డులో ఉరి వేసుకున్నట్లు తెలిసింది. హుటాహుటిన పొలం వద్దకు వెళ్లి చూడగా అప్పటికే ప్రాణం పోయిందని స్థానికులు తెలిపారు. తండ్రి వీరన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



గణేశ్ (ఫైల్)

# కామారెడ్డిలో కలకలం రేపుతున్న చిన్నారుల అదృశ్యం

### రెండు రోజుల్లో కనిపించకుండా పోయిన ఐదుగురు చిన్నారులు

### సిసి కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైద రాబాద్, మార్చి 7:** తెలంగాణలోని కామారెడ్డిలో రెండు రోజుల్లో ఐదుగురు చిన్నారులు అదృశ్యం కావడం కలకలం రేపుతోంది. అదృశ్యమైన వారంతా పదేళ్ల లోపు చిన్నారులే. శుక్రవారం ఇద్దరు, శనివారం మరో ముగ్గురు చిన్నారులు అదృశ్యమయ్యారు. ఐదుగురు పిల్లలు కనిపించకుండా పోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వారంతా కామారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. శుక్రవారం పట్టణంలోని గోసంగి కాలనీకి చెందిన పదేళ్ల సింహాద్రి, తొమ్మిదేళ్ల విజయ్ కనిపించకుండా పోయారు. శనివారం ఆర్బీ నగర్ కాలనీకి చెందిన ముగ్గురు అక్కాచెల్లెళ్లు సీఫాత్ (8), ఆయాత్ (7), మరియం (5) అదృశ్యమయ్యారు. ఈ ముగ్గురు పిల్లలు తండ్రి ఆటోలో దుకాణానికి వెళ్లారు. తండ్రి వారిని దుకాణం వద్ద దింపి కిరాయికి వెళ్లాడు. కానీ ముగ్గురు ఆ తర్వాత కనిపించలేదు.

# కమ్యూనిస్టు పార్టీలకు ప్రపంచ శాంతే శాశ్వత అజెండా

### మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 7:** జవహర్ లాల్ నేహ్రూ నేతృత్వంలోని ప్రభుత్వం అలీనోద్యమానికి నాయకత్వం వహించి, ప్రపంచ శాంతికి కృషి చేయగా, ప్రస్తుత మోడీ ప్రభుత్వం అమెరికాకు దాసోహమైందని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట రెడ్డి విమర్శించారు. ప్రపంచంలోని ఖనిజ సంపద, చమురు నిక్షేపాలపై అధిపత్యం కోసమే అమెరికా సామ్రాజ్యవాదం యుద్ధాలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కమ్యూనిస్టు పార్టీలకు ప్రపంచ శాంతే శాశ్వత ఎజెండా అని ఆయన ఉద్ఘాటించారు. మఖ్దూంభవన్‌లో శనివారం అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఐప్సో) రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్ రచించిన 'ప్రపంచ శాంతి కోసం కమ్యూనిస్టు పార్టీ ఉద్యమం' అనే పుస్తక పరిచయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఐఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ అధ్యక్షత వహించగా, పల్లా వెంకట్ రెడ్డితో పాటు మాజి ఎంఎల్ ఐప్సో జాతీయ నాయకులు కె. యాదవ రెడ్డి, ఐప్సో నాయకులు ఓబేదుల్లా కోత్వాల్, డాక్టర్ డి.సుధాకర్, పి.ప్రేమ్ పావని హాజరయ్యారు. ఈ సందర్భంగా పల్లా వెంకట రెడ్డి మాట్లాడుతూ రెండు ప్రపంచ యుద్ధాలతో అనేక దేశాలు తీవ్రమైన సంక్షోభాల్లో కూరుకపోయాయని, సోవియేట్ యూనియన్ నేతృత్వంలో సోషలిస్ట్ శిబిరం ఉండటం వల్లనే మూడవ ప్రపంచ యుద్ధం రాలేదన్నారు. డోనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడయ్యాక ప్రపంచ శాంతికి భగం వాటిల్లిందని, ఇరాన్, ఇజ్రాయిల్, అమెరికాలు యుద్ధం చేస్తున్నాయని అన్నారు. ఇరాన్ కూడా సమర్థవంతంగా ఎదుర్కొంటున్నదని తెలిపారు. కెవిఎల్ 24 పుస్తకాలు రాయడం సాధారణ విషయం కాదన్నారు. ప్రపంచ శాంతి కోసం కమ్యూనిస్టు పార్టీ ఉద్యమం అనే పుస్తకం ప్రతి ఒక్కరూ చదవాలన్నారు. సోవియేట్ యూనియన్ శిబిరంలో ఉన్న క్యూబా అమెరికాను గడగడలాడించిందని, క్యూబాను అమెరికా ఏమిచేయలేకపోయిందని పల్లా వెంకట రెడ్డి చెప్పారు. ఒక ఏడాది యుద్దానికి అయ్యే వ్యయంతో 200 ఏళ్లకు సరిపడే విద్య, వైద్యం ఉచితంగా అందించవచ్చని యాదవరెడ్డి అన్నారు. ప్రస్తుతం జరుగుతున్నది మూడవ ప్రపంచ యుద్ధమే నన్నారు. శాంతి కోసం ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీ పోరాడుతోందన్నారు. దేశంలో కమ్యూనిస్టు పార్టీలన్నీ ఏకమైతే పేదలకు మేలు జరుగుతుందన్నారు. డాక్టర్ డి.సుధాకర్ మాట్లాడుతూ కెవిఎల్ రచనలు సమాజానికి స్ఫూర్తిదాయకమన్నారు. కెవిఎల్ రాసిన పుస్తకాలను క్యూబాలో ఆవిష్కరించామని గుర్తు చేశారు.

# విద్యుత్ ఛార్జీల పెంపు లేదు

### స్పష్టం చేసిన రాష్ట్ర డిస్కమ్‌లు

### ఎస్పీడిసిఎల్ ఆదాయం రూ.40,659 కోట్లు

### వ్యయం రూ.50,242 కోట్లు

### ఎన్పీడిసిఎల్ రూ.22,754 కోట్లు రాక

### రూ.12,521కోట్ల రెవెన్యూ లోటు

**హైదరాబాద్, మార్చి 7, ప్రభాతవార్త:** వచ్చే 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు పెంచడం లేదని తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు స్పష్టం చేశాయి. రాష్ట్ర విద్యుత్ నియంత్రణ కమిషన్ ఛైర్మన్ జస్టిస్ డి నాగార్జున నేతృత్వంలో శనివారం నిర్వహించిన బహిరంగ విచారణలో దక్షిణ తెలంగాణ, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు (ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్) ఈ మేరకు వాటి ఆదాయ, వ్యయ అంచనాలను గూర్చి వెల్లడించాయి. ఇందులో భాగంగా ఎస్పీడీసీఎల్ సిఎండి వి జితేష్ పాటిల్ వాటి వివరాలను వెల్లడించారు. తమ సంస్థ పరిధిలో 2026-27 ఆర్థిక సంవత్సరంలో అవసరాలు రూ.50,242 కోట్లలో విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు చెల్లించాల్సిన మొత్తం రూ.38,492 కోట్లుగా ఉంది. ప్రస్తుత టారిఫ్‌లపై వచ్చే ఆదాయం రూ.40,659 కోట్లు పోను రెవెన్యూ లోటు రూ.9,583 కోట్లని, ఈ గ్యాప్ ను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందనే ఆశతో ఉంది.

అలాగే ప్రస్తుతం 35,175 మెగా వోల్ట్ యాంపియర్ (ఎంవిఎ) కనెక్టెడ్లో లోడ్ కలిగిఉండగా, గత డిసెంబర్ వరకు 39,556 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరిగింది. వీటిలో గృహ రంగంలో విద్యుత్ వినియోగం 23 శాతం, పారిశ్రామికానికి 31, వ్యవసాయ వినియోగం 21, కమర్షియల్ 16, ఇతర కేటగిరీల్లో 9 శాతంగా ఉంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో డిమాండ్ 20,975 మెగావాట్లకు చేరే వీలుందని అంచనా. పంపిణీ నష్టాలు 8.30 నుంచి 8.04 శాతానికి, పవర్ పర్చేసింగ్ కాస్ట్ రూ.5.54కు తగ్గాయి. పిటిఆర్ ఫెయిల్యూర్స్ 1.82 నుండి 1.49 శాతానికి తగ్గాయని వెల్లడించారు. అలాగే ఎన్పీడీఎల్ సిఎండి వరుణ్‌రెడ్డి వివరిస్తూ వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.22,754 కోట్ల సమగ్ర ఆదాయ ఆవశ్యకత ఉండగా, దీనిలో రూ.12,521 కోట్ల రెవెన్యూ లోటు ఉందన్నారు.

ఈ లోటు బడ్జెట్‌కు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సబ్సిడీ రూపంలో మద్దతు కోసం సంస్థ ఎదురు చూస్తోంది. ఇక గ్రీన్ ఎనర్జీ ప్రోత్సాహకంలో భాగంగా ఎల్‌టీ, హెచ్‌టీ వినియోగదారులకు సాధారణ టారిఫ్ కంటే యూనిట్‌కు 0.66 గ్రీన్ టారిఫ్ కొనసాగిస్తోంది. పరిశ్రమల్లోని టైం ఆఫ్ డే ధరల్లో సైతం ఎలాంటి మార్పు లేదన్నారు. ఓపెన్ యాక్సెస్ ఎనర్జీ మేరకు సంబంధిత వినియోగదారులకు వర్తించే ఎనర్జీ చార్జీల్లో 10 శాతం చొప్పున స్టాండ్ బై చార్జీల విధింపు కొనసాగిస్తామన్నారు. ఎన్పీడీసీఎల్ వ్యాప్తంగా 70 లక్షల 29 వేల వినియోగదారులు ఉండగా, తలసరి విద్యుత్ వినియోగం 1,680 యూనిట్లు ఉందన్నారు.

# మమతాబెనర్జీ అన్ని హద్దులు దాటేశారు..

### రాష్ట్రపతిని అవమానించడం రాజ్యాంగ విరుద్ధం

### ప్రధాని నరేంద్రమోడీ ధ్వజం

**న్యూఢిల్లీ, మార్చి 7:** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రోటోకాల్ వివాదంపై ప్రధాని నరేంద్రమోడీ స్పందించారు. తృణమూల్ కాంగ్రెస్, సీఎం మమతా బెనర్జీపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పశ్చిమబెంగాల్‌ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్ని హద్దులూ దాటేసారని ఆయన ధ్వజమెత్తారు. అంతర్జాతీయ సంతాల్ సమావేశం వేదికను మార్చాడాన్ని తప్పుపట్టారు. ఈ పరిణామాలు సిగ్గుచేటు, అనూహ్యమైనదని అభివర్ణించారు. శనివారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్రపతి, వేదికను బిధాన్‌నగర్ నుంచి గోష్పైపూర్‌కు ఎందుకు మార్చారని ప్రశ్నించారు. మమతా బెనర్జీ లేదా ఇతర మంత్రులు ఎవరూ రిసీవ్ చేసుకోవడానికి రాకపోవడంపై రాష్ట్రపతి అసంతృప్తి వ్యక్తం చేశారు. తృణమూల్ కాంగ్రెస్ సంతాల్ సంస్కృతిని నిర్లక్ష్యంగా చూస్తోందని ఆరోపించారు. రాష్ట్రపతి కూడా గిరిజన సమాజానికి చెందినవారని ఎత్తి చూపారు. ఇది సిగ్గుచేటు, అపూర్వమైనది. ప్రజాస్వామ్యం, గిరిజన వర్గాల సాధికారతపై నమ్మకం ఉన్న ప్రతి ఒక్కరూ నిరుత్సాహపడ్డారు. గిరిజన సమాజానికి చెందిన రాష్ట్రపతి జీ వ్యక్తం చేసిన బాధ, వేదన భారతదేశ ప్రజల మనస్సులలో తీవ్ర విచారాన్ని కలిగించింది. పశ్చిమ బెంగాల్‌లోని టిఎంసి ప్రభుత్వం నిజంగా అన్ని పరిమితులను దాటింది. రాష్ట్రపతికి జరిగిన ఈ అవమానానికి వారి పరిపాలన బాధ్యత వహిస్తుంది. సంతాల్ సంస్కృతి వంటి ముఖ్యమైన అంశాన్ని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం కూడా అంతే దురదృష్టకరం అని మోడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రపతి పదవి అంటే రాజ్యాంగ బద్ధమైన ఎంతో పవిత్రమైన కొలువు అని ఆయన గుర్తుచేసారు. అయితే పశ్చిమబెంగాల్‌లోని మమతా టిఎంసి నేతలు మాత్రం రాష్ట్రపతిని అడ్డంపెట్టుకుని ఎన్నికలకు వస్తున్న తరుణంలో బిజెపి రాజకీయాలుచేస్తోందని ఆరోపించారు.



### సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు

### వంటగ్యాస్ ధరల పెంపునకు నిరసనగా

# నేడు రాష్ట్రవ్యాప్త నిరసనలు

**హైదరాబాద్, మార్చి 7, ప్రభాతవార్త:** వంటగ్యాస్ ధరల పెంపునకు నిరసనగా నేడు(ఆదివారం) రాష్ట్ర వ్యాప్తింగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రకటించింది. కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం సామాన్యుడి నడ్డి విరుస్తూ గృహ వినియోగ వంట గ్యాస్ సిలిండర్ ధరను రూ.60లు, కమర్షియల్ సిలిండర్ ధరను రూ. 115లు పెంచడాన్ని పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తీవ్రంగా ఖండించారు. ప్రజలపై వేస్తున్న ఈ భారానికి నిరసనగా నేడు(ఆదివారం) రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతుంటే, ఇప్పుడు గ్యాస్ ధర పెంచడం పేద, మధ్యతరగతి కుటుంబాలకు అదనపు భారమవుతుందన్నారు. దేశ సంపదను అంబానీ, అదానీ వంటి కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తూ, పేద ప్రజలపై అదనపు భారాలు విధించే కేంద్ర బిజెపి ప్రభుత్వ విధానాలు ప్రజలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయన్నారు. తక్షణమే పెంచిన వంట గ్యాస్ ధరను ఉపసం హరించుకోవాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరల అదుపు నకు తక్షణమే కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశా రు. పెంచిన వంటగ్యాస్ ధరలకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాపితంగా నేడు జరిగే నిరసన కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులతో పాటు సామాన్య ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని జాన్ వెస్లీ విజ్ఞప్తి చేశారు.

# హైదరాబాద్‌ను క్లీన్ సిటీగా మార్చాలి

### ప్రతీరోజు చెత్త సేకరణ జరగాల్సిందే

### క్యూర్ పరిధిలో ఇ.వి. వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించాలి

### కొత్త డంప్‌యార్డులు అందుబాటులోకి తీసుకురండి

### మున్సిపల్ కమిషనర్ల సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 7:** హైదరాబాద్ నగరాన్ని క్లీన్ సిటీగా మార్చాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. 99రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం క్యూర్ పరిధిలోని ట్రై మున్సిపల్ కార్పొరేషన్స్‌కు సంబంధించిన ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం పలు సూచనలు చేశారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో ప్రతీరోజు చెత్త సేకరణ జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. నగరంలో ప్రతీరోజు ఇంటింటికి చెత్త సేకరణ జరగాల్సిందేనని స్పష్టం చేశారు. చెత్త సేకరణకు సంబంధించి ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించేలా ఇప్పటి నుంచే ప్రోత్సహించాలని సూచించారు. ఒక్కో వాహనానికి ఒక్కో ఏరియా చొప్పున కేటాయించి నిరంతరం పర్యవేక్షించాలన్నారు. నగరం పరిధి విస్తరించిన నేపథ్యంలో ఇప్పటికే కొత్తగా గుర్తించిన డంప్ యార్డులను వీలైనంత త్వరగా సిద్ధం చేసి అందుబాటులోకి తీసుకురావాలని సీఎం అధికారులను ఆదేశించారు. కార్పోరేషన్ల వారీగా దగ్గరలోని డంపింగ్ యార్డులకు చెత్తను తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా జరిగేలా పర్యవేక్షించాల్సిన అవసరం ఉందన్నారు. నిర్మాణ వ్యర్థాలకు సంబంధించి అధికారులకు ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. క్యూర్ పరిధిలోని ట్రై మున్సిపల్ కార్పోరేషన్లలో నిర్మాణ వ్యర్థాలు ఎక్కడ పడితే అక్కడ డంప్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నిర్మాణ వ్యర్థాల తరలింపు కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. అపరిశుభ్రత లేకుండా చూసుకోవడంతో పాటు దోమల నివారణకు చర్యలు చేపట్టాలని సీఎం అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధుల విషయంలో నగరవాసులకు సరైన వైద్యం అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎం సెక్రెటరీ మాణిక్‌రాజ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, సైబరాబద్ మున్సిపల్ కమిషనర్ శ్రీజన, మల్కాజ్ గిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఎపి 'విజయ' పేరుతో కల్తీపాలు, నెయ్యి!

### తెలంగాణలో సరఫరా అవుతున్నాయి..

### ఎపి ప్రభుత్వం దీనిపై స్పందించాలి

### డిడిసి చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి సంచలన ఆరోపణ



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 7:** తెలంగాణ పాడి రైతుల ప్రయోజనాలను దెబ్బతీస్తూ, ప్రైవేట్ వ్యక్తులు విజయ బ్రాండ్ పేరుతో కల్తీ పాలు, నెయ్యి విక్రయిస్తున్నారంటూ తెలంగాణ డైరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. శనివారం సికింద్రాబాద్‌లోని విజయ డైరీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏపీలో వైసీపీ ప్రభుత్వం ప్రైవేట్ ఫ్రాంచైజీలకు అనుమతులు ఇవ్వడం వల్ల మార్కెట్లోకి నాణ్యత లేని ఉత్పత్తులు వస్తున్నాయని, ఇది ప్రజల ఆరోగ్యంతో చెలగాట మాడటమేనని మండిపడ్డారు.

వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విజయ బ్రాండ్‌ను ప్రైవేట్ వ్యక్తులకు ఫ్రాంచైజీలుగా ఇవ్వడం వల్ల తీవ్ర అనర్థాలు జరుగుతున్నాయని అమిత్ రెడ్డి ఆరోపించారు. ముఖ్యంగా మేఘన ఫుడ్స్ అనే సంస్థకు ఫ్రాంచైజీ ఇవ్వగా, వారు గుజరాత్‌లో నెయ్యి తయారు చేసి తెలంగాణలో విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. ఈ నెయ్యిలో వెజిటబుల్ ఆయిల్ కలిసినట్లు నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఎన్‌డిడిబి) నివేదిక ఇచ్చిందని ఆయన వెల్లడించారు. నెలకు సుమారు 100 టన్నుల కల్తీ నెయ్యి హైదరాబాద్ మార్కెట్లో అమ్ముడవుతోందని, దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

తెలంగాణ విజయ డెయిరీకి ఉన్న నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని, ఏపీకి చెందిన ప్రైవేట్ యూనియన్లు ఇక్కడ తక్కువ నాణ్యత గల పాలను విక్రయిస్తున్నాయని చైర్మన్ ధ్వజమెత్తారు. పాల ప్యాకెట్లపై ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ప్రైవేట్ కంపెనీల వివరాలు వస్తున్నాయని, దీని వల్ల స్థానిక పాడి రైతులకు రావాల్సిన ఆదాయం గండిపడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో నెల్లూరు, కర్నూలు యూనియన్లు విజ్ఞప్తి మేరకు విజయ పేరు వాడటం నిలిపివేసినా, కొన్ని ప్రైవేట్ శక్తులు మాత్రం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని స్పష్టం చేశారు.ఆ సంస్థను ప్రశ్నిస్తే.. తాము అమ్మట్లేదని చెప్తున్నారని పేర్కొన్నారు.

డైరీ ఫెడరేషన్ నిబంధనల ప్రకారం ప్రైవేట్ వ్యక్తులు ప్రభుత్వ బ్రాండ్లను వాడుకోవడానికి వీల్లేదని, ఈ విషయమై ఏపీ డైరీకి ఎన్ని లేఖలు రాసినా స్పందన లేదని అమిత్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. కల్తీ పాలు, నెయ్యి వ్యవహారంపై ప్రస్తుతం ఏపీ అసెంబ్లీలోనూ చర్చ జరుగుతోందని, అక్కడి ప్రభుత్వం వెంటనే దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ పాడి రైతుల ప్రయోజనాల కోసం తాము ఎంతటి పోరాటానికైనా సిద్ధమని, కల్తీ ఉత్పత్తులను అడ్డుకోవడానికి తనిఖీలు ముమ్మరం చేస్తామని ఆయన హెచ్చరించారు. తెలంగాణ ప్రజలు విజయ పేరును చూసి పాల ప్యాకెట్లను కొనుగోలు చేయాలని సూచించారు.



### యుఎస్ డెలావర్ గవర్నర్‌కు తెలంగాణ విజన్-2047 డాక్యుమెంట్‌ను అందజేసిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 7:** ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డితో అమెరికాలోని డెలావర్ రాష్ట్ర గవర్నర్ మాట్ మేయర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు కూడా పాల్గొన్నారు. విద్య,ఆరోగ్య రంగాల్లో సంస్కరణలు, డేటా ప్రివెన్షన్, యూనివర్సల్ హెల్త్‌కేర్ అంశాలపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. డెలావర్ రాష్ట్రంలో పేద, మధ్యతరగతి ప్రజల కోసం అమలుచేస్తున్న గృహనిర్మాణం, రుణమాఫీ వంటి సంక్షేమ పథకాల గురించి గవర్నర్ మాట్ మేయర్ సిఎం రేవంత్‌రెడ్డికి వివరించారు. భవిష్యత్తులో తెలంగాణ,డెలావర్ రాష్ట్రాల మధ్య బలమైన ద్వైపాక్షిక సంబంధాలు కొనసాగాలని ఆకాంక్షించారు. తెలంగాణ ప్రతినిధుల బృందంతో డెలావర్ రాష్ట్ర పర్యటనకు రావాల్సిందిగా ముఖ్యమంత్రిని సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి డెలావర్ గవర్నర్‌కు 'తెలంగాణ-2047 విజన్ డాక్యుమెంట్'ను అందజేశారు. ఈ సందర్భంగా ఫస్ట్ లేడీ ఆఫ్ డెలావర్ లారెన్ మేయర్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సివిల్స్‌లో ర్యాంకులు సాధించిన 10 మంది ఒబిసి అభ్యర్థులు

### అభినందించిన తెలంగాణ బిసి కమిషన్

**హైదరాబాద్, మార్చి 7, ప్రభాతవార్త:** గురువారం విడుదల చేసిన సివిల్స్-2025 తుది ఫలితాల్లో ర్యాంకులు సాధించిన ఓబీసీ అభ్యర్థులను తెలంగాణ బీసీ కమిషన్ అభినందించింది. సివిల్స్-2025 ఫలితాల్లో తెలంగాణకు చెందిన 20 మంది అభ్యర్థులకు మంచి మార్కులు రావటం, అందులో 10 మంది అభ్యర్థులు ఓబీసీ వర్గానికి చెందినవారు కావడం ఎంతో సంతోషదాయకమని తెలంగాణ బీసీ కమిషన్ అభిప్రాయపడింది. తెలంగాణ బీసీ కమిషన్ ఛైర్మన్ జి. నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి తెలంగాణ నుండి మంచి ర్యాంకులు సాధించిన 20 మంది అభ్యర్థులకు అభినందనలు తెలిపారు. తెలంగాణ నుండి మంచి ర్యాంకులు సాధించిన 20 మందిలో 10 మంది బీసీ వర్గాలకు చెందిన వారు కావడం బీసీల్లో విద్యాపరంగా కలుగుతున్న చైతన్యానికి నిదర్శనం అని ఛైర్మన్ నిరంజన్ పేర్కొన్నారు.



### జిష్ణుదేవ్‌వర్మతో డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 7:**మహారాష్ట్ర గవర్నర్ గా బదిలీ పై వెళుతున్న జిష్ణు దేవ్ వర్మను శనివారం లోక్ భవన్ లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం, సాలువాతో సత్కరించారు.

# ఎన్టీఆర్ జాతీయ అవార్డు దక్కడంపై మెగాస్టార్ చిరంజీవి హర్షం

### సిఎం రేవంత్‌రెడ్డి, డి.సిఎం భట్టి విక్రమార్కలకు కృతజ్ఞతలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 7:** తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన ప్రతిష్ఠాత్మక ఖీగద్దర్ చలనచిత్ర అవార్డులు2025ఖీలో తనకు ఎన్టీఆర్ జాతీయ పురస్కారం దక్కడంపై మెగాస్టార్ చిరంజీవి సంతోషం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ గారి పేరు మీదుగా ఉన్న అవార్డును అందుకోవడం తనకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా చిరంజీవి స్పందిస్తూ... "గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల విజేతలందరికీ హృదయపూర్వక అభినందనలు. సినీ పరిశ్రమలో ప్రతిభను, కష్టాన్ని గుర్తించి గౌరవించడం ఎప్పుడూ ఆనందాన్నిస్తుంది. నన్ను ఎన్టీఆర్ జాతీయ అవార్డుకు ఎంపిక చేసినందుకు తెలంగాణ ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జ్యూరీ సభ్యులకు నా ప్రత్యేక కృతజ్ఞతలు. నా ఈ ప్రయాణంలో ప్రేక్షకుల ప్రేమాభిమానాలే నాకు కొండంత బలం" అని రాసుకొచ్చారు. చిరంజీవికి ఎన్టీఆర్ అవార్డు రావడంపై కింగ్ నాగార్జున, దర్శకుడు అనిల్ రావిపూడి సహా పలువురు సినీ ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. తన తండ్రి ఏఎన్నార్ పేరిట అవార్డును నెలకొల్పినందుకు ప్రభుత్వానికి నాగార్జున ధన్యవాదాలు తెలుపుతూ, జయసుధకు ఆ అవార్డు రావడం సముచితమన్నారు. అలాగే తండేల్ చిత్రానికి గాను తన కుమారుడు నాగచైతన్య ఉత్తమ నటుడిగా ఎంపికవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# తగ్గిన కూరల ధరలు

### సామాన్యులకు ఉపశమనం

**హైదరాబాద్, మార్చి 7, ప్రభాతవార్త:** గత కొన్ని నెలలుగా భారీగా పెరిగిన కూరగాయల ధరలతో తెలంగాణతో పాటు, ఆంధ్రప్రదేశ్‌లో సామాన్యులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. అయితే ప్రస్తుతం కొన్ని కూరగాయల ధరలు తగ్గడంతో సామాన్యులకు ధరల భారం తగ్గి ఒకింత ఉపశమనం కలిగింది. వంటింట్లో ప్రతీ కూరలో ఉపయోగించే టమాటా ధరలు పడిపోగా, వంకాయ ధరలు కూడా స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. ఇక బీరకాయ, పచ్చిమిర్చి ధరలు కాస్త పెరిగాయి. టమాటా ధరలు గతంలో కిలో రూ.30 వరకు పలకగా, ఇప్పుడు రూ.10కే బజార్లలో లభిస్తున్నాయి. హైదరాబాద్‌లోని కూకట్ పల్లి రైతు మార్కెట్లో కిలో టామాటా రూ.10, వంకాయ రూ.18, బెండకాయ రూ.28, పచ్చిమిర్చి రూ.50, బజ్జి మిర్చి రూ.33, కాకరకాయ రూ.31, బీరకాయ రూ.35, క్యాబేజీ రూ.13, బీన్స్ రూ.35, క్యారెట్ రూ.20, గోబిపువ్వు రూ.25, దొండకాయ రూ.35, చిక్కుడుకాయ రూ.35, గోరుచిక్కుడు రూ.30, బీట్ రూట్ రూ.18, క్యాప్చికం రూ.40కే దొరుకుతున్నాయి. ఇక బంగాళదుంప రూ.18, కీర రూ.20, దోసకాయ రూ.16, సోరకాయ రూ.15, పొట్లకాయ రూ.20, ఉల్లిగడ్డ రూ.20, చామగడ్డ రూ.25, చిలకడదుంప రూ.28కి విక్రయిస్తున్నారు.

ఇక ఎండుమిర్చి కేజీ రూ.240, అల్లం రూ.100, వెల్లుల్లి రూ.140, చింతపండు రూ.180, పండుమిర్చి రూ.80, పల్లికాయ రూ.60కి లభిస్తున్నాయి. ఇక విజయవాడలోని రైతు బజార్లలో కిలో టమాట రూ.10, వంగ రూ.14, బెండకాయ రూ.19, ఉల్లిపాయలు రూ.22, బంగాళదుంప రూ.23, దోస రూ.20, సొరకాయ రూ.7, చిక్కుళ్లు రూ.26, కీరదోస రూ.32, బీన్స్ రూ.50, బీట్ రూట్ రూ.22, కంద రూ.40, క్యాప్సికం రూ.56, చిలకడదుంప రూ.26, అలసందలు రూ.22, కాకరకాయ రూ.24, క్యాబేజీ రూ.16, క్యారెట్ రూ.26, దొండకాయ రూ.23, గోరుచిక్కుడు రూ.20 పలుకుతున్నాయి.

# అసోం రైఫిల్స్ శిక్షణ భేష్

## సైనికులారా.. భరత మాత సేవకు సిద్ధం కండి

### మీ పనితీరుతో అసోం రైఫిల్స్‌కు మరింత పేరు తీసుకురావాలి

### కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ వెల్లడి

**హైదరాబాద్, మార్చి 7, ప్రభాతవార్త:** క్రమశిక్షణతో అద్భుతమైన శిక్షణనిస్తూ శారీరకంగామానసికంగా దృఢమైన సమర్థులైన సైనికులను తయారు చేయ డంలో అసోం రైఫిల్స్ శిక్షణా కేంద్రం పనితీరు బాగుందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ అభినందించారు. శనివారం ఉదయం నాగాలాండ్ రాష్ట్రంలోని దిమాపుర రీజియన్ సుఖోవిలోని అసోం రైఫిల్స్ శిక్షణా కేంద్రం పాఠశాలలో శిక్షణ పూర్తి చేసుకున్న సైనికుల ప్రమాణ స్వీకార ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన పరేడ్‌లో 762 మంది శిక్షణ పూర్తి చేసుకున్న సైనికులు ముక్తకంఠంతో కేంద్ర మంత్రి సమక్షంలో ప్రమాణం చేశారు. అనంతరం అసోం రైఫిల్స్ నిర్వహించిన పరేడ్ విన్యాసాలను కేంద్ర మంత్రి బండి సంజయ్ తిలకించారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న సైనికులను ఉద్దేశించి కేంద్ర మంత్రి మాట్లాడుతూ మీరే రేపటి జవాన్లు, ఎన్‌సిఓలు, జెసిఓ లు. మీలో కొందరు భవిష్యత్తులో అధికారులు కూడా అవుతారని అన్నారు. ప్రతి సైనికుడి విధి మీ దళ గౌరవాన్ని ఎప్పుడూ కాపాడాలి. మీ ప్రవర్తన వల్ల దళానికి, యూనిఫాంకి ఎలాంటి చెడు పేరు రాకూడదని అన్నారు. ఒక సైనికుడికి తన పని చేయడమే అతని ధర్మమని, మీరు చేసిన ప్రమాణాన్ని ఎప్పుడూ గుర్తుంచుకుని, భరత మాత సేవకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉడాలన్నారు. అస్సాం రైఫిల్స్ చరిత్రలో ఒక ముఖ్యమైన రోజని, 762 మంది శపథం చేసి ఈ గౌరవమైన దళంలో చేరడం చాలా ఆనందంగా ఉందన్నారు. పురుషులు, మహిళలు కలిసి శపథం చేయడం మన దేశం యొక్క మారుతున్న ముఖచిత్రాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. మీరు మీ జీవితాన్ని, మీ కుటుంబ జీవితాలను మెరుగుపరుచుకోవడమే కాకుండా, దేశాన్ని నిరంతరం ముందుకు తీసుకెళ్లడానికి రాబోయే తరం యువతీ, యువకులను కూడా ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. అసోం రైఫిల్స్ శిక్షణా కేంద్రంలో సైనికుల శిక్షణ కోసం కష్టపడి పనిచేస్తున్నారని అభినందించారు. మంచి సైనికులను తయారు చేసిన ఏఆర్‌టిసిఎస్ సభ్యులందరికీ అభినందనలు తెలిపారు. కేంద్ర సాయుధ దళాల శిక్షణ విధానం గురించి నాకు తెలుసు. మీ శిక్షణ చూసి అస్సాం రైఫిల్స్ దాని సంస్థాగత ప్రతిభకు, గౌరవానికి ప్రసిద్ధి చెందిందని, దాని శిక్షణ కూడా అసమానమైనదని స్పష్టంగా తెలుస్తుందని వ్యాఖ్యానించారు. భవిష్యత్తులోనూ అస్సాం రైఫిల్స్ శిక్షణా కేంద్రం ఆధునిక పద్ధతులతో శిక్షణ ఇస్తూ, సమర్థవంతమైన, నైపుణ్యం కలిగిన కొత్త యుద్ధ విధానాలు నేర్పుతూ మంచి పేరు తెచ్చుకుంటుందని ఆశిస్తున్నాను పేర్కొన్నారు. పరేడ్ ముగిసిన అనంతరం కేంద్ర మంత్రి బండి సంజయ్ అసోం రైఫిల్స్ పరేడ్ మైదానంలో సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన శౌర్యస్థల్‌ను ప్రారంభించారు. అసోం రైఫిల్స్ సైనికుల వీరత్వం, త్యాగం, వారి గొప్ప సైనిక చరిత్రను గుర్తు చేసుకునేలా ఈ స్మారక స్థలాన్ని నిర్మించారు. మధ్యలో అశోక చక్రంతో స్తంభాన్ని ఏర్పాటు చేశారు. మన దేశ చరిత్రను, సంప్రదాయ విలువలను ఈ స్థూపం తెలియజేస్తుంది. పక్కనున్న గోడలపై ఉన్న చిత్రాలు అస్సాం రైఫిల్స్ ప్రారంభం నుంచి ఇప్పటివరకు పాల్గొన్న యుద్ధాలు, ఆపరేషన్లను గుర్తుకు తెస్తాయి. దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీర జవాన్ల కథలను స్మరించుకునేలా చిత్రాలను రూపొందించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ శౌర్యస్థల్ శిక్షణ పొందుతున్న సైనికులకు సైనిక జీవితానికి సంబంధించిన నిజమైన అవగాహన కల్పిస్తుంది. వారిలో క్రమశిక్షణ, దేశభక్తి, త్యాగ నిరతిని పెంపొందిస్తుంది. అలాగే అధికారిక కార్యక్రమాలు, వేడుకలు మరింత గౌరవప్రదంగా జరిగేలా మరియు వివిధ ర్యాంకులలో ఉన్న సిబ్బందిలో అంకితభావం, ధైర్యాన్ని పెంచడం ఈ శౌర్యస్థల్ ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ఈ కార్యక్రమం ముగిసిన అనంతరం కేంద్ర మంత్రి బండి సంజయ్ అసోం రైఫిల్స్‌లో నూతనంగా చేరిన జవాన్లతో కలిసి గ్రూప్ ఫోటో దిగారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు వచ్చిన జవాన్ల తల్లిదండ్రులతో కలిసి ముచ్చటించారు. వీరిలో పలువురు తెలుగు కుటుంబాలు కూడా ఉండటం గమనార్హం. అసోం రైఫిల్స్‌లో సైనికుడిగా చేరిన తన మొదటి కొడుకు దేశం కోసం సేవ చేస్తూ బలిదానమయ్యారు. అయినా నాకు ఇంకో కొడుకు ఉన్నాడు. వాడిని కూడా అసోం రైఫిల్స్‌లో చేర్పించాననని, శిక్షణ పూర్తి చేసుకుని మీ సమక్షంలో ప్రమాణం చేయడం సంతోషంగా ఉందని కర్నాటకు చెందిన ఓ మహిళ ఆనంద బాష్పాలు రాలుస్తూ చెప్పడం అక్కడున్న వారందరినీ కదిలించింది.




# నెలాఖరులోగా లక్ష ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు

### మంజూరు చేసిన ఇళ్లన్నీ గ్రౌండింగ్ కావాల్సిందే

### డబుల్‌బెడ్ ఇళ్లకు లబ్ధిదారులను గుర్తించండి

### జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్లతో మంత్రి పొంగులేటి విడియో కాన్ఫరెన్స్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,మార్చి7:** రాష్ట్రంలో ప్రతి పేదవాడి ఆత్మగౌరవానికి చిహ్నంగా నిలిచేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజాప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేస్తోందని, ఈ పథకం ఒక బెంచ్ మార్క్‌గా నిలవబోతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఈ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటివరకు 3.60 లక్షల ఇండ్లను మంజూరు చేయగా ఇందులో లక్ష ఇండ్లకు ఈనెల 31వ తేదీలోగా గృహప్రవేశాలు జరగనున్నాయని తెలిపారు. ఇందుకోసం త్వరలోనే గృహప్రవేశాలకు అనుకూలమైన తేదీలను అధికారికంగా తెలియజేస్తామని తెలిపారు. ఇండ్లు మంజూరు చేసిన తర్వాత కూడా కొన్ని గ్రామాల్లో ఇప్పటికీ పూరిగుడిసెలు కనిపిస్తున్నాయని, అటువంటి కుటుంబాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ఇళ్ల నిర్మాణంలో చేర్చాలని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వం ఇచ్చే ప్రతి ఇల్లు నిజంగా అవసరమైన వారికి చేరేలా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. శనివారం సచివాలయంలోని తన కార్యాలయం నుంచి ప్రజాపాలన ప్రగతి నివేదిక 99 రోజుల్లో చేపట్టవలసిన కార్యాచరణపై జిల్లా హౌసింగ్ పీడీలతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యంతో చేపట్టాలని ఆదేశించారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మంజూరు చేసిన ఇండ్లలో 20 శాతం వరకు గ్రౌండింగ్ కాలేదని అలాంటి ఇళ్లకు సంబంధించి లబ్ధిదారుల సమ్మతి తీసుకుని స్థానిక ప్రజాప్రతినిధులు, ఇందిరమ్మ కమిటీల సూచనలతో మార్చి 31 లోపు అన్ని ఇండ్లు గ్రౌండింగ్ అయ్యేలా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం నిర్మాణం పూర్తికి దగ్గరగా ఉన్న ఇళ్లను సమర్థంగా సమన్వయం చేసుకొని జూన్ చివరినాటికి పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఏప్రిల్ నెలలో రెండవ దశ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసేనాటికి మొదటి దశ ఇందిరమ్మ ఇండ్లు కొలిక్కిరావాలని సూచించారు. ఇండ్ల నిర్మాణంలో ఉపయోగించే నిర్మాణ సామగ్రి ధరలు పెరగడం వల్ల లబ్ధిదారులపై అదనపు భారం పడకుండా జిల్లా స్థాయిలో ధరల నియంత్రణ కమిటీలు చురుకుగా పనిచేయాలని మంత్రి సూచించారు. అవసరమైతే జిల్లా కలెక్టర్లతో కలిసి సమీక్షి ంచి సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలిపారు.



ఎంఎస్ ఆచార్య విగ్రహావిష్కరణలో మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

# స్వాతంత్ర్య యోధుడు ఎంఎస్ ఆచార్య విగ్రహావిష్కరణ

### పాల్గొన్న మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు

**హైదరాబాద్ (గచ్చిబౌలి), మార్చి 7, ప్రభాతవార్త:** శేరిలింగంపల్లి మండల పరిధి లోని గోపన్‌పల్లి జర్నలిస్టుకాలనీ ఫేజ్-3లో శనివారం ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, జర్నలిస్టు ఎంఎస్.ఆచార్య విగ్రహావిష్కరణ ఘనంగా నిర్వహించారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటి శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు ముఖ్య అతిధులుగా హాజరై ఎంఎస్.ఆచార్య విగ్రహాన్ని ఆవిష్కరించి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సంద ర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్టు రామ చంద్రమూర్తి, మాజీ సమాచార కమిషనర్ మాడభూషి శ్రీధర్, బిసి స్టడీ సర్కిల్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ పాల్గొన్నారు. ఎంఎస్.ఆచార్య విగ్రహాన్ని అందంగా తీర్చిదిద్దిన శిల్పి ఉపేందర్‌ను మంత్రులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఎంఎస్.ఆచార్య ప్రారంభించి 30 యేళ్ల క్రితం నిలిచిపోయిన జనధర్మ పత్రికను మంత్రుల చేతుల మీదుగా పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ జనధర్మ పత్రిక సంపాదకుడిగా పత్రిక నిర్వ హణలో ఎంఎస్ ఆచార్య స్ఫూర్తిప్రదాతగా నిలిచారని అన్నారు. ఎంఎస్ ఆచార్య వారసత్వాన్ని పుణికిపుచ్చుకొని ఆయన కుమారుడు మాడభూషి శ్రీధర్ అనేక రంగాల్లో ప్రావీణ్యత సాధించారని అనా న్నరు. ప్రజా సమస్యలను ఎలుగెత్తి చాటుతూ నిష్పాక్షికమైన వార్తలను ప్రజలకు జనధర్మ పత్రిక ద్వారా ఎంఎస్ ఆచార్య అందించారని మంత్రి గుర్తు చేసుకున్నారు.

# ప్రభుత్వ ఉద్యోగ వ్యవస్థ ప్రక్షాళన

### పనితీరును మెరుగుపర్చేందుకు చర్యలు

**హైదరాబాద్, మార్చి 7, ప్రభాతవార్త:** ప్రభుత్వ పలు శాఖల్లో మార్పులు చేయాలని ప్రభుత్వం భావించింది. కొన్ని శాఖల్లో అవసరానికి మించి ఉద్యోగులు ఉండడం, మరికొన్ని శాఖల్లో సిబ్బంది కొరత వల్ల పాలనలో సమతుల్యత లోపించినట్లు గుర్తించిన రాష్ట్ర సర్కార్ సర్దుబాటు చేసి, పోస్టుల హేతుబద్ధీకరణ చేయాలని భావిస్తున్నట్లు తెలియవచ్చింది. ముఖ్యంగా కాలానుగుణంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా వివిధ శాఖల్లో ఉద్యోగుల వ్యవస్థలు, పనితీరును మార్చాలని నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి నేతృత్వంలో ఇప్పటికే ఉన్నత స్థాయి కమిటీ త్వరలో కీలక నివేదికను ఇవ్వనుంది. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఎం.రఘునందన్‌రావు, రిటైర్డ్ ఐఎఎస్ ఎన్.శివశంకర్ సభ్యులుగా కలిగిన ఈ కమిటీ ఉద్యోగుల సంఖ్యను లెక్కించడమే కాకుండా, పలు అంశాలపై లోతైన అధ్యయనం చేస్తోంది. అయితే 33 శాఖలకు కమిటీ లేఖలు రాయగా, ఇందులో 14 శాఖలు కమిటీ కోరిన ఉద్యోగుల వివరాలను పంపకపోవడంతో నివేదిక ఆలస్యమైనట్లు సమాచారం. ప్రధానంగా సాంఘిక సంక్షేమ, వ్యవసాయ, విద్య, వైద్య ఆరోగ్య, పురపాలక, నీటి పారుదల తదితర శాఖలు కమిటీకి వివరాలు అందించకపోవడంతో నివేదిక రూపొందించడంలో జాప్యం జరుగుతున్నట్లు సమాచారం.



# మహిళాభ్యుదయం జాతికి శుభోదయం

### మహిళా ఉద్యోగుల విధినిర్వహణ

### అభినందనీయం: టిజిఎస్ఆర్టీసీ ఎండి నాగిరెడ్డి

**హైదరాబాద్, మార్చి 7 ప్రభాతవార్త:** మహిళాభ్యుదయం జాతికి శుభోద యమని, మహిళా ఉద్యోగుల విధి నిర్వహణ అభినందనీయమని కొనియాడారు టీజీఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ అండ్ ఎండి వై.నాగిరెడ్డి. ఇంటా బయటా అనేక ఒత్తిళ్ళు ఎదుర్కొన్నా మహిళా సిబ్బంది విధి నిర్వహణను బాధ్యతాయుతంగా చేస్తున్నారని కితాబునిచ్చారు. మార్చి 8 మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బస్ భవన్‌లో శనివారం జరిగిన వేడుకల్లో ఎండీ పాల్గొన్నారు. ఈసందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ .. ఈతరం మహిళా లోకం ఇంటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో ఉన్నత శిఖరాలను చేరుకుని, పురుషులకు తామేమి తీసిపోమని చాటి చెబుతుండటం హర్షించదగ్గ పరిణామమన్నారు. అవకాశాలు కల్పించడంలో ఆడా, మగ తేడా చూపకూడదని... స్త్రీ లేకపోతే ఈ సృష్టే లేదన్నారు. మహిళలకు మానసిక స్థైర్యం ఎక్కువన్నారు. ఆర్‌టీసీ సంస్థ మనదని, ఆర్టీసీ సంక్షేమం కోసం ఏం చేయడానికైనా సిద్ధమేనని ఎండీ నాగిరెడ్డి స్పష్టం చేశారు. మహిళా దినోత్సవం సందర్భంగా సంస్థ ఫైనాన్స్ అడ్వైజర్ విజయపుష్ప కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఈడీలు పి.వి.మునిశేఖర్, సి.హెచ్.వెంకన్న, సి.పి.ఎం ఉషాదేవి, సి.టి.ఎం శ్రీదేవి, సీఈ (ఐటీ) వి.శ్రీదేవి, మహిళా అధికారులు, మహిళా సిబ్బంది మహిళా దినోత్సవంలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్కూల్ విద్యార్థులకు ఉదయం పాలు

### మూడు రోజులు రాగి జావతోపాటు అల్పాహారం

### కెజిబివి, జనరల్ రెసిడెన్షియల్ ఇంటర్ విద్యార్థులకు కూడా

### అదనపుబడ్జెట్ కోసం ప్రభుత్వానికి పాఠశాల విద్యా శాఖ ప్రతిపాదనలు

### 19 లక్షల మందికి అందించనున్న రాష్ట్ర సర్కార్

**హైదరాబాద్, మార్చి 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలతోపాటు మోడల్ స్కూల్స్, కేజీబీవీల్లో చదివే విద్యార్థులకు రానున్న 2026-27 విద్యా సంవత్సరం నుంచి ఉదయం పూట పాలను అందించనున్నారు. వారితో పాటు కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లోని, జనరల్ రెసిడెన్షియల్ ఇంటర్ విద్యార్థులకు కూడా పాలను అందించనున్నారు. మూడు రోజులపాటు ఉదయం పూట 150 మిల్లీలీటర్ల పాలను అందించడంతోపాటు మరో మూడు రోజులు రాగిజావను అందించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన అదనపు నిధుల కోసం పాఠశాల విద్యా శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలను సమర్పించింది. 1వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులతోపాటు ఇంటర్మీడియట్ విద్యార్థులకు కలిపి సుమారు 19 లక్షల మంది విద్యార్థులకు వీటిని అందించనున్నారు.

పాఠశాల విద్యా శాఖ తమ సంస్థలలో చదువుతున్న విద్యార్థులకు పాలు అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొద్దిరోజుల క్రితం విద్యాశాఖ అధికారులతో జరిగిన సమావేశంలో నిర్ణయించిన విషయం తెలిసిందే. ప్రభుత్వ నిర్ణయం మేరకు ఒక విద్యార్థికి వారానికి మూడుసార్లు 150 మి.లీ. పాలు అందించ బడతాయి. మిగిలిన మూడు రోజుల్లో రాగి జావను అందిస్తారు.

పాల కంటే ఎక్కువ కాలం నిల్వ ఉండే టెట్రా మిల్క్ ప్యాకెట్లను కొనుగోలు చేసి విద్యార్థులకు అందించాలని అధికారులు భావిస్తున్నట్టు తెలిసింది. ప్రస్తుతం రాగి జావ వారానికి మూడుసార్లు అందించబడుతోంది. ప్రభుత్వ, స్థానిక సంస్థలు, మోడల్ స్కూల్స్, కేజీబీవీలు, టిజిఆర్‌ఈఐఎస్ సంస్థల్లో చదువుతున్న ఒకటి నుంచి 10వ తరగతి విద్యార్థులకు పాలు అందించడానికి విజయ టెట్రా మిల్క్ ప్యాకెట్లను సేకరించడానికి ప్రతిపాదనలను పాఠశాల విద్య శాఖ సిద్ధం చేసినట్టు తెలిసింది. పాలల్లో బూస్ట్, హార్లిక్స్ వంటి వాటిని కలపాలా, లేదంటే చక్కెరతో అందించాలా అనేది ఇంకా నిర్ణయం కానట్టు తెలుస్తోంది. ప్రభుత్వ నిర్ణయం మేరకు రానున్న 2026-27 విద్యా సంవత్సరం నుండి ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాల విద్యార్థులకు పాలతో పాటు అల్పాహారం అందించాలని నిర్ణయించిన నేపథ్యంలో అల్పాహారాన్ని అందించడానికి సెంట్రలైజ్డ్‌గా బ్రేక్‌ఫాస్ట్‌ను ఒక దగ్గర వండించి దగ్గరలో ఉన్న పాఠశాలలకు సరఫరా చేసేలా ప్రతిపాదనలను పాఠశాల విద్య శాఖ సిద్ధం చేసింది. పాఠశాలలు ప్రారంభమయ్యే జూన్ 1 నాటికి వాటిని ఫైనల్ చేసి.. విద్యా ర్థులకు ఎలా అల్పాహారం అందించాలనే అంశంపై అధికారులు కసరత్తు చేస్తున్నారు.

# వచ్చే యేడాది నుండి వ్యవసాయ యాంత్రీకరణ సబ్సిడీ నిధులు

### రైతుల ఖాతాలోకి బదలీ చేసేలా విధివిధానాలు తయారుచేయాలి

### అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 7:** వచ్చే ఆర్థిక సంవత్సరం నుండి వ్యవసాయ యాంత్రీకరణకు సంబంధించిన సబ్సిడీ నిధులను నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేసే విధానాన్ని అమలు చేసే అవకాశాలను పరిశీలించి, అవసరమైన విధివిధానాలను రూపొందించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. శనివారం వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రానున్న ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రస్తుతం వ్యవసాయ యాంత్రికరణలో భాగంగా రైతులు కొనుగోళ్లు చేసిన పనిముట్లకు 40 శాతం సబ్సిడీ నిధులను సదరు కంపెనీలకు అందించే పద్దతి ఉంది అలా కాక,వచ్చే ఆర్థిక సంవత్సరం నుండి సబ్సిడీ నిధులను నేరుగా రైతుల ఖాతాలోకి బదిలీ చేసే అవకాశాలను పరిశీలించి అందుకు తగ్గ విధివిదానాలను తయారు చేయాలన్నారు. రాష్ట్రంలో రైతులకు సబ్సిడీపై అందించే పచ్చిరొట్ట విత్తనాలను వచ్చే ఏప్రిల్ నెలాఖరు సిద్దంగా ఉంచుకోవాలని అందుకు తగ్గ ఏర్పాట్లు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతు వేదికలలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందించాలని, ఇందుకు రెడ్కో సంస్థ సహకారం తీసుకోవాలని అధికారులకు సూచిం చారు. మొదట ప్రయోగాత్మకంగా జంగారెడ్డిపల్లి, జనంపేట రైతు వేదికలలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి వాటి పనితీరును పరిశీలించిన తరువాత మొదటి దశలో రాష్ట్రంలోని 1600 రైతు వేదికలలో రెడ్కో ద్వారా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. రానున్న ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రానికి అవసరమైన ఎరువులను ముందుగానే తెప్పించి నిల్వ ఉంచేందుకు ఇప్పటి నుంచే చర్యలు ప్రారంభించాలని మంత్రి అధికారులకు సూచించారు. ఎరువుల సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తిన కూడ ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్రానికి అవసరమైన ఎరువులను ముందుగానే సమకూర్చుకోవాలని తెలిపారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వ అధికారులతో నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలని సూచించారు. ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలో వరి, పత్తి, మక్క వంటి ప్రధాన పంటల సాగు విస్తృతంగా జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా మక్క పంటకు వరి లేదా పత్తి పంటలతో పోలిస్తే యూరియా అవసరం దాదాపు మూడింతలు ఎక్కువగా ఉంటుందని చెప్పారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఖరీఫ్-2026 సీజన్‌కు రాష్ట్రానికి 11.50 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు మంత్రి తెలిపారు.



# విద్యుత్ బాధిత రైతు కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 7:** విద్యుత్ ఘాతంతో మరణించిన ఇద్దరు రైతుల కుటుంబాలకు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్సీ) చైర్మన్ జస్టిస్ డి.నాగార్జున ప్రత్యేక చొరవతో తక్షణ ఉపశమనం లభించింది. వికారాబాద్ జిల్లా కేరెల్లికి చెందిన చంద్రారెడ్డి,సిద్దిపేట జిల్లా విశ్వనాథపల్లికి చెందిన నలిగామ కనకయ్య విద్యుత్ ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోగా,వారికి రావాల్సిన ఎక్స్‌గ్రేషియా అందడంలో జాప్యం జరుగుతోందని కుటుంబ సభ్యులు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన తక్షణమే స్పందిందచి అధికారులను ఆదేశించడంతో కేవలం గంటల వ్యవధిలోనే ఒక్కో కుటుంబానికి రూ.5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా మంజూరు అయింది. అనంతరం పరిహారం మంజూరు పత్రాలను శనివారం ఈఆర్ఎస్ చైర్మన్ బాధిత కుటుంబాలకు అందజేశారు.

# ఎప్‌సెట్‌కు 1.12 లక్షల దరఖాస్తులు

### ఇంజినీరింగ్‌కు 75,089..

### అగ్రికల్చర్, ఫార్మసీకి 37,372

### ఎప్‌సెట్ కన్వీనర్ విజయ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు నిర్వహించే ఈఏపి(ఎప్) సెట్-2026కి సంబంధించి ఇప్పటి వరకు 1,12,587 దరఖా స్తులు వచ్చాయి. ఫిబ్రవరి 19 నుంచి ఆన్‌లైన్‌లో ఎప్ సెట్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైన విషయం తెలిసిందే. శనివారం సాయంత్రం వరకు మొత్తం 1,12,587 దరఖాస్తులు వచ్చినట్టు ఎప్ సెట్-2026 కన్వీనర్ ప్రొఫెసర్ డాక్టర్ కె విజయ్‌కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంజనీరింగ్‌కి 75,089 దరఖాస్తులు రాగా, అగ్రికల్చర్, ఫార్మసీకి 37372 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. రెండింటికి కలిపి 126 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఫిబ్రవరి 14న నోటిఫికేషన్ జారీ చేయగా.. ఫిబ్రవరి 19 నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించడం ప్రారంభించారు. ఏప్రిల్ 4 వరకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా దరఖాస్తులను స్వీకరించనున్నారు. అపరాధ రుసుం రూ. 10వేలతో పరీక్షకు రెండు రోజుల ముందు వరకు అనగా.. మే 2 వరకు దరఖాస్తులను స్వీకరిం చనున్నారు. పరీక్ష ఫీజు ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ అభ్యర్థులకు రూ. 500 కాగా.. ఇతరులకు రూ. 900గా నిర్ణయించారు. రెండు పరీక్షలకు హాజ రయ్యే ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ అభ్యర్థులకు రూ. 1000 కాగా, ఇతరులకు రూ. 1800గా నిర్ణయించారు. ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఏప్రిల్ 4 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. రూ. 250 అపరాధ రుసుంతో ఏప్రిల్ 10 వరకు, రూ. 500తో ఏప్రిల్ 15 వరకు, రూ. 2500తో ఏప్రిల్ 20 వరకు, రూ. 5000 అపరాధ రుసుంతో ఏప్రిల్ 24 వరకు స్వీకరించనుండగా.. అపరాధ రుసుం రూ. 10వేలతో మే 2 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. అగ్రికల్చర్ పరీక్షలను మే 4, 5 తేదిల్లో నిర్వహించనుండగా.. మే 9 నుంచి 11 వరకు ఇంజనీరింగ్ పరీక్షలను నిర్వ హించనున్నారు.

# పెంచిన ఇంజినీరింగ్ ఫీజులపై భగ్గుమంటున్న విద్యార్థి సంఘాలు

### తగ్గించకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరిక

**హైదరాబాద్, మార్చి 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో ట్యూషన్ ఫీజులను పెంచుతూ ప్రభుత్వం జిఓఎంఎస్ నంబర్ 6ను జారీ చేయగా.. పెంచిన ఫీజులపై విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. పెంచిన ఫీజులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సంఘాలు డిమాండ్ చేశాయి. ఫీజులను తగ్గిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోతే ఉద్య మం తప్పదని విద్యార్థి సంఘాల నేతలు హెచ్చరించారు. రాష్ట్రంలోని ప్రైవేట్ ఇంజినీరింగ్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్ కళాశాలల్లో ఫీజులను భారీగా పెంచేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ తెలిపింది. ఇంజినీరింగ్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్ కళాశాలల్లో ఫీజులను లక్షల రూపాయల వరకు పెంచడం విద్యను సామాన్య విద్యార్థులకు దూరం చేసే చర్య అని సంఘం రాష్ట్ర అధ్యక్షులు రజనీకాంత్, రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు మండిపడ్డారు.

సీఎస్ఈ కోర్సుకు అత్యధికంగా రూ.1.83 లక్షల వరకు ఫీజు నిర్ణయించడం, కొన్ని కళాశాలల్లో గతంతో పోలిస్తే రూ.45 వేల వరకు పెంచడం విద్యార్థులపై భారీ ఆర్థిక భారం మోపే నిర్ణయమన్నారు. ఉన్నత విద్యారంగంలో ఇంజనీరింగ్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్ కోర్సుల ఫీజులను పెంచేందుకు ప్రభుత్వం నిర్ణయం చేయడం సరికాదని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఎఐఎస్ఎఫ్) తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ విమర్శించింది. ఫీజులు పెంచడంపై ఉన్న శ్రద్ధ ప్రైవేట్ కళాశాలల్లో నాణ్యత ప్రమాణాలు అమలుపై లేదని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్ విమర్శించారు. ప్రైవేట్ ఇంజి నీరింగ్, ఫార్మా కళాశాలలలో ఫీజుల పెంపును ప్రభుత్వం ఉపసం హరించుకోవాలని అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ప్రైవేట్ కళాశాలలతో రేవంత్ రెడ్డి లోపాయికారీ ఒప్పందం చేసుకున్నారని సంఘం రాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు విమర్శించారు.

రాష్ట్ర వ్యాప్తంగా 33 ఇంజినీరింగ్ కళాశాలల్లో లక్షకు పైగా ఫీజులు పెంచడం అంటే పేద విద్యార్థులను ఇంజనీరింగ్ విద్యకు దూరం చేయడమేనన్నారు. పెంచిన ఫీజులను వెంటనే ఉపసంహరించుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి.

# ప్రపంచస్థాయి ఎఐ ఆర్థిక ఆవిష్కరణల కేంద్రంగా హైదరాబాద్

### మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, మార్చి 7, ప్రభాతవార్త:** కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత ఆర్థిక సాంకేతిక రంగంలో హైదరాబాద్ గ్లోబల్ హబ్‌గా ఎదుగుతుందని ఐటి, పరిశ్రమలు, వాణిజ్య శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. శనివారం బాచుపల్లిలోని విజ్ఞానజ్యోతి ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్‌లో ఫిక్కి నిర్వహించిన సిఎఫ్ఓల సదస్సులో మంత్రి కీలకోపన్యాసం చేసారు. ప్రపంచంలోని ప్రముఖ ఆర్థిక సంస్థలు నగరంలో తమ ఆవిష్కరణలు, ఇంజినీరింగ్ కేంద్రాలను స్థాపిస్తున్నాయని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కృత్రిమ మేధ టెక్నాలజీ పాత్రను పూర్తిగా మార్చేసునందని, ఇప్పటివరకు కంపెనీ ఖర్చులను లెక్కించడానికి ఉపయోగపడిన టెక్నాలజీ, ప్రస్తుతం ఆవిష్కరణలు, మెరుగైన ఆర్థిక నిర్ణయాలకు సహాయపడుతుందన్నారు. హైదరాబాద్ ప్రపంచంలోనే అత్యంత బలమైన ఫైనాన్షియల్ టెక్నాలజీ ఎకోసిస్టమ్‌లలో ఒకటిగా అభివృద్ధి చెందిందన్నారు. వ్యాన్ గార్డ్, యుబిఎస్, వెల్స్ ఫార్గో, బ్యాంక్ ఆఫ్ అమెరికా, మాస్ మ్యూచువల్, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్, జెపి మోర్గాన్ చేస్, గోల్డ్ మ్యాన్ శాక్స్, సిటి గ్రూప్ లాంటి ప్రఖ్యాత ఆర్థిక సంస్థలు నగరంలో భారీ టెక్నాలజీ, అనలిటిక్స్ కేంద్రాలను నిర్వహిస్తున్నాయి. నగరంలో ప్రస్తుతం 400 గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు మూడు లక్షల మందికి పైగా వృత్తి నిపుణులకు ఉపాధి కల్పిస్తున్నాయి. తెలంగాణ ఐటి రంగం ఎగుమతులు సంవత్సరానికి దాదాపుగా 40 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. తదుపరి దశ విస్తరణ కోసం ఏఐ సిటి, ఫ్యూచర్ సిటి, ఏఐకేపిఎంలను ఏర్పాటు చేస్తున్నాం. వీటి ద్వారా ఏఐ ఎకోసిస్టమ్‌ను మరింత బలోపేతం చేయడం, డిజిటల్ మౌలిక వసతులను మెరుగుపర్చడం, ఏఐ ఆధారిత ఆర్థిక వ్యవస్థకు అవసరమైన నిపుణులను తయారు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. డిజిటల్ యుగంలో సిఎఫ్ఓల పాత్ర మరింత కీలకంగా మారిందని అన్నారు. కృత్రిమ మేధ, డేటా ఆధారిత రంగాల్లో పెట్టుబడులకు మార్గనిర్దేశం చేయడంలో వారి సేవలు మరింత ప్రాధాన్యతను సంతరించుకున్నాయని శ్రీధర్ బాబు వివరించారు. ఈ సదస్సులో మాజీ చీఫ్ విజిలెన్స్ కమిషనర్ కె.వి.చౌదరి, ప్రముఖ నిర్మాత, విజ్ఞానజ్యోతి ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మేనేజ మెంట్ అధ్యక్షుడు దగ్గుబాటి సురేశ్ బాబు, ఫిక్కి సిఎఫ్ ఓ కౌన్సిల్ ఛైర్మన్ రజనీష్ జైన్, కో ఛైర్మన్ సుబ్బయ్య కుమార్, విజ్ఞాన జ్యోతి సంస్థల సిఇఓ, మాజీ డిజిపి అనురాధ తదితరులు పాల్గొన్నారు.




బహుమతులు ప్రదానం చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

## వైద్య వృత్తిలో సేవా గుణం అత్యవసరం

### డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

**అల్వాల్, మార్చి 7 ప్రభాతవార్త:** నిత్య విద్యార్థిగా సేవా గుణంతో రోగులకు సేవ చేయడం ద్వారా వైద్యులుగా విజయవంతం అవుతారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సికింద్రబాద్‌లోని ఆర్మీ డెంటల్ కళాశాల సిల్వర్ జూబ్లీ ఉత్సవాలుతో పాటుగా బిడిఎస్, ఎండిఎస్ శిక్షణ పూర్తి చేసిన వైద్య విద్యార్థుల స్నాతకోత్సవంలో భాగంగా సర్టిఫికెట్‌లు, బహుమతులు డిప్యూటీ సీఎం బహుకరించారు. కరుణ, దయ అనే సుగుణాలుతో వైద్య వృత్తికి అవసరం అన్నారు. వైద్య రంగంలో సాంకేతికమైన అభివృద్ధి నిత్యం సాగుతూనే ఉంటుందని తెలిపారు. రోగుల అవసరాలు మారిపోతూ ఉంటాయని, భవిష్యత్తును ముందుగానే గ్రహించి ఆ దిశగా వైద్య పరిజ్ఞాన్ని ఆధునీకరించు కోవాలన్నారు. రోగుల నమ్మకమే ఆరోగ్య సేవలకు పునాది అని వారిలో ఆత్మవిశ్వాసం నింపి జీవించాలనే ఆకాంక్షను పెంపొందించే గొప్ప అవకాశం వైద్యలకు మాత్రమే దక్కుతుందన్నారు. రెండున్నర దశాబ్దాలుగా ఉన్నతమైన డెంటల్ వైద్యులను అందించిన ఆర్మీ డెంటల్ కళాశాలు సేవలు అనిర్వచనీయమని తెలిపారు. కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతున్న విషయాన్ని గుర్తుచేశారు. 38 మంది బ్యాచిలర్ ఆఫ్ డెంటల్ సర్జరీ(బిడిఎస్), 18 మంది మాస్టర్ ఆఫ్ డెంటల్ సర్జరీ(ఎండిఎస్) విద్యార్థులు పట్టాలు అందుకున్నారు. బిడిఎస్ కోర్సులో ఉత్తమురాలిగా నిలిచిన దీక్షిత రెడ్డికి ప్రతిష్టాత్మకమైన షహీద్ నాయక్ జదునాథ్ సింగ్ పరమ్ వీర్ చక్ర అవార్డును ప్రధానం చేశారు.

## అణగారిన వర్గాల గొంతుక ఆర్.కృష్ణయ్య

### నటుడు రాజేంద్రప్రసాద్

**హైదరాబాద్, మార్చి 7 ప్రభాతవార్త:** సామాజిక పోరాటాలకు, అణగారిన వర్గాల సమన్యాయ సాధనకు రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఒక చెరగని చిరునామా అని ప్రముఖ సినీనటుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత రాజేంద్రప్రసాద్ కొనియాడారు. శనివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో కృష్ణయ్యను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. రాజేంద్రప్రసాద్ పోరాటమే ఆయన ఊపిరిగా తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడైనా అణగారిన కులాల కోసం గొంతెత్తి, ప్రభుత్వం మెడలు వంచి పనులు సాధించే నాయకుడు ఎవరంటే నిస్సందేహంగా వినిపించే మొదటి పేరు ఆర్.కృష్ణయ్య అని అన్నారు. బీసీ హాస్టళ్లలో విద్యార్థుల సమస్యల నుంచి రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటు వరకు ఆయన చేసిన పోరాటాలు అద్వితీయం. గతంలో ఎస్సీ గురుకులాల విషయంలో తలెత్తిన న్యాయపరమైన చిక్కులను తన వాదన పటిమతో అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు కు వివరించి, ఒప్పించి ప్రత్యేక రెసిడెన్షియల్ స్కీమ్ వచ్చేలా చేసిన ఘనత ఆయనదే అని అన్నారు. కృష్ణయ్య అంకితభావాన్ని చూసి ఎన్టీఆర్ సైతం ఆయన్ని ఎంతో గౌరవించేవారన్నారు. బీసీ భవనం ఒక ప్రజా దేవాలయంగా, కృష్ణయ్య కేవలం ఒక కులానికి పరిమితమైన వ్యక్తి కాదు.. ఆయన అందరివాడు. ఆయన నివాసం (బీసీ భవనం) ఎప్పుడూ ఒక ప్రజా కేంద్రంలా కనిపిస్తుందన్నారు. ఏ మంత్రి లేదా ఉన్నతాధికారి ఇంటి వద్ద లేనంత మంది జనం ప్రతిరోజూ ఇక్కడ కనిపిస్తారు. సమస్యతో వచ్చిన వారు ఎవరూ నిరాశతో వెనుతిరగరని, కృష్ణన్నకు చెబితే పని అవుతుందనే నమ్మకమే దీనికి కారణం. ముఖ్యంగా బీసీ విద్యార్థులు ఆయనను దైవంగా భావిస్తారన్నారు.

# మహిళలకు తెలంగాణ సురక్షితం

- సోషల్ మీడియా వల్ల మహిళలపై వేధింపులు పెరిగాయి
- 1000 బస్సులకు మహిళలను యజమానులను చేశాం
- మహిళల పేరు మీద రేషన్ కార్డులు, ఇండ్లు ఇస్తున్నాం
- 'స్టాండ్ విత్ హర్' కార్యక్రమంలో సిఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, మార్చి7 ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి :** మహిళ నాయకత్వం నుంచి వచ్చిన పార్టీ ద్వారా రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామని, మహిళల ప్రాధాన్యం గుర్తించి కాంగ్రెస్ పార్టీలో పదవులు ఇస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల రక్షణ కోసం అనేక కార్యక్రమాలు చేపట్టిందన్న సీఎం మనల్ని మనం సవరించుకోవాలన్నారు. మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు తీసుకొస్తున్నామని తెలిపారు. సోషల్ మీడియాలో మహిళలను వేధించే ఘటనలు తాజాగా పెరుగుతున్నాయన్న సీఎం వాటిని కట్టడి చేయాలని పిలుపునిచ్చారు. శనివారం జేఎన్టీయూ ఆడిటోరియంలో స్టాండ్ విత్ హర్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, డీజీపీ శివధర్‌రెడ్డి, సినీ నటుడు సాయిదుర్గ తేజ్, మహిళా ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకోవడంతో మన బాధ్యత తీరిపోలేదన్నారు. దేశానికి రాష్ట్రపతిగా, ప్రధాన మంత్రిగా, లోక్‌సభ స్పీకర్‌గా, ముఖ్యమంత్రులుగా మహిళలకు అవకాశం ఇచ్చిన కాంగ్రెస్‌కు తెలంగాణలో ప్రజలు అధికారం ఇచ్చారని తెలిపారు. మహిళల ప్రాధాన్యతను గుర్తించి, బాధ్యతలను అప్పగించడంలో మా ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందన్నారు. మహిళను మనం శక్తితో పోలుస్తాం అలాంటి మహిళకు రక్షణ కల్పించలేకపోతే ఏ రాష్ట్రానికి గౌరవం కాదని పేర్కొన్నారు. ఇంతకు ముందు మహిళలపై వేధింపులు కొంతవరకే పరిమితమయ్యేవి కానీ సాంకేతిక అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో సోషల్ మీడియాలోనూ మహిళలపై వేధింపులు పెరిగిపోయాయని, మహిళలపై మార్ఫింగ్, ఫేక్ వీడియోలు వంటి సైబర్ నేరాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కాలేజీలు, బస్టాండ్లు సహా ఎక్కడైనా వేధింపులను చూసి చూడనట్లుగా ఉండటం కూడా నేరాన్ని ప్రోత్సహించడమే, అందుకే మనల్ని మనం సవరించుకుని బాధ్యతతో మెలగాల్సిన సమయం వచ్చిందన్నారు. సమాజంలో చట్టాలను చేయడం, పోలీసులు పర్యవేక్షించడమే కాదు. మనమంతా సామాజిక బాధ్యతగా భావిస్తేనే మహిళల రక్షణ సాధ్యమవుతుందన్నారు. మన ఇంటి ఆడబిడ్డలకు ఎలాంటి గౌరవం ఇస్తామో సమాజంలో ఆడబిడ్డలను అలాగే గౌరవించాలన్నారు. జిల్లాల్లో మహిళా కలెక్టర్లు, ప్రభుత్వంలో ముఖ్య పదవుల్లో మహిళలకు ప్రధాన పాత్రను కల్పించామని, తెలంగాణను మహిళలకు అత్యంత సురక్షిత రాష్ట్రంగా తీర్చిద్దామమని అన్నారు. మహిళలు చదువుకొని, ఉద్యోగాలు చేసి ఆర్థికంగా ఎదగాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని వివరించారు. రాష్ట్రంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు మహిళల పేరుతోనే అందిస్తున్నాం రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు మహిళల పేరుతో అందిస్తున్నాం అని చెప్పారు. స్వయం సహాయక సంఘాలకు రుణాలు అందించి వారికి శిల్పారామం వద్ద దుకాణ సముదాయాన్ని కేటాయించాం సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించి మహిళలు అదానీ, అంబానీలతో పోటీపడేలా చర్యలు చేపట్టాం అని చెప్పారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యంతో పాటు వెయ్యి బస్సులకు మహిళలను యజమానులను చేశాం పెట్రోల్ బంకులు ఏర్పాటు చేయించి మహిళలు ఆర్థికంగా ఎదిగేలా చర్యలు తీసుకున్నాం అన్నారు. మహిళా యూనివర్సిటీకి వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టి మహిళా శక్తి స్ఫూర్తిని చాటాం అని వివరించారు. మహిళా శక్తిపై రాష్ట్ర ప్రభుత్వానికి సంపూర్ణ విశ్వాసం ఉందన్నారు. దేశంలోనే తెలంగాణను మహిళలకు అంత్యంత భద్రత కలిగిన రాష్ట్రంగా తీర్చి దిద్దాలని స్టాండ్ విత్ హర్ కార్యక్రమం తీసుకున్నామన్నారు. మహిళా రక్షణకు ప్రతీ యువకుడు అంబాసిడర్‌గా నిలవాలి, మహిళలు వంటింటి కుందేళ్లుగా కాకుండా అన్ని రంగాల్లో రాణించాలన్నదే ప్రభుత్వ ఆకాంక్ష అన్నారు. మీరు, మనం అంతా సమస్య వచ్చినపుడు స్టాండ్ విత్ హర్ అని గట్టిగా నిలబడాలి అని పిలుపునిచ్చారు.

# గీత కార్మికులకు ఎక్స్ గ్రేషియా విడుదల చేయాలి

- రావాల్సిన 13 కోట్లు వెంటనే విడుదల చేయాలి
- సూర్యాపేట జిల్లాకు ధర్మ భిక్షం పేరు పెట్టాలి: బొమ్మగాని ప్రభాకర్



**హైదరాబాద్, మార్చి 7 ప్రభాతవార్త:** గీత కార్మికులకు రావాల్సిన రూ.13 కోట్ల ఎక్స్‌గ్రేషియా వెంటనే విడుదల చేయాలని, సూర్యాపేట జిల్లాకు స్వాతంత్ర్య సమరయోధులు, తెలంగాణ సాయుధపోరాట యోధులు బొమ్మగాని ధరభిక్షం పేరును పెట్టాలని తెలంగాణ గీత కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గీత కార్మికుల సంఘం రాష్ట్ర స్థాయి సమావేశం శనివారం హైదరాబాద్ హిమాయత్ మగ్దూంభవన్‌లో జరిగింది. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన కార్యక్రమం పూర్తయ్యేలోగా రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న గీత కార్మికుల బకాయిలను చెల్లించాలి. 560 జిఓ ప్రకారం వన పెంపకానికి భూములు కేటాయించాలి. కార్మికులకు భద్రత కిట్లు అందించాలి. ఈ మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకోనట్లయితే రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి గీత పనివారల సంఘం సిద్ధమవుతుందని సమావేశం తీర్మానించిందన్నారు. ప్రభాకర్ మాట్లాడుతూ గీత కార్మికుల సమస్యలపై ఇప్పటికే సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జిల్లాల కలెక్టర్లకు విజ్ఞాపన పత్రాలు అందించడంతోపాటు రాష్ట్ర సదస్సును నిర్వహించి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, కానీ నేటికీ సమస్యలు పరిష్కారం కాకపోవడం అన్యాయమన్నారు. గీత వృత్తి అనేది తెలంగాణ రాష్ట్రంలో ఒక ప్రాచీనమైన, పేద బడుగువర్గాలు, బిసిలు ఆధారపడిన వృత్తి అని, ఈ వృత్తిలో లక్షలాది కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయన్నారు. ప్రభుత్వం గీత కార్మికులపై సవతి తల్లి ప్రేమ చూపిస్తూ తీవ్ర అన్యాయం చేస్తుందని విమర్శించారు. స్వాతంత్ర్య సమారయోధుడు, మాజీ ఎంపి బొమ్మగాని ధర్మభిక్షం నేతృత్వంలో 1957లో ఏర్పడిన గీత కార్మికుల సంఘం చేసిన అనేక పోరాటల ఫలితంగా గీత వృత్తిలో మరణించిన వారికి ఎక్స్‌పెన్షన్ పథకంతోపాటు వన పెంపకం తదితర సదుపాయాలు అమలవుతున్నాయని గుర్తుచేశారు. ధర్మభిక్షం పేరును సూర్యాపేట జిల్లాకు పెట్టాలని కూనంనేని సాంబశివరావు అసెంబ్లీలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారని, దానిని మార్చి 26న జరగనున్న ఆయన 15వ వర్ధంతి సందర్భంగా ధర్మభిక్షం పేరు పెట్టడంతో పాటు ఆయన జయంతి, వర్ధంతిలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

### మహిళలు స్వావలంబన

## దిశగా పయనించాలి: కేటీఆర్

**శేరిలింగంపల్లి, మార్చి 7 ప్రభాతవార్త :** మహిళలు సామాజికంగానూ, ఆర్థికంగా, రాజకీయంగాను ఎదిగి, స్వావలంభన దిశగా పయనించాలని రాష్ట్ర మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఉద్ఘాటించారు. శేరిలింగంపల్లి నియోజక వర్గంలోని చందానగర్ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్, బీఆర్ఎస్ మహిళా నేత బొబ్బ నవతారెడ్డి ఆద్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ శేరిలింగంపల్లి ఇంచార్జి, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మహిళలు అన్నిరంగాల్లోనూ ఎదిగినపుడే సమాజం అభివృద్ధి దిశగా పయనిస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర తొలి మహిళా హోంమంత్రిగానూ, దేశంలోనే తొలి మహిళా హోం మంత్రిగా సబితా ఇంద్రారెడ్డికి బీఆర్ఎస్ హయాంలో అవకాశం ఇవ్వడం జరిగిందని, అదే విధంగా సునీతాలక్ష్మారెడ్డి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రిగాను, మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గానూ పనిచేసి మహిళాలోకానికి తమ సత్తా చాటిచెప్పారని, వారు మహిళలకు ఆదర్శనీయమన్నారు. మహిళలు ఆర్థికంగా బలపడటం చాలా అవసరమని, వారిని బలపరచటం సమాజ బాధ్యతని గుర్తుచేశారు. మహిళలు తమ స్వశక్తిమీద నిలబడితే వాళ్లకు వచ్చే గౌరవమే వేరు అన్నారు. చందానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ నవతారెడ్డి ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన మహిళలను ఒక వేదికపైకి చేర్చి సత్కరించటం ముదావహమని ఆయన ప్రసంశించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో వివిధ రంగాల్లో ప్రతిభను కనబరచిన మహిళలను ఘనంగా సత్కరించారు.

## లాలాపేటలో కల్తీ అల్లం-వెల్లుల్లి పేస్ట్

### 1,915 కిలోల స్వాధీనం.. నలుగురు అరెస్ట్

**తార్నాక, మార్చి 7 ప్రభాతవార్త :** నగర ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న కల్తీ అల్లం-వెల్లుల్లి పేస్ట్ తయారీ ముఠాను పోలీసులు బట్టబయలు చేశారు. ప్రాణాంతక రసాయనాలతో పేస్ట్ తయారు చేస్తున్న గోదాముపై సికింద్రాబాద్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు, లాలాగూడ పోలీసులు శనివారం దాడులు నిర్వహించి నలుగురిని అరెస్టు చేశారు. లాలాపేటలోని జనప్రియ అపార్ట్‌మెంట్స్ సమీపంలో ఝాన్సీ అల్లం- వెల్లుల్లి పేస్ట్ పేరుతో గోదాం నిర్వహిస్తున్న నీలా వెంకటేశ్వర్లు అనే వ్యక్తి, తన సహచరులతో కలిసి కల్తీ పేస్ట్ తయారు చేస్తున్నాడు. ఈ మిశ్రమంలో హానికరమైన ఎసిటిక్ యాసిడ్, శాంతన్‌గమ్ వంటి రసాయనాలు కలిపి, వాటిని ప్లాస్టిక్ డబ్బాల్లో రోజుల తరబడి నిల్వ ఉంచి కుళ్లబెట్టి తయారు చేస్తున్నట్లు విచారణలో తేలింది. తర్వాత వాటిపై ఆకర్షణీయమైన నకిలీ బ్రాండ్ లేబుల్స్ అతికించి నగరంలోని పలు కిరాణా దుకాణాలకు సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ మెరుపు దాడుల్లో పోలీసులు 1,915 కిలోల కల్తీ అల్లం-వెల్లుల్లి పేస్టుతోపాటు తయారీకి ఉపయోగించే యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ప్రధాన నిందితుడితోపాటు మరో ముగ్గురిని అదఅదుపులోనికి తీసుకున్నారు. ఆహార పదార్థాలపై అనుమానం వచ్చిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

### విపత్తుల సమయంలో

## యువత ముందుండాలి: గవర్నర్

**తార్నాక, మార్చి 7 ప్రభాతవార్త :** విపత్తుల సమయంలో సమాజానికి సేవ చేయడంలో యువత ముందుండాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పిలుపునిచ్చారు. హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయం ఠాగోర్ ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన యువ ఆపద మిత్ర వాలంటీర్ల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణ ప్రభుత్వ యువ ఆపద మిత్ర పథకం కింద రీజినల్ సెంటర్ ఫర్ అర్బన్ అండ్ ఎన్విరాన్మెంటల్ స్టడీస్ సంస్థ రాష్ట్ర రెవెన్యూ (విపత్తు నిర్వహణ) విభాగంతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థి వాలంటీర్లను ఉద్దేశించి గవర్నర్ మాట్లాడుతూ ఆపద మిత్ర కార్యక్రమం ద్వారా యువతను సమాజ సేవకు సిద్ధం చేయడం అభినందనీయమని తెలిపారు. సంక్షోభ సమయంలో సేవ చేసేందుకు యువత సిద్ధంగా ఉండటం దేశానికి నిజమైన బలం అని ఆయన పేర్కొన్నారు. జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) వాలంటీర్లను ఆపద మిత్రులుగా తీర్చిదిద్దడం ద్వారా గ్రామస్థాయి వరకు విపత్తులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంచుతున్నామని చెప్పారు. విశ్వవిద్యాలయ గొప్ప చరిత్రను గవర్నర్ ప్రశంసించారు. ఈ కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా కొనసాగించాలని యాజమాన్యాన్ని ప్రోత్సహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ (విపత్తు నిర్వహణ) ఎం. దాన కిషోర్ మాట్లాడుతూ విపత్తుల సమయంలో ప్రభుత్వ వ్యవస్థలు మరియు స్థానిక సమాజాల మధ్య అనుసంధానంగా విద్యార్థి వాలంటీర్లు కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## ద్రాక్ష సాగుతో లాభాలు: రాజిరెడ్డి

**అత్తాపూర్ మార్చి 7, ప్రభాతవార్త :** ఒకప్పుడు ద్రాక్ష సాగుకు చిరునామాగా ఉన్న హైదరాబాద్ ప్రాంతం ఇప్పటికీ ద్రాక్ష సాగుకు అనుకూలమని, హైదరాబాద్ పరిసర జిల్లాల్లో ద్రాక్ష సాగు విస్తీర్ణం పెంచుకుంటే రైతులకు లాభాలు ఉంటాయని శ్రీ కొండ లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సర్ డాక్టర్ డి. రాజిరెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్లోని రాజేంద్ర నగర్ ద్రాక్ష పరిశోధన స్థానంలో మొదలైన ద్రాక్ష పండుగ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఒకప్పుడు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో 15000 ఎకరాల్లో ద్రాక్ష సాగు ఉండేదని, ప్రస్తుతం 400 ఎకరాలకు పడిపోయిందని అన్నారు. రియల్ ఎస్టేట్ పెరగటం ప్రధాన కారణమైతే, పంట సాగు ఖర్చులు ప్రత్యేకించి కూలీ ఖర్చులు పెరగడంతో చాలామంది ద్రాక్ష తోటలు తీసి వేశారన్నారు. ప్రస్తుతం ఉన్న ద్రాక్ష సాగు విస్తీర్ణానికి అదనంగా మరో 100 ఎకరాలు పెంచవచ్చని స్థానికంగా ద్రాక్షకున్న డిమాండ్తో మంచి లాభాలు ఉంటాయని ఆయన అన్నారు. ద్రాక్షలో సాగు ఖర్చులు తగ్గించేందుకులో కాస్ట్ టెక్నాలజీలో వాడాలని, అలాగే ప్రెసిషన్ ఫామింగ్ ద్వారా దిగులు బాగా పెరుగుతాయి అని తెలిపారు. నీటిని, ఎరువులను అవసరం మేరకే వాడాలని, విచక్షణ రహితంగా పురుగు మందులను వాడకూడదని డాక్టర్ రాజిరెడ్డి అన్నారు. సబ్ సాయిల్ వాడకంతో తెగుళ్లు, పురుగులు తగ్గుతున్న నేపథ్యంలో వాటిపై ప్రత్యేక పరిశోధనలు రూపొందిస్తామని తెలిపారు.

## దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లు...

**తార్నాక, మార్చి 7 ప్రభాతవార్త :** ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్యరైల్వే పలు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ప్రకటించింది. అధికారులు తెలిపిన వివరాలు తిరువనంతపురం నార్త్-సంత్రాగాచి - తిరువనం తపురం నార్త్ మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నారు. రైలు నం. 06081 మార్చి 13, 20 తేదీల్లో తిరువనంతపురం నార్త్ నుండి మధ్యాహ్నం 2.15 గంటలకు బయలుదేరి రెండో రోజు 2.15 గంటలకు సంత్రాగాచి చేరుకుంటుంది. రైలు నం. 06082 మార్చి 10, 17 తేదీల్లో సంత్రాగాచి నుండి మధ్యాహ్నం 2.20 గంటలకు బయలుదేరి రెండో రోజు 2.15 గంటలకు తిరువనంతపురం నార్త్ చేరుకుంటుంది. అలాగే పోడనూర్ - బరౌని - పోడనూర్ మధ్య కూడా ప్రత్యేక రైళ్లు నడపనున్నారు. రైలు నం. 06021 మార్చి 16, 23 తేదీల్లో ఉదయం 4.30 గంటలకు బయలుదేరి రెండో రోజు మధ్యాహ్నం 2.00 గంటలకు బరౌని చేరుకుంటుంది.రైలు నం. 06022 మార్చి 19, 26 తేదీల్లో మధ్యాహ్నం 1.15 గంటలకు బయలుదేరి రెండో రోజు రాత్రి 11.30 గంటలకు పోడనూర్ చేరుకుంటుంది. ట్రైన్ నంబర్ 06571 యశ్వంత్‌పూర్ - కాటిహార్ ప్రత్యేక రైలు ప్రతి మంగళవారం నడుస్తుంది. ఈ రైలు మార్చి 10 నుంచి మార్చి 31, 2026 వరకు నాలుగు ట్రిప్పులు నిర్వహించనుంది. అదేవిధంగా ట్రైన్ నంబర్ 06572 కాటిహార్-యశ్వంత్‌పూర్ ప్రత్యేక రైలు ప్రతి శుక్రవారం నడుస్తుంది. ఈ రైలు మార్చి 13 నుంచి ఏప్రిల్ 3, 2026 వరకు నాలుగు ట్రిప్పులు నిర్వహించనుంది. దక్షిణ మధ్య రైల్వే ప్రధాన ప్రజాసంబంధాల అధికారి ఎ. శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక రైళ్లు మార్గమధ్యంలోని పలు ముఖ్య స్టేషన్లలో ఆగుతాయని రైల్వే అధికారులు తెలిపారు.



ధర్నాలో నినాదాలు చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

### ఉద్యోగ ఉపాధ్యాయులకు

## పాత పెన్షన్ విధానం అమలుచేయాలి

### వివిధ ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నేతల డిమాండ్

### 2003 ఉద్యోగ ఉపాధ్యాయ పాత పెన్షన్ పోరాట సమితి మహాధర్నా

**ధర్నాచౌక్, మార్చి 7 ప్రభాతవార్త:** 2003 నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగాలు పొందిన ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని వివిధ ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో 2003 ఉద్యోగ ఉపాధ్యాయ పాత పెన్షన్ పోరాట సమితి, తెలంగాణ రాష్ట్రం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీలు ఏ.వి.ఎన్.రెడ్డి, మల్క కొమురయ్య, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్‌లు హాజరై మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1.9.2004న సీపీఎస్ విధానం అమలులోకి వచ్చిందని, సీపీఎస్ అమలుకు ముందే నోటిఫికేషన్ విడుదలై, నియామక ప్రక్రియ పూర్తి అయిన ఉద్యోగ ఉపాధ్యాయులకు సీపీఎస్ విధానం అమలుచేయటం అన్యాయమన్నారు. 2003 ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలుచేయాలని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో నెంబర్ 57ను కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలు అమలుచేస్తున్నాయని, ఆంధ్ర ప్రదేశ్‌లో కూడా అమలు ప్రక్రియ మొదలయిందని గుర్తుచేశారు. ప్రస్తుత తెలంగాణ రాష్ట్రంలో 2003లో నోటిఫికేషన్ ద్వారా నియామకాల ప్రక్రియ పూర్తి అయినప్పటికీ, నియామకాలు ఆలస్యం కావటంతో దాదాపు 9వేల మంది ఉద్యోగ ఉపాధ్యాయులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి, కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం 22-12-2003 నాటికి నోటిఫికేషన్‌లు విడుదలై, 1-1-2004 తరువాత నియామకాలు జరిగి, సీపీఎస్ విధానంలో కొనసాగుతున్న ఉద్యోగ ఉపాధ్యాయులందరినీ, పాత పెన్షన్ పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. 2003 ఉద్యోగ ఉపాధ్యాయ పాత పెన్షన్ పోరాట సమితి చేస్తున్న న్యాయమైన పోరాటానికి తమ మద్దతు ఉంటుందని, వారి సమస్య పరిష్కారం అయ్యేవరకు వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ ధర్నా కార్యక్రమంలో 2003 ఉద్యోగ ఉపాధ్యాయ పాత పెన్షన్ పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఇమ్మడి సంతోష్‌కుమార్, కోశాధికారి వేణుగోపాల్, ఎస్‌జీటివీ నేత కరివేద మహిపాల్ రెడ్డి, తెలంగాణ పీఆర్‌టియూ నేత గాలి హర్షవర్ధన్‌రెడ్డి, డిటీఎఫ్ నేత సోమయ్య, టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్షులు చావ రవి, టీఆర్‌టిఎఫ్ కటకం రమేష్, టీపీయూఎస్ నేత వి.రాజశేఖర్, పీఆర్‌టివి నేత పి.దామోదర్‌రెడ్డి మరియు తెలంగాణ వ్యాప్తంగా తరలి వచ్చిన ఉద్యోగ ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

### మూసీ సుందరీకరణ పేరుతో

## ఇండ్లు కూలిస్తే తిరుగుబాటు తప్పదు: శ్రీనివాస్ గౌడ్




సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్, దాసోజు శ్రావణ్, శ్రీనివాస్ యాదవ్, వినోద్ కుమార్ తదితరులు

**హైదరాబాద్, మార్చి 7,ప్రభాతవార్త:** మూసీ సుందరీకరణ పేరిట పేదల ఇళ్లు కూల్చివేస్తే ప్రజలు తిరుగుబడతారని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ బస్తీల జాయింట్ యాక్షన్ కమిటీ (టిబిజెఎసి) చైర్మన్ గోసుల శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. దీనికి ముఖ్యఅతిథులుగా మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్,ఎంఎల్‌సి దాసోజు శ్రవణ్, ఎస్సి కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, తెలంగాణ రాజకీయ కూటమి అధ్యక్షులు ప్రొ.గాలి వినోద్‌కుమార్, ఆప్ నాయకురాలు హేమతోపాటు వివిధ పార్టీల నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ పేదలపై ప్రభుత్వం కక్ష కట్టిందని బుల్డోజర్ ప్రభుత్వ పాలన నడుస్తుందన్నారు. హైదరాబాద్‌లో ఎక్కడ స్థలం లేనంటూ పేదల ఇళ్లు కూల్చి గాంధీ విగ్రహం పెట్టాలనే ఆలోచన దారుణమన్నారు. మూసీ బాధిత పేదలకు న్యాయం జరిగేవరకు తాము పోరాడుతామని తెలిపారు.ఎంఎలిసి దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ ఇందిరాగాంధీ తెచ్చిన భూసేకరణ చట్టంపై సిఎం రేవంత్‌రెడ్డి గౌరవం లేకుండా పోయిందని మూసీ నదిని అదానీకి ఇచ్చేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. గోసుల శ్రీనివాస్ మాట్లాడుతూ మూసీని సుందరీకరించే ముందు మూసీలోకి వస్తున్న పరిశ్రమల కాలుష్యాన్ని పూర్తిగా అరికట్టాలని కోరారు.సుందరీకరణలో బస్తీ ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నారు. మూసీ సరిహద్దును నిర్ణయించి మార్కింగ్ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో హెన్‌ఆర్‌ఎఫ్ ప్రెసిడెంట్ జీవన్ కుమార్, మూసీ ఆందోళన్ సంఘటన్ నేత విజయ పలు బస్తీ ప్రజలు పాల్గొన్నారు.

## ఏఐఎఫ్‌బి తెలంగాణ ప్రధాన కార్యదర్శిగా దయానంద




అల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన కొండ దయానంద్‌ను అభినందిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు ఎం.జావేద్ లతీఫ్

**హైదరాబాద్, మార్చి 7 ప్రభాతవార్త:** అల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బి) తెలంగాణ రాష్ట్ర నూతన ప్రధాన కార్యదర్శిగా కొండ దయానంద్ ఎన్నికయ్యారు. ఆయన నియామకాన్ని రాష్ట్ర కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకుందని ఏఐఎఫ్‌బి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.జావేద్ లతీఫ్ ప్రకటించారు.శనివారం నగరంలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో అల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కమిటీ విస్తృతస్థాయి సమావేశం ఎం.జావేద్ లతీఫ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎం.జావేద్ లతీఫ్ మాట్లాడుతూ ఏఐఎఫ్‌బి రాజ్యాంగంలోలేని కన్వీనర్ పోస్టును రాష్ట్ర కమిటీ అనుమతి లేకుండా జాతీయ ప్రధాన కార్యదర్శి జె. దేవరాజన్ ఇటీవలే ప్రకటించారని, పార్టీ రాజ్యాంగంలో లేని ఈ కన్వీనర్ పోస్టును రాష్ట్ర కమిటీ ఏకగ్రీవంగా తీర్మానం చేసి రద్దు చేయడం జరిగిందన్నారు. మెజారిటీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఏఐఎఫ్‌బి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొండా దయానంద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని, గత రాష్ట్ర మహాసభల్లో ఎన్నికైన రాష్ట్ర కమిటీ యాదవిధిగా కొనసాగుతుందని ప్రకటించారు.ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కట్టంగూరి బుచ్చిరెడ్డి, ఆర్థిక శాఖ కార్యదర్శి కె.నరేందర్, రాష్ట్ర కార్యదర్శి కృష్ణమూర్తి, నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కమిటీ సభ్యులు పరంగి రాము, సాగి అజిత్ కుమార్ రావు, కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కమిటీ సభ్యులు బండారి శేఖర్, రాష్ట్ర కమిటీ సభ్యులు సాగి అజిత్ కుమార్ రావులు పాల్గొన్నారు.

# కప్ కోసం తుది యుద్ధం

## అహ్మదాబాద్‌లో ఫైనల్ ఫీవర్ • కివీస్‌తో భారత్ అమీతుమీ

*సూర్యసేన చరిత్రకు అడుగుదూరంలో ఉంది. వరుసగా రెండు సార్లు టీ20 ప్రపంచకప్ గెలిచిన తొలి జట్టుగా అవతరించాలని పట్టుదలగా ఉంది. ముచ్చటగా మూడోసారి పొట్టి ప్రపంచకప్ అందుకోవడానికి ఉవ్విళ్లూరుతున్న టీమిండియా... జింబాబ్వే, వెస్టిండీస్, ఇంగ్లాండ్‌ల తరహాలో కివీస్‌పై తుడి దాడికి సిద్ధమైంది. మరోవైపు సౌతాఫ్రికాను చిత్తుచేసి ఫైనల్ చేరిన న్యూజిలాండ్.. తొలిసారి ఛాంపియన్‌గా అవతరించాలన్నది లక్ష్యం. అహ్మదాబాద్‌లో జరిగే ఫైనల్ ఫీవర్‌కు అంతా సిద్ధమైంది.*








**అహ్మదాబాద్:** సొంతగడ్డపై టీ20 వరల్డ్‌కప్ ఆడుతున్న టీమిండియా లీగ్ దశలో అజేయంగా నిలిచింది. సూపర్8లో తొలుత తడబడినా..తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో జింబాబ్వే,విండీస్‌లను ఓడించి సెమీస్ చేరింది.ఇక సెమీస్‌లో ఇంగ్లండ్‌తో ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లోనూ 7 రన్స్ తేడాతో గెలిచి.. టైటిల్ పోరుకు అర్హత సాధించింది. వరుసగా రెండుసార్లు ప్రపంచకప్ టోర్నీ ఫైనల్‌కు చేరిన జట్టుగా నిలిచింది. ట్రోఫీ కోసం న్యూజిలాండ్‌తో నేడు అహ్మదాబాద్ వేదికగా అమీతుమీ తేల్చుకోనుంది.

2007, 2024లో ఛాంపియన్‌గా నిలిచిన టీమిండియా.. సొంతగడ్డపై మూడోసారి, వరుసగా రెండోసారి కప్ అందుకోవాలని ఉవ్విళ్లూరుతోంది. న్యూజిలాండ్‌పై ఇటీవలే టీ20 సిరీస్‌ను 4-1తో నెగ్గిన రికార్డు ఉన్న టీమిండియాకు.. సొంతగడ్డపై ఆడుతుండడం కలిసివచ్చే అవకాశం. అదే స్థాయిలో ఒత్తిడి కూడా ఉంటుంది. బ్యాటింగ్ పరంగా అంతా సూపర్ ఫామ్‌లో ఉన్నారు. ఎటొచ్చి అభిషేక్ శర్మ అంశమే ఆందోళనగా ఉంది. సంజూ సాంమ్సన్, ఇషాన్ కిషన్,సూర్యకుమార్, తిలక్‌వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే.. ఇలా ప్రతిఒక్కరూ ప్రత్యర్థి బౌలర్లపై దాడి చేస్తుండడంతో అభిషేక్‌ను కొనసాగించడానికే టీమ్ మేనేజ్‌మెంట్ మొగ్గు చూపుతోంది. అభిషేక్ గాడిలోపడితే భారత్‌కు తిరుగుండదు. లెఫ్ట్, రైట్ కాంబినేషన్ సక్సెస్ అవుతుండడంతో ఇదే ఫార్ములా ఫైనల్లోనూ ప్లాన్ చేయనుంది.

ఇంగ్లాండ్‌పై దారాళంగా పరుగులివ్వడం ఆందోళన రేపుతున్నా... టీమిండియా బౌలింగ్ ప్రత్యర్థిని కట్టడిచేసే స్థాయిలోనే ఉంది. బుమ్రా వికెట్ టేకర్‌గా ఉన్నాడు. హార్దిక్, అర్షదీప్ కూడా రాణిస్తే న్యూజిలాండ్‌కు కష్టాలు తప్పవు.అహ్మదాబాద్‌లో చక్కని ట్రాక్ రికార్డు ఉన్న వరుణ్‌తో పాటు అక్షర్ పటేల్.. స్పిన్నర్లకు అనుకూలించే అహ్మదాబాద్ పిచ్‌పై ప్రభావం చూపే ఛాన్స్ ఉంది.



### అహ్మదాబాద్ ఎవరిదో?

అహ్మదాబాద్‌లో టీమిండియాకు మిశ్రమ ఫలితాలు వచ్చాయి. గ్రూప్ స్టేజ్‌లో నెదర్లాండ్స్‌పై 17రన్స్‌తో నెగ్గగా, సూపర్8లో సౌతాఫ్రికా చేతిలో 76 పరుగుల తేడాతో ఓడింది. ఈ రెండుసార్లు కూడా బ్యాటింగ్‌లో తడబడింది. దూబే ఒక్కడే సక్సెస్ అయ్యాడు. నెదర్లాండ్స్‌పై 66, సౌతాఫ్రికాపై 42 రన్స్ సాధించాడు. సెంటిమెంట్ పరంగానూ టీమిండియాకు కాస్త ఇబ్బందికరమే. ఇదే వేదికపై 2023 వన్డే వరల్డ్‌కప్ ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో ఓడింది. మరోవైపు న్యూజిలాండ్ ఇక్కడ ఆడింది ఒక్క మ్యాచే. గ్రూప్ మ్యాచ్‌లో సౌతాఫ్రికా చేతిలో దారుణంగా ఓడింది.

అహ్మదాబాద్ పిచ్ ఎర్రమట్టి,నల్లరేగడి మట్టి మిశ్రమంతోరూపొందించారు.ఎర్రమట్టితో చేసిన పిచ్‌బ్యాటింగ్‌కు బాగా అనుకూలిస్తోంది.ముంబైలో ఇదే జరిగింది.అహ్మదాబాద్‌లో నల్లరేగడి మట్టితో చేసిన పిచ్‌పై సౌతాఫ్రికా చేతిలో బోల్తా కొట్టింది. మిశ్రమ మట్టితో తయారైన స్పోర్టింగ్ పిచ్ ఎదురుకానుంది. బౌలర్లకు కాస్త బౌన్సీగా ఉండటంతో పాటు..బ్యాటర్లకు కూడా అనుకూలిస్తుంది. 200 పరుగులు రావచ్చని అంచనా.

కాగా టీ20 ప్రపంచకప్‌లో భాగంగా ఇక్కడ 5 మ్యాచ్‌లలో పేస్ బౌలింగ్‌లో 762 బంతుల్లో బ్యాటర్లు 1062 రన్స్, స్పిన్ బౌలింగ్‌లో 421 బంతుల్లో బ్యాటర్లు 617రన్స్ రాబట్టారు. సాధించారు.ఫాస్ట్ బౌలర్లకు 45వికెట్లు దక్కగా, స్పిన్నర్ల ఖాతాలో 20 వికెట్లు చేరాయి.

**ఫైనల్ చేరిన క్రమం** (భారత్)

సెమీస్‌లో ఇంగ్లాండ్‌పై 7 రన్స్‌తో విక్టరీ
సూపర్8:వెస్టిండీస్‌పై 5 వికెట్లతో విజయం
సూపర్8:జింబాబ్వేపై 73 రన్స్‌తో గెలుపు
సూపర్8:సౌతాఫ్రికా చేతిలో 76 రన్స్‌తో ఓటమి
గ్రూప్-ఎ: నెదర్లాండ్స్‌పై 17 రన్స్‌తో విజయం
గ్రూప్-ఎ: పాకిస్థాన్‌పై 61రన్స్‌తో గెలుపు
గ్రూప్-ఎ: నమీబియాపై 93 రన్స్ విజయం
గ్రూప్-ఎ: అమెరికాపై 29రన్స్‌తో గెలుపు

**టీమిండియా(అంచనా)**

అభిషేక్ శర్మ, సంజూ సాంమ్సన్(వికెట్ కీపర్), ఇషాన్ కిషన్, సూర్యకుమార్ యాదవ్(కెప్టెన్), తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, అక్షర్ పటేల్, జస్‌ప్రీత్ బుమ్రా, అర్షదీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి

**న్యూజిలాండ్(అంచనా)**

టిమ్ సీఫర్ట్,ఫిన్ అల్లెన్, రచిన్ రవీంద్ర,గ్లెన్ ఫిలిప్స్, డారెల్ మిచెల్, మార్క్ చాంప్‌మన్, మిచెల్ సాంట్నర్(కెప్టెన్),మాట్ హెన్రీ,ఇష్ సోది,ఫర్గ్యూసన్,జాకబ్ డఫీ

**ఫైనల్ చేరిన క్రమం** (న్యూజిలాండ్)

సెమీస్‌లో సౌతాఫ్రికాపై 9 వికెట్లతో విజయం
సూపర్8: ఇంగ్లాండ్ చేతిలో 4 వికెట్ల ఓటమి
సూపర్8: శ్రీలంకపై 61రన్స్ విక్టరీ
సూపర్8: పాకిస్థాన్‌తో మ్యాచ్ వర్షార్పణం
గ్రూప్-డి: కెనడాపై 8 వికెట్లతో విజయం
గ్రూప్-డి: సౌతాఫ్రికా చేతిలో 7 వికెట్ల ఓటమి
గ్రూప్-డి: యూఏఈపై 10 వికెట్ల విజయం
గ్రూప్-డి: ఆఫ్ఘనిస్థాన్‌పై 5 వికెట్ల విజయం

### పొట్టి ప్రపంచకప్ కివీస్‌కు దక్కేనా?

టీ20 ప్రపంచకప్ 2021లో రన్నరప్ నిలిచిన న్యూజిలాండ్... తొలిసారి కప్ అందుకోవాలని ఉవ్విళూరుతోంది.ఈ ప్రపంచకప్‌లో కివీస్ రికార్డేమీ ఘనంగా లేదు. గ్రూప్ స్టేజ్‌లో రెండోస్థానం పొందిన సాంట్నర్ సేన... సూపర్8 లక్కీ కొద్ది బెటర్ రన్‌రేట్‌తో గటెక్కింది. అయితే సెమీస్‌లో ఇంగ్లాండ్‌ను చిత్తుచేసి ఫైనల్‌కు వచ్చింది. ఆ జట్టుకు మెరుపు వీరులు, ఆల్‌రౌండర్లే అసలు బలం.ముఖ్యంగా ఓపెనర్లు సీఫర్ట్, ఫిన్ అలెన్ జోరు మీదున్నారు. ఫ్లైయింగ్ స్టార్ట్‌పై ఆశలు పెట్టుకుంది. రచిన్ రవీంద్ర ఆల్ రౌండ్ షో చేస్తున్నాడు.బ్యాట్‌తో మెరుపులు మెరిపిస్తూనే ఏకంగా 11వికెట్లు పడగొట్టాడు.ఆతర్వాత వచ్చే గ్లేన్ ఫిలిప్స్, ఛాంప్‌మన్, మిచెల్ దూకుడుగా ఆడగల దిట్టలు. భారత బౌలర్లకు అసలైన పరీక్షే. నీషమ్, కెప్టెన్ సాంట్నర్ లోయర్‌ఆర్డర్‌లో పరుగులు రాబట్టగలరు. బౌలింగ్‌లోనూ కివీస్ వైవిధ్యంగా ఉంది. సాంట్నర్, మెకాంచీ, రచిన్ రవీంద్ర రూపంలో స్పిన్నర్లు... మాట్ హెన్రీ, లూకీ ఫెర్గ్యూసన్, జేమ్స్ నీషమ్ రూపంలో పేస్ అటాక్ ఉంది. టీమిండియాను ఎంత వరకు కట్టడిచేస్తారో చూడాలి.

**హెడ్ టు హెడ్**

న్యూజిలాండ్‌పై టీ20ల్లో టీమిండియాదే పైచేయి. 30 మ్యాచ్‌ల్లో తలపడితే భారత్ 18, న్యూజిలాండ్ 11 గెలుపొందాయి. ఒక మ్యాచ్ టై అయింది. ఇక పొట్టి ప్రపంచకప్‌లో మాత్రం న్యూజిలాండ్‌దే పైచేయి. మూడు టీ20ల్లోనూ భారత్‌పై కివీస్ గెలుపొందింది.

**వెదర్ అప్‌డేట్**

ఫైనల్‌కు ఎలాంటి వర్షం గండం లేదు. అహ్మదాబాద్‌లో నేడు వర్షం కురిసే అవకాశం సున్నా. గాలిలో తేమ 22 శాతం. చక్కగా ఎండకాస్తుంది. రాత్రి సమయంలోనూ వేడిగా ఉంటుంది. గాలి వేగం గంటకు 10కి.మీ.

## ఆల్ ఇంగ్లాండ్ ఫైనల్లో లక్ష్యసేన్



**బర్మింగ్హామ్:** భారత షట్లర్ లక్ష్యసేన్... ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్ షిప్‌లో సంచలనాల మోత మోగిస్తున్నాడు. కెనడాకు చెందిన విక్టర్ లైయ్‌ను ఓడించి ఫైనల్లోకి దూసుకెళ్లాడు. మూడు గేమ్‌లలో పాటు జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో గంట 37 నిమిషాలు హోరాహోరీగా తలపడ్డారు. 12వ సీడ్ లక్ష్యసేన్ తొలి గేమ్‌ను 21-16తో నెగ్గి శుభారంభం చేశాడు. రెండో గేమ్‌లో పత్ర్యర్థి నుంచి ప్రతిఘటన ఎదురైంది. పుంజుకున్న 18వ సీడ్ విక్టర్... 21-18తో నెగ్గి సమం చేశాడు. కీలకమైన మూడో గేమ్‌లో లక్ష్యసేన్ మరింత జోరు చూపాడు. ఈసారి ఎలాంటి పొరపాట్లు చేయకుండా 21-15తో ముగించి ఫైనల్ చేరాడు. ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్ షిప్ ఫైనల్ చేరడం లక్ష్యసేన్‌కు ఇది వరుసగా రెండోసారి. 2022లో ఫైనల్ చేరిన లక్ష్యసేన రన్నరప్‌తో సరిపెట్టాడు. ఆదివారం జరిగే ఫైనల్లో చైనీస్ తైపీ ప్లేయర్ లిన్ చున్‌యి తో లక్ష్యసేన్ తలపడతాడు. మరో సెమీఫైనల్లో చున్‌యి... ప్రపంచ నెంబర్ టూ థాయిలాండ్ ప్లేయర్ కున్లావుట్‌ను ఓడించాడు.

## హైదరాబాదీ సాకర్ దిగ్గజం కన్నుమూత



**హైదరాబాద్:** సాకర్ దిగ్గజం ఎస్‌హెచ్ హమీద్(95) కన్నుమూశారు. కొంతకాలంగా వృద్ధాప్య సంబంధమైన అనారోగ్యంతో బాధపడుతున్నారు. మల్లేపల్లిలోని కుమారిడి ఇంటిలో తుదిశ్వాస విడిలారు. హమీద్ మృతికి హైదరాబాద్ ఫుట్‌బాల్ అసోసియేషన్‌తో పాటు పలువురు ఫుట్‌బాలర్లు సంతాపం వ్యక్తం చేశారు. ఎల్బీ స్టేడియంలోని ఫుట్‌బాల్ సంఘం కార్యాలయంలో హమీద్‌కు పుష్పాంజలి ఘటించారు.

1941 మార్చి 11న హైదరాబాద్ సమీపంలోని భువనగిరిలో హమీద్ జన్మించారు. 1960 రోమ్ ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత ఫుట్‌బాల్ జట్టు సభ్యుడు. ఆ ఒలింపిక్స్‌లో భారత్ అద్భుత ప్రదర్శనతో ఆరో స్థానంలో నిలిచింది. ఇప్పటివరకు భారత ఫుట్‌బాల్‌కు ఇదే అత్యుత్తమ ప్రదర్శన. లెఫ్ట్, రైట్, సెంటర్‌లో ఆడగల నైపుణ్యమున్న హమీద్...భారత్‌కు చిరస్మరణీయ విజయాలు అందించారు. 1964 ఆసియాకప్ రన్నరప్‌గా భారత్ నిలవడంతో కీలకపాత్ర పోషించారు.సైఫాబాద్ సైన్స్ కాలేజీకి, హైదరాబాద్ స్పోర్టింగ్, హైదరాబాద్ పోలీస్ జట్లకు హమీద్ ప్రాతినిధ్యం వహించారు. తర్వాతి కాలంలో కోల్‌కతాకు తరలివెళ్లి ప్రతిష్టాత్మక మహ్మదన్ స్పోర్టింగ్, ఈస్ట్ బెంగాల్ క్లబ్‌లకు ఆడారు. మహమ్మదన్ స్పోర్టింగ్ క్లబ్‌కు డ్యూరాండ్ కప్‌ను అందించారు. కోల్‌కతా నుండి ముంబైలోని మఫత్‌లాల్ క్లబ్‌కు మారి రోవర్స్ కప్ అందించారు.



## భగ్గుమన్న వంటగ్యాస్

### సిలిండర్‌పై రూ. 60 పెంపు.. వాణిజ్య సిలిండర్ కూడా హెచ్చింపు

**న్యూఢిల్లీ, మార్చి 7:** సామాన్య, మధ్య తరగతి ప్రజలపై మరోసారి ధరల భారం పడింది. దేశీయ చమురు మార్కెటింగ్ కంపెనీలు గ్యాస్ సిలిండర్ల ధరలను భారీగా పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. గృహ వినియోగ, వాణిజ్య సిలిండర్ల ధరలను పెంచుతున్నట్లు ప్రకటించాయి. పెరిగిన ఈ ధరలు శనివారం నుంచే దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చాయి. తాజా పెంపుతో 14.2 కిలోల డొమెస్టిక్ సిలిండర్‌పై రూ. 60 పెరిగింది. దీంతో ఢిల్లీలో సిలిండర్ ధర రూ. 853 నుంచి రూ. 913కి చేరింది. సుమారు 11 నెలలుగా స్థిరంగా ఉన్న వంట గ్యాస్ ధర ఇప్పుడు పెరగడం గమనార్హం. అయితే,ప్రధానమంత్రి ఉజ్వలయోజన లబ్ధిదారులకు ఈ ధరల పెంపు నుంచి మినహాయింపు ఇచ్చారు. వారికి పాత ధరలే వర్తిస్తాయని కేంద్రం స్పష్టంచేసింది.మరోవైపు, హోటళ్లు, రెస్టారెంట్లలో వినియోగించే 19 కిలోల కమర్షియల్ సిలిండర్ ధరను ఏకంగా రూ. 115 మేర పెంచారు. ఫలితంగా ఢిల్లీలో దీని ధర రూ. 1,883కి చేరింది. ఈ పెంపు ప్రభావంతో బయటఆహార పదార్థాల ధరలు కూడా పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. పశ్చిమాసియాలో ఇరాన్ ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరిగాయి. ఈ ప్రభావమే దేశీయ గ్యాస్ ధరల పెంపునకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. భారత్ తన ఇంధన అవసరాల్లో దాదాపు 90%దిగుమతులపైనే ఆధారపడటంతో, అంతర్జాతీయ పరిణామాలు దేశీయ ధరలపై నేరుగా ప్రభావం చూపుతున్నాయి.

## వాణిజ్యం

### మీషోకు ఐటిశాఖ రూ.1500 కోట్ల పన్ను నోటీసు!

**ముంబయి, మార్చి 7:** ఆన్‌లైన్ వాణిజ్యసంస్థ మీఒకకు ఆదాయపు పన్నుశాఖ రూ.1500 కోట్ల పన్ను చెల్లించాలని నోటీసులు పంపించింది. 2024-24 అసెస్‌మెంట్ సంవత్సరానికి సంబంధించి ఈ మొత్తం చెల్లించాలనిసూచించింది. డిమాండ్‌నోటీసుతో పాటు ఇతర సర్దుబాట్లరూపంలో కూడా కంపెనీ భారీ మొత్తం చెల్లించాల్సి ఉంటుందని తెలిపింది. కంపెనీ




కూడా ఈనెల 6వ తేదీ తమకు ఐటిశాఖ నోటీసులు ఇచ్చిందని, పనున డిమాండ్ రు.1499.73 కోట్లు అని కంపెనీ చెప్పింది. ఈ మొత్తంలోనే వడ్డీతోపాటు నోటీసు ఇచ్చిందని కంపెనీ వివరించింది. అయితే కంపెనీ ఈ నోటీసును పరిశీలనచేస్తోందని ఈ పన్ను డిమాండ్‌ను ఉన్నతస్థాయిలో సవాల్‌చేయనున్నట్లు కూడా ఆలోచిస్తోంది.ప్రస్తుతం కంపెనీ న్యాయనిపుణులు ఐటి నోటీసును మదింపుచేస్తున్నారు. అంతకుముందు అసెస్‌మెంట్ సంవత్సరం 2022-23లో కూడా కంపెనీ నోటీసులు అందుకుంది. కర్ణాటక హైకోర్టు అంతకుముందు ఇచ్చిన డిమాండ్ నోటీసుపై తాత్కాలిక ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం కోర్టులో ఈకేసు పెండింగ్‌లోఉంది. అయితే ప్రస్తుత నోటీసువల్ల కంపెనీ వాణిజ్యకార్యకలాపాలపై ఎలాంటి ప్రభావం చూపించలేదని మీషో వెల్లడించింది.



## 308 మందికి పెరిగిన భారత్ బిలియనీర్లు

### మొత్తం సంపద రూ.112.6 లక్షలకోట్లు

**న్యూఢిల్లీ, మార్చి 7:** భారత్‌లో సంపన్నుల సంఖ్య ఏటా పెరుగుతూనే ఉంది. తాజాగా విడు దలైన హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్2026 ప్రకారం ప్రపంచంలో అత్యధిక బిలియనీర్లు ఉన్న దేశాల జాబితాలో భారత్ మూడో స్థానంలో నిలిచింది. అమెరికా, చైనా తర్వాత భారత్ ఈ ఘనత సాధించింది. ప్రస్తుతం దేశంలో మొత్తం 308 మంది బిలియనీర్లు ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. దేశంలో సంపద సృష్టి, ఆర్థిక వృద్ధి బలంగా ఉందని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గతేడాదితో పోలిస్తే ఈసారి కొత్తగా 24 మంది బిలియనీర్ల జాబితాలో చేరారు. భారతీయ కుబేరుల మొత్తం సంపద 10 శాతం పెరిగి రూ.112.6 లక్షల కోట్లకు చేరింది. 199 మంది సంపద పెరగ్గా, 109 మంది సంపద తగ్గడం లేదా స్థిరంగా ఉండటం గమనార్హం. ఈసారి సంప్రదాయ రంగాలకు మించి ఇతర రంగాల వారు కూడా జాబితాలో చోటు దక్కించుకున్నారు. అత్యధికంగా హెల్త్‌కేర్ రంగం నుంచి 53 మంది, ఇండస్ట్రియల్ గూడ్స్ నుంచి 36 మంది, కన్స్యూమర్ గూడ్స్ నుంచి 31 మంది కొత్తగా ఈ జాబితాలో చేరారు. అయితే తక్కువ మంది ఉన్నప్పటికీ, ఇంధన రంగం (ఎనర్జీ) అత్యధిక సంపదను కలిగి ఉంది. కేవలం 8 మంది బిలియనీర్లే రూ.18.3 లక్షల కోట్ల సంపదతో దేశీయ కుబేరుల మొత్తం సంపదలో 16 శాతం వాటాను కలిగి ఉన్నారు. నగరాల వారీగా చూస్తే ముంబై 95 మంది బిలియనీర్లతో దేశంలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఆసియా బిలియనీర్ క్యాపిటల్ హోదాను మాత్రం ముంబై కోల్పోయింది. 133 మంది కుబేరులతో చైనాలోని షెన్‌జెన్ నగరం ఆసియాలో టాప్ ప్లేస్‌కు చేరింది. ముంబైలో కొత్తగా 15 మంది బిలియనీర్లు చేరగా, ఇది న్యూయార్క్ (14), లండన్ (9) కంటే ఎక్కువ కావడం విశేషం. భారతీయ బిలియనీర్లలో మహిళల వాటా 7 శాతంగా ఉంది. మొత్తం 23 మంది మహిళా కుబేరుల వద్ద రూ.9.8 లక్షల కోట్ల సంపద ఉన్నట్లు హురున్ నివేదిక తెలిపింది. ప్రపంచ సగటు వయసు (65) కంటే భారతీయ బిలియనీర్ల సగటు వయసు (67) ఎక్కువగా ఉంది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., IslamiaJr.College Compound, MGM Road, Warangal-506002. RNI No.64849 Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act.